www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
వరంగల్
బుధవారం | 6-8-2025
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 129
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి:ద్వాదశి మ.2:09 తదుపరి త్రయోదశి, నక్షత్రం: మూల మ.1:00 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.11:17-1:00, రా.11:00-12:40, దుర్ముహూర్తం: ఉ.11:55-12:46, అమృతఘడియలు: ఉ.6:10-7:52, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5.59, సూర్యాస్తమయం: 6.42
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆగిన చోటు నుంచే!?

'ఫాంహౌస్' కేసులోని కీలక వ్యక్తులతోనే బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్ మళ్లీ ఆరంభం?

నాడు బీజేపీ అగ్రనేత బీఎల్ సంతోష్ పేరు కేసులోకి.. నేడు ఆయన్నే కలిసిన గువ్వల

బీజేపీలో చేరనున్నట్లు ప్రకటన

సంతోష్‌ని కలిసిన మరో 'ఫాంహౌస్' నేత

14



ధరాలీలో వరద దాటికి కొట్టుకుపోతున్న నివాసాలు

పదేళ్లలో లక్ష కోట్లు కట్టాల్సిందే

అప్పుడే సర్కారుకు కాళేశ్వరం అప్పు నుంచి విముక్తి

రుణాల రీస్ట్రక్చరింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం యత్నాలు

కుదరదని తేల్చిచెప్పిన బ్యాంకింగ్‌యేతర ఆర్థిక సంస్థలు

ఆర్ఈసీ నుంచి అత్యధికంగా 10.90% వడ్డీతో రుణం

కాళేశ్వరం కార్పొరేషన్‌ను నిరర్థక ఆస్తిగా ప్రకటిస్తేనే రుణాల రీస్ట్రక్చర్

ఆర్ఈసీ స్పష్టీకరణ.. ప్రాజెక్టు నిరుపయోగం.. సర్కారుపై రుణ భారం!

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకొని ఒక వాహనం కొన్నాం. కొనుక్కున్న కొద్ది రోజులకే అది ప్రమాదానికి గురై, బాగా దెబ్బతింది. సాంకేతిక కారణాలతో దాన్ని బాగుచేయడానికి చాలా సమయం పడుతుందని సంబంధిత కంపెనీవాళ్లు చెప్పారు. అంటే ఆ వాహనం మనకు ఉపయోగపడదు. కానీ, ఆ వాహనంపై తీసుకున్న రుణానికి అసలు, వడ్డీల రూపంలో వాయిదాలు చెల్లిస్తూనే ఉండాలి. ఓ వైపు వాహనాన్ని వినియోగించుకోలేకపోతుండగా.. మరో వైపు రుణ భారం మోయాల్సి వస్తుంది. గత ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పి, నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ఇదే! ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. కానీ, దానిపై తీసుకున్న రుణాలు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారాయి. మరో పదేళ్ల చెల్లింపులు చేయాల్సి ఉంది. అసలు, వడ్డీ కింద రూ.లక్ష కోట్లకు పైనే చెల్లించాల్సి ఉంది. చిల్లిగవ్వ ఆదాయం లేకున్నా, ప్రాజెక్టులోని అత్యంత కీలకమైన లింక్-1 పూర్తిగా నిర్వీర్యం అయినా.. సర్కారును మాత్రం రుణభారం పట్టిపీడిస్తోంది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కోసం జాతీయ బ్యాంకులతో పాటు బ్యాంకింగేతర సంస్థలైన రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)ల నుంచి రూ.87,449 కోట్ల రుణాలు మంజూరవగా.. అందులో రూ.71,566 కోట్లు విడుదలయ్యాయి. ఇక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కూడా కాళేశ్వరం కార్పొరేషన్ ఖాతా నుంచి రూ.10,000 కోట్ల రుణం మంజూరవగా.. అందులో రూ.7,722 కోట్లు విడుదలయ్యాయి. ఈ అప్పులకు ప్రభుత్వం ఇప్పటిదాకా అసలు, వడ్డీ కలిపి రూ.29,737.06 కోట్లు చెల్లించింది. ఇంకా రూ.64,212 కోట్ల అసలు, పదేళ్లలో దానికి వడ్డీ కింద

మిగతా 13వ పేజీలో...



కాళేశ్వరం నివేదిక.. కాంగ్రెస్ కుట్ర!

కేసీఆర్‌ను హింసించాలన్నదే రేవంత్ ఉద్దేశం

రాజకీయ దురుద్దేశంతో ఏర్పాటు చేసిన కమిషన్ల నివేదికలు న్యాయస్థానాల్లో నిలబడవు

కమిషన్ ఒకవైపే విచారించి నివేదిక ఇచ్చింది

ఉమా భారతి లేఖలోని విషయం దాచారు

తుమ్మిడిహెట్టి వద్ద నీరు లేకపోతే డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ ఎలా ఆమోదించింది?

అసెంబ్లీలో చర్చపెట్టండి.. సమాధానం చెప్తాం

ఈ ప్రాజెక్టు కేసీఆర్ ఒక్కడి నిర్ణయం కాదు..

క్యాబినెట్, అసెంబ్లీలోనూ చర్చించాం: హరీశ్

కాళేశ్వరంపై తెలంగాణ భవన్‌లో ప్రజెంటేషన్

12

ఉత్తరాఖండ్‌లో జలప్రళయం

2 గంటల వ్యవధిలో రెండుసార్లు మేఘవిస్ఫోటం

నలుగురి మృతి.. 70 మందికి పైగా గల్లంతు

గల్లంతైనవారిలో 11 మంది సైనికులు

కొండలపై నుంచి.. ముంచెత్తిన మెరుపు వరద

కన్నుమూసి తెరిచేంతలో పెద్ద పెద్ద భవనాలను సైతం కూల్చేస్తూ.. విధ్వంసం సృష్టించిన వెల్లువ

పూర్తిగా నీట మునిగిపోయిన ధరాలీ గ్రామం

పది నిమిషాల్లోనే రంగంలోకి దిగిన సైన్యం

స్థానిక యంత్రాంగంతో కలిసి సహాయకచర్యలు

బాధితులను అన్నివిధాలా ఆదుకుంటాం: ప్రధాని

మృతదేహాల గుర్తింపునకు కెడవర్ జాగిలాలు

పర్యావరణ విధ్వంసంతోనే వరదలు: నిపుణులు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లా ధరాలీ గ్రామాన్ని జలప్రళయం ముంచెత్తింది! మంగళవారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో.. క్లౌడ్‌బరస్ట్ (మేఘ విస్ఫోటం- ఒకేచోట కుండపోతగా వర్షం కురవడం) దెబ్బకు ప్రళయ వేగంతో దుంకిన గంగమ్మ (ఖీర్ గంగానది).. దారిలో ఉన్న చెట్టు, చేమ, బురదను కలుపుకొని కిందికి ప్రవహించింది! కొండచరియలను సైతం నుగ్గునుగ్గు చేస్తూ దూసుకొచ్చిన ఆ వెల్లువ ధాటికి గ్రామంలోని ఇళ్లు, పెద్ద పెద్ద భవనాలు పేకమేడల్లా నేలకూలాయి. గుండెలదిరేలా హోరుమనే శబ్దంతో కమ్ముకొస్తున్న జలప్రళయం నుంచి తప్పించుకునేందుకు.. ప్రజలు ప్రాణాలు అరచేత పెట్టుకుని.. పెద్ద పెట్టున ఆర్తనాదాలు చేస్తూ పరుగులు తీశారు! కానీ.. కన్నుమూసి తెరిచేంతలోనే వరద బురద వారిని ముంచెత్తిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొదటి మేఘవిస్ఫోటం జరిగిన రెండు గంటల వ్యవధిలోనే.. అదే ప్రాంతంలోని సుఖీ పర్వతప్రాంతంపై మరో మేఘవిస్ఫోటం జరిగింది. దీంతో మరోసారి కొండలమీద నుంచి

మిగతా 2వ పేజీలో...



శ్లాబ్ కూలడంతో నాలాలో పడిన వాటర్ ట్యాంకర్

ట్యాంకర్‌ను మింగిన రోడ్డు!

హైదరాబాద్ బంజారాహిల్స్‌లో కూలిన 30 ఏళ్ల కిందటి నాలా శ్లాబ్

అందులో పడిపోయిన 10 వేల లీటర్ల వాటర్ ట్యాంకర్

ట్యాంకర్ డ్రైవర్‌ను, క్లీనర్‌ను బయటకు తీసిన స్థానికులు

10

మద్యం తాగించి.. చెవుల్లో పురుగుల మందు పోయించి..

భర్తను చంపించిన భార్య


అక్రమ సంబంధమే కారణం

కరీంనగర్‌లో దారుణం

యూట్యూబ్‌లో చూసి పథకం

భార్య, ప్రియుడు, మరో వ్యక్తి అరెస్టు

14



సత్యపాల్ మాలిక్ కన్నుమూత

2

జమ్మూకశ్మీర్‌తో పాటు పలు రాష్ట్రాల గవర్నర్‌గా సేవలు

పుల్వామా ఉగ్రదాడి, ఆర్టికల్ 370 రద్దుపై కేంద్రం మీద ఘాటు విమర్శలు

అవినీతికి పాల్పడ్డారంటూ సత్యపాల్‌పై సీబీఐ కేసు.. ఇంట్లో సోదాలు

ఈ నేపథ్యంలోనే అస్వస్థత.. మృతి

మారూబేనీ పారిశ్రామికవాడకు

వేయి ఎకరాలు!

మ్యాపులు సిద్ధం చేస్తున్న అధికారులు

ప్రభుత్వంతో జపాన్ కంపెనీ ప్రతినిధుల భేటీ

ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ఏరో స్పేస్ రంగాల్లో రూ.వెయ్యి కోట్లకు మించి పెట్టుబడులు!

త్వరలో శంకుస్థాపనకు సన్నాహాలు

12

ఫ్యూచర్ సిటీలో తొలి అభివృద్ధి కార్యక్రమం

బలవన్మరణాల రేటులో రాష్ట్రానికి

ఐదో స్థానం!

14

2018-22 మధ్య 43,729 ఆత్మహత్యలు

లక్ష జనాభాకు 26 బలవన్మరణాల నమోదు

జాతీయ సగటుకు రెండింతలు.. సిక్కిం టాప్

బీసీ రిజర్వేషన్ల సాధనకు

నేడు ఢిల్లీలో సమరం

సీఎం రేవంత్ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా.. బిల్లులను పార్లమెంటులో ఆమోదించాలని డిమాండ్

హస్తినకు మంత్రులు, ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నేతలు.. ధర్నాలో పాల్గొననున్న రాహుల్, ప్రతిపక్ష నేతలు

ధర్నాకు మద్దతు తెలపాలని 200 మంది ఇండియా కూటమి ఎంపీలకు కాంగ్రెస్ ఎంపీల లేఖలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై లోక్‌సభలో వాయిదా తీర్మానాల తిరస్కృతి

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పోరాటం దేశ రాజధాని ఢిల్లీ చేరుకుంది. ఎంత జనాభాకు అంత వాటా అనే రాహుల్ గాంధీ నినాదాన్ని ఆచరణలో పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ఉద్యమిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరుతూ బుధవారం జంతర్‌మంతర్ వద్ద ధర్నా

మిగతా 12వ పేజీలో...



ఢిల్లీలో ధర్నా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మహేశ్, మంత్రులు పొన్నం, వాకిటి

అవసరమైతే మళ్లీ రాజీనామా!

మునుగోడు ప్రజల కోసం ఏ త్యాగమైనా చేస్తా

గతంలో రాజీనామా చేస్తే ప్రభుత్వమే దిగొచ్చింది

13

పదవులు, పైసలు ముఖ్యమంత్రే తీసుకుపోతున్నారు

మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇక వారి ఇష్టం

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు

మా తమ్ముడికి మంత్రి పదవి హామీ.. నాకు తెలియదు

మంత్రి పదవి ఇచ్చే స్థాయిలో నేను లేను: మంత్రి వెంకట్‌రెడ్డి



యాదాద్రి జిల్లా లచ్చమ్మగూడెంలో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

మరో 24 గంటల్లో..

భారత్‌పై భారీగా సుంకాలు

రష్యా నుంచి చమురు కొనుగోళ్లే కారణం



భారత్ మంచి వాణిజ్య భాగస్వామి కాదు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

నచ్చిన వాణిజ్య భాగస్వామిని ఎంచుకునే హక్కు భారత్‌కు ఉంది: రష్యా

ట్రంప్.. 'దోస్త్ దోస్త్ నా రహా'!..

ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఎద్దేవా

మాస్కోలో పర్యటించనున్న అజిత్ దోవల్

భారత్‌ను దారికి తెచ్చుకుని.. చమురు అమ్మాలన్నదే ట్రంప్ ప్లాన్!

న్యూయార్క్, ఆగస్టు 5: రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై భారత్ వెనక్కి తగ్గని నేపథ్యంలో మరింత భారీగా సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మంగళవారం న్యూయార్క్‌లో ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశంపై మాట్లాడారు. "భారత్ అత్యధిక సుంకాలు వసూలు చేసే దేశం. అన్నిదేశాల కంటే కూడా ఎక్కువ. భారత్ మంచి

మిగతా 2వ పేజీలో...

ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ చదివిన తెలంగాణ విద్యార్థులూ



స్థానికులే

3

మెడికల్ ప్రవేశాల్లో వాళ్లను పరిగణించాల్సిందే.. ఆ మేరకు మధ్యంతర ఉత్తర్వులిస్తాం

రాబోయే రూల్ తెలియకపోవడం వాళ్ల తప్పుకాదు.. వాళ్లపై వివక్షను మేం అనుమతించం

నాలుగేళ్ల స్థానికత రూల్ 2028 నుంచి పెట్టుకోండి.. రాష్ట్ర ప్రభుత్వానికి సీజేఐ సలహా

తెలంగాణలో స్థానికత అంశంపై తీర్పు రిజర్వు

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మార్చి తర్వాత భారీగా పరిశ్రమలు

» సీఐఎస్‌ఎఫ్ సంఖ్య 2.20 లక్షలకు పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది సంఖ్యను మరో 20 వేల మేర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 2 లక్షలుగా ఉన్న సిబ్బంది సంఖ్యను 2.20 లక్షలకు పెంచనున్నట్లు హోంశాఖ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపింది. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 2026 మార్చి తర్వాత రాబోయే పరిశ్రమలు, విమానాశ్రయాలు, పోర్టులు వంటి కీలక రంగాలకు భద్రత పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు సంస్థల్లో, సులువైన విధులు ఉండే చోట పనిచేస్తున్న సిబ్బందిని క్రమం తప్పకుండా వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలని కూడా హోంశాఖ ఆదేశించింది. కాగా, 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని అంతంచేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖనిజ వనరులు అధికంగా లభించే ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో మావోయిస్టులను అంతం చేసి అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తున్నట్టు సమాచారం.

ధర్మస్థలలో 100 ఎముకలు లభ్యం

బెంగళూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధర్మస్థలలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆధ్వర్యంలో జరుగుతున్న తవ్వకాలలో ఇప్పటి వరకు 100 ఎముకలు లభ్యమయ్యాయి. మరో 3 అస్థిపంజరాలు లభ్యమయ్యాయని ప్రచారాన్ని సిట్ తోసిపుచ్చింది. ఫిర్యాదుదారు చూపించిన 13 ప్రదేశాలకుగాను ఇప్పటి వరకు 12 ప్రదేశాల్లో తవ్వకాలు జరిపారు. బుధవారం 13వ ప్రదేశంలో తవ్వకాలు చేపట్టనున్నారు. అవసరమైతే మరిన్ని ప్రాంతాల్లోనూ తవ్వకాలకు సిద్ధంగా ఉన్నామని సిట్ వర్గాలు తెలిపాయి. 6వ ప్రదేశంలోనూ, 11వ ప్రదేశానికి 100 మీటర్ల దూరంలోని 11-ఏ ప్రదేశంలోనూ ఎముకలు లభించాయి. ఆ ఎముకలను ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నారు. 11వ ప్రదేశంలో కాకుండా బంగ్లగుడ్డ తవ్వకాలు జరపాలని ఫిర్యాదుదారు కోరిన నేపథ్యంలో సోమవారం అక్కడ(11-ఏ) జరిపిన తవ్వకాలలో ఒక అస్థిపంజరం లభించింది. అయితే, 11-ఏ ప్రదేశంలో కనీసం మూడు అస్థిపంజరాలు లభించాయని బాధితుల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. వాటిలో ఒకటి మహిళది, ఒక చీర కూడా లభ్యమైందని చెప్పారు. అయితే, దీన్ని పోలీసులు తోసిపుచ్చారు.

రూ.67వేల కోట్ల రక్షణ కొనుగోళ్లకు డీఏసీ ఓకే

న్యూఢిల్లీ, ఆగస్టు 5: కీలక మిలటరీ ప్రాజెక్టులకు మంగళవారం రక్షణ ఉత్పత్తుల కొనుగోలు మండలి(డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్-డీఏసీ) ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ మండలి సమావేశంలో రూ.67వేల కోట్లు విలువ చేసే ప్రాజెక్టులకు అంగీకారం తెలిపింది. ఇందులో దీర్ఘ గమన డ్రోన్లు, పర్వతప్రాంత రాడార్లు, క్షిపణుల వ్యవస్థలు ఉన్నాయి. నేవీ కోసం 'కాంపాక్ట్ ఆటోనమస్ సర్ఫేస్ క్రాఫ్ట్', బ్రహ్మోస్ ఫైర్ కంట్రోల్ సిస్టంతో పాటు లాంచర్లను కొనుగోలు చేయనుంది. బరాక్-1 క్షిపణి వ్యవస్థ స్థాయిని పెంచనుంది. వాయుసేన కోసం పర్వతప్రాంత రాడార్లు, సాక్షం/స్పైడర్ ఆయుధ వ్యవస్థలను కొనుగోలు చేయనుంది. మూడు దళాల కోసం మానవ రహిత విమాన లైన్ మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (మేల్) రిమోటిలీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఆర్‌పీఏ)లను సేకరించనుంది. ఈ విమానాలు 35వేల అడుగుల ఎత్తులో 40 గంటలపాటు ఎగరగలవు. అనుమతి లభించింది. ఇదిలా ఉండగా, నాలుగు పోర్ట్ క్యారియర్‌తో వ్యూహాత్మక రక్షణ పరికరాల రవాణాకు వినియోగించే హై మొబిలిటీ వెహికిల్స్ (హెచ్‌ఎంవీ)ను తయారు చేసేందుకు ఆర్మీ నుంచి భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) రూ.282 కోట్ల విలువైన ఆర్డర్ దక్కించుకుంది.

కెనడాలో ఖలిస్థాన్ దౌత్యకార్యాలయం

న్యూఢిల్లీ, ఆగస్టు 5: భారత్, కెనడాల మధ్య నెలకొన్న వివాదాలు ఇప్పుడిప్పుడే సమసిపోతున్నాయన్న సంకేతాలు వస్తున్న సమయంలో కెనడాలోని సర్రే ప్రాంతంలో ఖలిస్థాన్ దౌత్యకార్యాలయం ఏర్పాటు ఇరు దేశాలపై మరోసారి తీవ్ర ప్రభావం చూపేలా చేసింది. ఖలిస్థాన్ తీవ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు గురైన బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్‌లోని సర్రేలో ఉన్న గురునానక్ సిఖ్ గురుద్వారా ప్రాంతంలో 'ఎంబసీ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఖలిస్థాన్' పేరుతో నిజ్జర్ మద్దతు దారులు సంస్థాగతంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ గురుద్వారాకు ఒకప్పుడు నిజ్జర్ నాయకత్వం వహించాడు. నిజ్జర్‌కు గుర్తుగానే ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన మద్దతు దారులు ప్రకటించారు.

ఈడీ విచారణకు అనిల్ అంబానీ హాజరు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: మనీలాండరింగ్ కేసులో విచారణ నిమిత్తం రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ (66) మంగళవారం ఈడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. ఉదయం 10.50 నిమిషాలకు ఆయన విద్యుత్తు వాహనంలో ఈడీ కార్యాలయానికి వచ్చారు. వివిధ బ్యాంకుల నుంచి తన గ్రూపులోని కొన్ని కంపెనీల పేరున తీసుకున్న రూ.17వేల కోట్ల రుణాలను అదే గ్రూపులోని మరికొన్ని కంపెనీలకు మళ్లించారంటూ నగదు అక్రమ చెలామణి నిరోధక చట్టం (పీఎల్‌ఎంఏ) చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది.

భారత్-ఫిలిప్పీన్స్ మధ్య 9 ఒప్పందాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: సహజ సిద్ధ మిత్రులైన భారత్, ఫిలిప్పీన్స్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మకంగా బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాయని ప్రధాని మోదీ తెలిపారు. భారత్ పర్యటనకు వచ్చిన ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినండ్ ఆర్ మార్కోస్ జూనియర్, ప్రధాని మోదీ మధ్య మంగళవారం ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిగాయి. సైనిక బలగాల సంయుక్త విన్యాసాలు పెంపొందించుకునే వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతానికి ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఇరు దేశాల నౌకాదళాల సంయుక్త విన్యాసాలు జరిపిన మరునాడే తొమ్మిది భాగస్వామ్య ఒప్పందాలపై ఇరు దేశాల అధికారులు సంతకాలు చేశారు.

బంగ్లా ఎన్నికలు ఫిబ్రవరిలో: యూనస్

ఢాకా, ఆగస్టు 5: బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగుతాయని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వంలోని ముఖ్య సలహాదారు మహమ్మద్ యూనస్ తెలిపారు. ప్రధానిగా షేక్ హసీనా పదవీచ్యుతురాలై ఏడాది అయిన సందర్భంగా ఢాకాలో ఓ టీవీ చానెల్‌తో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. రంజాన్ మాసం 2026 ఫిబ్రవరి 17-18న మొదలవుతుందని, ఆ లోపే ఎన్నికలు పూర్తిచేయాలని ఎన్నికల సంఘాన్ని లేఖ ద్వారా కోరినట్టు ఆయన వెల్లడించారు.

కూల్‌డ్రింక్స్‌తో డిమెన్షియా ముప్పు!

డైట్ సోడాతోనూ అంతే నష్టం



న్యూఢిల్లీ, ఆగస్టు 5: రోజూ శీతల పానీయాలు తాగడం వల్ల పక్షవాతం, డిమెన్షియా వచ్చే అవకాశం మూడింతలు పెరుగుతుందని, డైట్ సోడాతోనూ అంతే ప్రమాదమని తాజా అధ్యయనంలో వెల్లడించారు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ మాస పత్రికలో ఈ అధ్యయన నివేదిక ప్రచురితమయింది. ఈ అధ్యయనకారులు 45 ఏళ్లు దాటిన 2,800 మందిని పదేళ్లపాటు పరిశీలించారు. వారి పరిశోధనలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెల్లడయ్యాయి. "కూల్ డ్రింక్ తాగిన ఒక గంటలో మన శరీరంలో 10 టీ స్పూన్ల షుగర్ డంప్ అవుతుంది. 20 నిమిషాల్లో రక్తంలో షుగర్ శాతం పెరుగుతుంది. బదులుగా పెరిగిన ఇన్సులిన్‌ను అనుగుణంగా మన శరీరం స్పందిస్తుంది. సుమారు 40 నిమిషాలకు కెఫిన్ మన రక్తంలోకి పూర్తిగా ఇంకుతుంది. ఇది మన రక్తపోటును (బీపీ) పెంచుతుంది. లివర్‌ను ట్రిగ్గర్ చేయడంతో రక్తంలోకి మరింత షుగర్ విడుదల అవుతుంది. బ్రెయిన్‌లోని సంతోష కేంద్రాలను డోపమైన్ ఉత్తేజపరుస్తుంది. 60 నిమిషాల తర్వాత కాల్షియం, మరికొన్ని కీలక లవణాలతో కలిసి ఫాస్పోరిక్ యాసిడ్ మన పేగుల్లో ఇబ్బంది కలుగజేస్తుంది. మూత్రపిండాల ద్వారా కెఫిన్ ద్వారా వేగంగా వెళ్లిపోవడంతో అవి మాత్రం ద్వారా బయటకు వెళ్లడం ప్రారంభమవుతుంది" అని ఆ అధ్యయనం వివరించింది. "డైట్ సోడాలు తాగేవాళ్లకు వాటిలోని కృత్రిమ స్వీటెనర్లతో పక్షవాతం, డిమెన్షియా వచ్చే ప్రమాదం మూడింతలు పెరుగుతుంది" అని తెలిపింది. శీతల పానీయాలు/డైట్ సోడాలతో నేరుగా ప్రమాదం జరుగుతుందని చెప్పలేం కానీ, ప్రమాద ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయని మాత్రం చెప్పవచ్చని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ మాస పత్రికలో ప్రచురితమైన వ్యాసం పేర్కొంది.

ఉత్తరాఖండ్‌లో జలప్రళయం

(మొదటి పేజీ తరువాయి)

నీరు ధరాలీ గ్రామాన్ని ముంచెత్తింది. అధికారిక సమాచారం ప్రకారం ఈ విలయంలో ఇప్పటి దాకా నలుగురు మరణించగా.. 11 మంది సైనికులు సహా 70 మందికి పైగా గల్లంతయ్యారు! అయితే.. మృతుల సంఖ్య భారీగా ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. ప్రవాహంలో 20-25 హోటళ్లు కొట్టుకుపోయాయని రాజేశ్ పన్వర్ అనే స్థానికుడు తెలిపారు. "చూస్తుండగానే ఇళ్లు, మార్కెట్లు, హోటళ్లు తుడిచిపెట్టుకుపోయాయి. ఇలాంటి విలయాన్ని నేను ఇంతకుముందెన్నడూ చూడలేదు" అని మరో ప్రత్యక్షసాక్షి తెలిపారు. వరదనీరు, విరిగిపడ్డ కొండచరియల కారణంగా ఆ ప్రాంతంలోని ఐదు జాతీయ రహదారులు, ఏడు రాష్ట్ర రహదారులు సహా మొత్తం 163 రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కాగా.. వరద చుట్టుముట్టిన పదినిమిషాల వ్యవధిలోనే సమీపంలో ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. ధరాలీకి 4-5 కిలోమీటర్ల దూరంలో ఉన్న హర్షిల్ క్యాంప్ నుంచి నుంచి 150 మంది సైనికులు అక్కడికి చేరుకుని విపత్తు స్పందన చర్యలు చేపట్టారు. ముంపులో చిక్కుకుపోయిన స్థానికులను కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే.. ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) బృందాలు చేరుకున్నాయి. ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు స్పందన దళాలు, జాతీయ విపత్తు స్పందన దళాలు, ఉత్తరకాశీ జిల్లా యంత్రాంగం.. అంతా కలిపి 400 మందికిపైగానే సహాయకచర్యల్లో పాల్గొంటున్నారు. క్యాంపు దెబ్బతిని, 11 మంది సైనికులు గల్లంతైన క్లిష్టపరిస్థితుల్లోనూ మా సైనికులు ఎలాంటి ఒత్తిడికీ లోనుకాకుండా, దృఢ నిశ్చయంతో సహాయకచర్యల్లో పాల్గొనడం వారి నిబద్ధతకు, ధైర్యానికి నిదర్శనం అని ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు.. ధరాలీ ప్రాంతంలో మంగళవారం ఒక్కరోజే 21 సెం.మీ.వాన కురవడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. రానున్న 2-3 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. దీంతో స్థానికులంతా బిక్కుబిక్కుమంటున్నారు. వర్షాలు, వరదల ముప్పు నేపథ్యంలో.. డెహ్రాడూన్, హరిద్వార్ సహా ఉత్తరాఖండ్‌లోని పలు జిల్లాల్లో పాఠశాలల మూసివేతకు అధికారులు ఆదేశాలిచ్చారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో జూన్ నుంచి సెప్టెంబర్ దాకా భారీ వర్షాలు సహజమే గానీ.. ఇటీవలికాలంలో కొండలను నాశనం చేసి పెద్దఎత్తున కట్టడాలు నిర్మించడంతో పర్యావరణం దెబ్బతిం టోందని, దాని పరిణామే ఫ్లాష్ ఫ్లడ్స్ సంఖ్య, తీవ్రత పెరుగుతోందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.



వరదలో చిక్కుకున్న బాధితుడిని రక్షిస్తున్న సైనికులు



కొండల్లో నుంచి ఇళ్ల మీదకు దూసుకువస్తున్న వరదనీళ్లు

గంగోత్రికి దగ్గర్లోనే..

చార్‌ధామ్ యాత్రలో భాగంగా.. గంగానది పుట్టిన చోటు అయిన గంగోత్రికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఈ ధరాలీ గ్రామం ఉంది. హృషీకేశ్ నుంచి బయల్దేరే యాత్రికులు ఉత్తరకాశీ, హర్షిల్, ధరాలీ మీదుగా గంగోత్రికి చేరుతారు. అలకనంద నది ఒడ్డున.. అద్భుతమైన ప్రకృతి సౌందర్యంతో విరాజిల్లే ఈ గ్రామంలోని ఇళ్లు, హోటళ్లు, ఆశ్రమాల్లో చాలా మంది యాత్రికులు బస చేస్తారు. వారికోసం అక్కడ పెద్ద సంఖ్యలో రెస్టారెంట్లు కూడా ఉంటాయి. ఈ గ్రామానికి పై నుంచి ప్రవహించే ఖీర్ గంగ (ఇది గంగానదికి ఉపనది. పాల నురగలా తెల్లగా ఉంటుందని అలా పిలుస్తారు) పరీవాహక ప్రాంతంలో మేఘవిస్ఫోటం జరిగి కుంభవృష్టి కురవడంతో ఈ ప్రళయం సంభవించింది. దీంతో ధరాలీ గ్రామం పూర్తిగా నీటమునిగింది. గంగోత్రికి రోడ్డు సంబంధాలు తెగిపోయాయి. కాగా.. ఈ విలయంలో చనిపోయిన, గల్లంతైన వారి కుటుంబాలకు ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. బాధితులను తాము అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీతో మాట్లాడి.. సహాయక చర్యల నిమిత్తం ఏడు బృందాలను అక్కడికి పంపారు.

ఏమిటీ క్లౌడ్‌బరస్ట్

కేవలం 20-30 కిలోమీటర్ల పరిధిలో.. గంట వ్యవధిలో.. కుంభవృష్టి (10 సెంటీమీటర్లు అంతకన్నా ఎక్కువ) కురిస్తే దాన్ని క్లౌడ్‌బరస్ట్ అంటారు. ఎక్కువగా కొండప్రాంతాల్లో జరిగే ఈ మేఘ విస్ఫోటం ప్రభావం చాలా ఎక్కువ ఉంటుంది. మంగళవారం ధరాలీని ముంచెత్తిన మెరుపువరదే ఇందుకు రుజువు.

గంగమ్మ దర్శనంతోనే స్వర్గ ప్రాప్తి!

వరద బాధితులతో యూపీ మంత్రి దారుణ వ్యాఖ్యలు

వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులు ఆశించేది.. ప్రభుత్వం నుంచి కాస్తంత భరోసా, బాధ్యతాయుత ప్రవర్తన! కానీ.. ఉత్తరప్రదేశ్‌లో వరదబాధితులను పరామర్శించడానికి వెళ్లిన మంత్రి అందుకు విరుద్ధంగా ప్రవర్తించారు. "మంత్రిగారూ మా ప్రాంతమంతా నీళ్లల్లో మునిగిపోయింది. మా ఇళ్లు కూలిపోయాయి. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాం.. మమ్మల్ని ఆదుకోండి" అని వారు వేడుకుంటే.. "గంగమ్మ తల్లి తన పిల్లల పాదాలు కడగడానికి వస్తుంది. ఆ తల్లి దర్శనంతోనే పిల్లలు నేరుగా స్వర్గానికి వెళ్తారు" అంటూ సందర్భం లేకుండా ఏదేదో మాట్లాడారు. ఆయన మాటలు విని.. బాధితులు నివ్వెరపోయారు. ధరాలీ గ్రామం గంగా నదీ తీరంలో లేదని, యమున ఒడ్డున ఉందని ఆ విషయం కూడా మంత్రికి తెలియదని వారు వాపోయారు.



ధరాలీలో బురద ప్రవాహంలో మునిగిపోయిన ఇళ్లు

లోకం తీరు



జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత



న్యూఢిల్లీ, ఆగస్టు 5: జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూశారు. దీర్ఘకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందారు. గోవా, బిహార్, మేఘాలయ, ఒడిశా రాష్ట్రాలకూ గవర్నర్‌గా సేవలందించిన ఆయన లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా కూడా తన రాజకీయ జీవితంలో అనేక పదవులు నిర్వహించారు. ఆర్టికల్ 370 రద్దు జరిగిన సమయంలోనూ.. పుల్వామా ఉగ్రదాడి జరిగిన సమయంలోనూ ఆయనే జమ్ముకశ్మీర్ గవర్నర్‌గా ఉన్నారు. పదవిలో ఉన్న సమయంలోనే.. పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను తరచూ విమర్శిస్తూ వార్తల్లో నిలిచారు. వ్యవసాయ చట్టాలపై మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే పుల్వామా ఉగ్రదాడి, ఆర్టికల్ 370 రద్దు వంటి కీలక ఘటనలపై మాలిక్ చేసిన వ్యాఖ్యలతో బీజేపీ ప్రభుత్వానికి, ఆయనకు మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. జమ్ముకశ్మీర్ గవర్నర్‌గా ఉన్న సమయంలో.. రూ. 2200 కోట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్టుల విషయంలో అవినీతికి పాల్పడ్డారంటూ సత్యపాల్ మాలిక్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు విచారణలో భాగంగా ఇటీవలే ఆయన ఇంట్లో సోదాలు జరిపిన సీబీఐ.. మాలిక్‌తో పాటు మరో ఐదుగురి పేర్లను చార్జిషీట్లో ప్రస్తావించింది. ఆ సమయంలోనే ఆయన ఆస్పత్రికి గురై ఆస్పత్రిలో చేరినట్టు తెలుస్తోంది. సత్యపాల్ మాలిక్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు.

అమెరికాను చమురు బేహారిగా మార్చేందుకే!

భారత్‌పై ట్రంప్ చింతనిప్పులు అందుకే

» రష్యాను కాదని, అమెరికా చమురు కొంటే భారత్‌కు 11 బిలియన్ డాలర్ల నష్టం

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఆగస్టు 5: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌ను పదే పదే ఎందుకు బెదిరిస్తున్నారు? సుంకాల మీద సుంకాలు బాదుతానని ఎందుకు ప్రకటనలు చేస్తున్నారు? ఈ ప్రశ్నలకు భారత్‌కు చమురు అమ్మేందుకే ట్రంప్ ఈ ఎత్తుగడలు వేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపారిత్మకంగా భారత్‌పై ఒత్తిడి పెంచి.. తన దారికి తెచ్చుకోవాలనే ఉద్దేశంతోనే ట్రంప్ ప్రకటనలు కనిపిస్తున్నాయి. అమెరికాలోని చమురు లాబీకి మద్దతివ్వడంతోపాటు.. అంతర్జాతీయ ఇంధన వ్యాపారాన్ని తనవైపు మళ్లించుకోవాలనే ఉద్దేశంతో ట్రంప్ ఓ లెక్కతో ముందుకు సాగుతూ.. 'వ్యూహాత్మక మిత్ర దేశాల'పై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నారు. భారత్ ప్రస్తుతం తన అవసరాల్లో 40% చమురును రష్యా నుంచి కొనుగోలు చేస్తోంది. రష్యా చమురు చవకగా లభించడమే కాకుండా.. అమెరికా డాలర్లతో కాకుండా.. భారతీయ రూపాయల్లోనే కొనుగోళ్లకు అవకాశముండడమే ఇందుక్కారణం.! రష్యా నుంచి ఈ ఏడాది జనవరి నుంచి రోజుకు సగటున 17.5 లక్షల బ్యారెళ్ల మేర ముడి చమురు భారత్‌కు దిగుమతి అవుతోంది. నిజానికి రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పుడు అమెరికా ప్రభుత్వమే.. అంతర్జాతీయంగా చమురు ధరలను స్థిరంగా ఉంచేందుకు మాస్కో నుంచి చమురు కొనాలని భారత్‌ను కోరింది. ఇటీవల ట్రంప్ వ్యూహాత్మకంగా భారత్‌ను టార్గెట్‌గా చేసుకుంటూ రావడానికి కూడా ఓ లెక్క ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ అమెరికా డాలర్‌ను బలహీనపరిచేందుకు బ్రిక్స్ దేశాలు ప్రయత్నిస్తున్నాయని ఇటీవల ఆరోపించారు. రష్యా చమురును రూపాయల్లో కొనుగోలు చేయడం కూడా ఇందులో భాగమేనని అమెరికా భావిస్తోంది. అమెరికాను ప్రపంచ చమురు బేహారిగా మార్చాలని ట్రంప్ కంకణం కట్టుకున్నారు. అందుకే.. అమెరికా చమురు కొనుగోళ్లకు 18 బిలియన్ డాలర్ల(రూ.1.5 లక్షల కోట్లు) మేర ప్రోత్సాహకాలను ప్రకటించారు. భారత్ లాంటి అతిపెద్ద చమురు వినియోగ దేశాలను తనవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

అమెరికాపై భారత సైన్యం వ్యంగ్యాస్త్రాలు

ట్రంప్ బెదిరింపులపై భారత సైన్యం వ్యంగ్యాస్త్రాలను సంధించింది. 1971 ఆగస్టు 5 నాటి ఓ పేపర్ క్లిప్పింగ్‌ను పోస్ట్ చేస్తూ.. అమెరికా తీరును ఎండగట్టింది. ఆ క్లిప్పింగ్ ప్రకారం భారత్-పాకిస్థాన్ యుద్ధానికి ముందు.. పాకిస్థాన్‌కు అమెరికా ఆయుధాలను సరఫరా చేసింది.దీనిపై అప్పటి రక్షణ ఉత్పత్తుల శాఖ మంత్రి వీసీ శుక్లా రాజ్యసభలో ఓ ప్రకటన చేశారు. "ఆయుధాల కోసం నాటో, సోవియట్ యూనియన్‌తో పాకిస్థాన్ సంప్రదింపులు జరిపింది. అయితే.. ఆ దేశాలు నో చెప్పాయి. కానీ, అమెరికా మాత్రం పాకిస్థాన్‌కు మద్దతిస్తూ.. ఆయుధాలను సరఫరా చేస్తూనే ఉంది" అని వ్యాఖ్యానించినట్లు ఆ పేపర్ క్లిప్పింగ్ స్పష్టం చేస్తోంది. ఇప్పుడు కూడా ట్రంప్ పాక్ పట్ల దయ చూపుతున్నారా? వారిపై టారిఫ్‌లను 19శాతానికి తగ్గించారు" అని భారత సైన్యం పేర్కొంది.

అమెరికా నుంచి ఎంత?

నిజానికి ఈ ఏడాది ప్రథమార్ధంలో అమెరికా నుంచి కొనే చమురును భారత్ 50% పెంచింది. అయినా.. భారత్ అవసరాల్లో ఇది కేవలం 8% మాత్రమే.! భారత్ కనీసం తన చమురు అవసరాల్లో 20% అమెరికా నుంచి కొనుగోలు చేస్తే.. ఈ రంగంలో అమెరికా ప్రాబల్యం పెరుగుతుంది. అందుకే ట్రంప్ బెదిరింపుల్తో కాకుండా.. భారత్‌పై ఒత్తిడి పెంచేలా.. వ్యూహాత్మకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజా సుంకాల పెంపుతో.. భారత్‌కు ఏటా 18 బిలియన్ డాలర్ల(రూ.1.5 లక్షల కోట్లు) మేర నష్టం వాటిల్లే ప్రమాదముంది. రష్యా నుంచి కాకుండా అమెరికా వద్ద ఎక్కువ ధరకు చమురు కొనుగోళ్లు చేస్తే.. 11 బిలియన్ డాలర్ల(రూ.91,500 కోట్లు) చెల్లించాల్సి ఉంటుంది. అమెరికాతో చమురు ఒప్పందాలు చేసుకుంటే.. భారత్‌కు 7 బిలియన్ డాలర్ల(రూ.58 వేల కోట్లు) మేర మిగులు ఉంటుందనేది ట్రంప్ లెక్కగా తెలుస్తోంది.

మరో 24 గంటల్లో..

భారత్‌పై భారీగా సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

వాణిజ్య భాగస్వామి కాదు. వాళ్లు అమెరికాతో చాలా వ్యాపారం చేస్తారు. కానీ అధిక సుంకాల కారణంగా భారత్‌తో అమెరికా పెద్దగా వ్యాపారం చేయలేదు. అందుకే భారత్‌పై 25శాతం సుంకాలు విధించాం. వచ్చే 24 గంటల్లో ఈ సుంకాలను మరింత భారీగా పెంచబోతున్నాం. రష్యా నుంచి భారత్ చమురు కొంటుండటమే దీనికి కారణం. దీనితో ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం రష్యాకు ఆవసరమైన నిధులు అందుతున్నాయి. అది నాకు ఇష్టం లేదు.." అని ట్రంప్ పేర్కొన్నారు. నిజానికి భారత్ తమ టారిఫ్‌లను సున్నాకు తగ్గించేందుకు కూడా సిద్ధపడింది.. కానీ రష్యా చమురు విషయంలో చేస్తున్న పని సరికాదని వ్యాఖ్యానించారు. రష్యా చమురు కొనుగోళ్ల అంశంలో అమెరికా, యూరోపియన్ యూనియన్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయంటూ భారత్ ఎండగట్టిన తర్వాత కూడా ట్రంప్ తాజా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



ట్రంప్‌తో 'దోస్త్ దోస్త్ నా రహా'!

భారత్‌పై అదనపు సుంకాలు వేస్తానన్న ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ట్రంప్, మోదీ స్నేహం ముగిసిపోయిందని పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రఖ్యాత హిందీ పాటను ప్రస్తావిస్తూ.. "దోస్త్ దోస్త్ నా రహా, ప్యార్ ప్యార్ నా రహా, ట్రంప్ తుమే తేరా ఐతబార్ నా రహా (నా స్నేహితుడు ఇప్పుడు స్నేహితుడు కాదు. నా ప్రేమ ఇప్పుడు ప్రేమ కాదు. ట్రంప్ నీ మీద నా నమ్మకం పోయింది). మంచి మిత్రులుగా చెప్పుకొనే మోదీ, ట్రంప్‌ల మధ్య స్నేహం పూర్తిగా కుప్పకూలిపోయి నట్లే.." అని వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లు మనకు పాకిస్థాన్, చైనాలతో సమస్య ఉండేది, కానీ ఇలా అమెరికాతో సంబంధాలు క్షీణిస్తాయని అనుకోలేదని చెప్పారు.

వాణిజ్య భాగస్వాములను ఎంచుకునే హక్కు ఉంటుంది. ఆర్థికపరంగా, వాణిజ్యపరంగా తమ ప్రయోజనాలకు అనుగుణంగా సొంతంగా నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంటుంది." అని రష్యా అధ్యక్ష కార్యాలయ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. మరోవైపు అమెరికా సెక్రటరీ చూపు కొనేందుకు దక్షిణ ప్రాంత దేశాలపై వలస వాద విధానాలు రుద్దుతోందని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా మండిపడ్డారు.

వాణిజ్య భాగస్వామిని ఎంచుకునే హక్కు భారత్‌కు ఉంది

రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దంటూ భారత్‌పై అమెరికా చేస్తున్న ఒత్తిడి సరికాదని, నచ్చిన వాణిజ్య భాగస్వామిని ఎంచుకునే హక్కు భారత్‌కు ఉందని రష్యా స్పష్టం చేసింది. "సార్వభౌమ దేశాలకు వారి

రష్యాలో పర్యటించనున్న దోవల్

భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యాలో పర్యటించనున్నట్టు తెలి

సింది. ఇరు దేశాల మధ్య ఇంధన, రక్షణ బంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా చర్చలు జరపనున్నట్టు సమాచారం. ఈ పర్యటన ముందే ఖరారైనా.. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయవద్దంటూ భారత్‌పై అమెరికా తీవ్ర ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో చర్చనీయాంశంగా మారింది.

ఎన్డీయే సహజ కూటమి!

» మిత్రపక్షాల కలివిడి అద్భుతం

» సుదీర్ఘకాలం కలిసి పనిచేద్దాం

» ఎన్డీయే ఎంపీల భేటీలో మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 5: "ఎన్డీయే సహజ కూటమి. మిత్రపక్షాల సామూహిక గుర్తింపునకు ఇది ప్రతిబింబం. 1998 నుంచి ఈ కూటమి అనేక విజయాలు దక్కించుకుంది. అయితే.. చేయాల్సిన పనులు, సాధించాల్సిన విజయాలు చాలానే ఉన్నాయి." అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దాదాపు ఏడాది తర్వాత ఎన్డీయే కూటమి పార్లమెంటరీ పార్టీ సమావేశం మంగళవారం జరిగింది. 2024, జూలై 2న తొలిసారి ఈ భేటీ జరిగింది. మళ్లీ మంగళవారమే ఎన్డీయే ఎంపీలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను 'అసాధారణ నాయకత్వం'తో విజయవంతం చేశారని ప్రశంసిస్తూ.. ఎన్డీయే మిత్రపక్షాల పార్లమెంటు సభ్యులు ప్రధానిని ఘనంగా సత్కరించారు. ఆదివిదంగా భారత భద్రతా దళాలు ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహదేవ్‌లను అంచంచల నిబద్ధతతో విజయవంతం చేశాయని పేర్కొంటూ ఓ తీర్మానాన్ని వెలువరించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. బీజేపీ సహా మిత్రపక్షాల సభ్యులు కలివిడిగా ఉన్నారని, ఈ కలివిడి మరింతగా పెరగాలని సూచించారు. "మనం సుదీర్ఘకాలం కలిసి నడవాల్సి ఉంది. సమన్వయం, సహకారంతో ముందుకు సాగుదాం" అని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడి, దీనికి భారత సైన్యం దీటుగా స్పందించిన తీరుపై పార్లమెంటులో చర్చ చేపట్టాలని కోరిన ప్రతిపక్షం.. తర్వాత చింతించే పరిస్థితి వచ్చిందని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీపై విమర్శలు గుప్పించారు. "భారత భూభాగం, భద్రతపై అవగాహన, ఆధారాలు లేకుండా ఆయన(రాహుల్) పిల్ల చేష్టలకు పోయారు. అందుకే కోర్టు ఆయనకు మొట్టికాయలు వేసి తగిన గుణపాఠం చెప్పింది." అని ఎద్దేవా చేశారు. పంద్రాగస్టును పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహించే తిరంగా ర్యాలీలో ఎన్డీయే ఎంపీలు ఉత్సాహంగా పాల్గొనాలని మోదీ సూచించారు.

అమిత్‌షా అరుదైన రికార్డు!

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అరుదైన ఘనత సాధించారు. అత్యధిక కాలం దేశ హోంమంత్రిగా పనిచేసిన నేతగా గుర్తింపు పొందారు. వాజ్‌పేయి హయాంలో బీజేపీ అగ్రనేత అద్వానీ 2,256 రోజులు (ఆరేళ్ల 64 రోజులు) హోంమంత్రిగా పనిచేయగా.. మంగళవారానికి 2,258 రోజుల(ఆరేళ్ల 66 రోజులు)తో షా ఆయన్ను అధిగమించారు. అమిత్‌షా 2019 మే 20న కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే పదవిలో కొనసాగుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ చదివిన
తెలంగాణ విద్యార్థులూ స్థానికులే

- మెడికల్ ప్రవేశాల్లో వాళ్లను పరిగణించాల్సిందే
- ఆ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వదలచుకున్నాం
- రాబోయే రూల్ తెలియకపోవడం వాళ్ల తప్పు కాదు
- వాళ్లపై వివక్ష చూపడాన్ని మేం అనుమతించం
- నాలుగేళ్ల స్థానికత రూల్ 2028 నుంచి పెట్టుకోండి
- రాష్ట్ర ప్రభుత్వానికి సీజేఐ జస్టిస్ గవాయ్ సలహా
- తెలంగాణలో స్థానికత అంశంపై తీర్పు రిజర్వ్



న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సీట్ల వ్యవహారంలో స్థానికత అంశానికి సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు వాదనలు ముగించింది. సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు సీజేఐ ధర్మాసనం వెల్లడించింది. మంగళవారం వాదనల సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఒక సందర్భంలో మాట్లాడుతూ, తెలంగాణ స్థానికులై ఉండి, ఏదో ఒక కారణంగా ఇంటర్మీడియట్ చదవడానికి ఇతర రాష్ట్రాలకు వెళ్లిన విద్యార్థులకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వదలచుకున్నానని స్పష్టం చేశారు. 2024 తర్వాత తెలంగాణలో నిబంధనలు మారబోతున్నాయని తెలియని కారణంగా వారు వివక్షకు గురి కావడాన్ని తాము అనుమతించబోమని తేల్చిచెప్పారు. అంతేకాకుండా, చివరి నాలుగేళ్లు రాష్ట్రంలోనే చదివి ఉండాలన్న నిబంధనల అమలుకు 2028 వరకు విరామం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచన కూడా ఇచ్చారు. వైద్య విద్యలో ప్రవేశానికి స్థానికతకు సంబంధించి నీట్‌కు ముందు నాలుగేళ్లు స్థానికంగా చదవాలని నిబంధనల చేర్చుతూ తెలంగాణ ప్రభుత్వం జీవో 33ని తీసుకొచ్చింది. జీవోలోని నిబంధన 3(ఏ)లో ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొంది. ఆ జీవోను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్‌తో పాటు మరో 160 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం వద్ద ఎటువంటి సరైన గైడ్‌లెన్స్ లేవని, ముందు గైడ్‌లైన్స్ రూపొందించాలని ఆదేశించింది. ఈ తీర్పును సవాల్ చేస్తు సెప్టెంబరు 11న తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై బుధవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని జస్టిస్ కె వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.

పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసమిది

తెలంగాణకు చెందిన పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ప్రయోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత నివాస నిబంధనను తీసుకువచ్చిందని తెలంగాణ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఆర్థికంగా స్థిరపడిన సంపన్న విద్యార్థులు లండన్, దుబాయ్ సహా ఇతర విదేశాలకు వెళ్లి 11, 12వ తరగతి చదువుకుంటే ఎక్కడైనా సులభంగా మెడికల్ సీట్లు పొందవచ్చని చెప్పారు. అలాంటి అవకాశాలు లేకుండా తెలంగాణ స్థానికతలో చదువుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఈ నిబంధనను తీసుకొచ్చామని వివరించారు. ప్రస్తుత విధానం రాజ్యాంగంలోని ఆర్టికల్ 371(డి) ప్రకారం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలకు ప్రభుత్వ విద్య, ఉపాధి అవకాశాల్లో సమాన అవకాశాలు, సౌకర్యాలు అందాలని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వేర్వేరు నిబంధనలు చేయవచ్చని అందులో ఉందని చెప్పారు. 1974 నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఏపీలో నివసిస్తున్న వారికి కూడా నివాస ప్రయోజనం ఇచ్చామని, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఈ ప్రయోజనాన్ని కటాఫ్ చేశామని వివరించారు. సివిల్ సర్వీసెస్, తదితర ఉద్యోగాల్లో భాగంగా తల్లిదండ్రులు ఇతర రాష్ట్రాలకు వెళ్లడం వల్ల అక్కడ చదువుకున్న పిల్లలకు మినహాయింపు కల్పిస్తున్నట్లు వివరించారు. లక్షల మంది తెలంగాణ స్థానిక విద్యార్థుల దృష్టి కోణంతో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అసోం, హరియాణా రాష్ట్రాలలో స్థానికత కేసుల్లో తీర్పులను ప్రస్తావించారు. స్థానిక పాఠశాలలో 10, 11, 12 చదవాలని హరియాణా నిబంధనలు చెబుతున్నాయన్నారు. అసోంలో 7-12 స్థానికంగా చదివితేనే మెడికల్ అర్హత పరీక్షకు అనుమతిస్తున్నారని తెలిపారు. ఏపీలోనూ స్థానికత అమలవుతోందని, ఒక్క తెలంగాణ విద్యార్థికి కూడా అక్కడ అవకాశం కల్పించడం లేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ విద్యార్థులకు తెలంగాణలో అవకాశం కల్పించాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ మెడికల్ సీట్లు ఎంతో ఖరీదైనవని, పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువ డబ్బులు వెచ్చించి చదివే పరిస్థితి ఉండదని చెప్పారు. స్థానికత పూర్తి స్థాయిలో వర్తిస్తేనే రాష్ట్రంలోని విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. హైదరాబాద్ సంపన్నవంతమైన నగరమని, ఈ కేసులో ఆర్థిక పరమైన అంశాలకు తావు లేదని, రెండేళ్లు వేరే రాష్ట్రంలో చదివితే తప్పేంటో చెప్పాలని సీజేఐ ప్రశ్నించారు. విదేశాల్లో చదివే విద్యార్థులకు కూడా ఎన్ఆర్ఐ కోటా ఉంటుంది కదా? దానిని ఎందుకు స్థానికతతో ముడిపెడుతున్నారు? అని అడిగారు. కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ వాదనలు వినిపిస్తూ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడులోనూ ఇటువంటి స్థానికత నిబంధనలు ఉన్నాయని చెప్పారు. ఇరు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్, సాంకేతిక, వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశాలు పదేళ్ల పాటు 371(డి) ప్రకారం జరుగుతాయని రాష్ట్ర విభజన చట్టంలోనే ఉందని, ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఇప్పుడు ఆ నిబంధన కాలం ముగిసినందున తెలంగాణ కొత్త నిబంధనలు తీసుకొచ్చిందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఆర్టికల్ 371(డి) గురించి తెలుసుకోవాలి అన్నట్లు వాదనలు వినిపించడం సరికాదని సీజేఐ వ్యాఖ్యానించారు. ఎనిమిదో తరగతిలోనే రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్నట్టుగా మీ వాదనలు ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. చదువుకోని తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థుల తరఫున సీనియర్ న్యాయవాది రాజేంత్ బసంత్, ఏఓఆర్ బీ దాస్ వాదనలు వినిపిస్తూ.. తెలంగాణలో పుట్టి పదో తరగతి వరకు చదివినా స్థానిక కోటా దక్కడం లేదని తెలిపారు. సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు ధర్మాసనం వెల్లడించింది. మరే ఇతర అభ్యంతరాలు ఉన్నా రాతపూర్వకంగా సమర్పించాలని ఇరు పక్షాల వారికి సూచించింది.

సౌదీ జైలులో తెలంగాణ యువకుడి మృతి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

వీసా నిబంధనలు ఉల్లంఘించినందుకు సౌదీ అరేబియాలో జైలు శిక్ష అనుభవిస్తున్న తెలంగాణ యువకుడు గుండెపోటుతో మరణించాడు. రాజన్న సిరిసిల్లా జిల్లా వేములవాడ మండలం నాంపల్లికి చెందిన దండుగుల రాజయ్య(42) సందర్శక వీసాపై ఆరేళ్ల క్రితం సౌదీకి వచ్చాడు. కానీ రాజయ్య ఆరేళ్ల పాటు సౌదీలో ఉండి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇలా వీసా గడువు ముగిసినా ఉండిపోయిన వారు భారీ జరిమానా చెల్లించడం ద్వారా లేదా జైలు శిక్ష అనుభవించిన తర్వాత స్వదేశానికి తిరిగి వెళ్లే అవకాశంఉంది. అయితే రాజయ్య జరిమానా చెల్లించే బదులు జైలుశిక్ష అనుభవించి, మాతృభూమికి తిరిగి వెళ్లాలనుకున్నాడు. ఈ క్రమంలో ఇటీవల అతను గుండెపోటుతో మరణించగా సౌదీ అధికారులు భారతీయ ఎంబసీ ద్వారా సోమవారం కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

అప్పు పుట్టక కౌలు రైతు ఆత్మహత్య

- అప్పులు తీర్చలేక మరో రైతు బలవన్మరణం



సమ్మయ్య(ఫైల్)



పడిపెల్లి విలాస్ (ఫైల్)

మంగపేట, బజార్‌హత్నూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పంటల సాగుకు అప్పు పుట్టక మనస్తాపానికి గురై ఒక రైతు.. చేసిన అప్పులు తీర్చలేక మరో రైతు బలవన్మరణానికి పాల్పడ్డారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన పరమాత్ముల సమ్మయ్య (52) పన్నెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో అప్పటికే అప్పుల పాలయ్యాడు. ఈ సారి సాగు చేసేందుకు తెలిసిన వారిని అప్పులు అడిగాడు. ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురైన సమ్మయ్య సోమవారం గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన పడిపెల్లి విలాస్(52) పత్తి, సోయా పంటను పండిస్తుంటాడు. భూమి తక్కువ ఉండడంతో వ్యవసాయ కూలీగా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కూతురు వివాహం కోసం రూ.5లక్షలు అప్పు చేశాడు. దీనికి తోడు పంట దిగుబడి రాక చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

యాంటీ సోషల్‌గా సోషల్ మీడియా

- వార్తల్లో నిజాలకే గానీ ఇజాలకు తావు ఉండొద్దు
- సామాజిక చరిత్రకు అద్దం పట్టేలా 'విలీనం-విభజన'
- నేను అభిమానించే పాత్రికేయుల్లో వెంకట్రావు ఒకరు
- పుస్తకావిష్కరణ సభలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, చిత్రంలో కె.శ్రీనివాస రెడ్డి, భండారు శ్రీనివాస రావు, కట్టా శేఖర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియా.. యాంటీ సోషల్‌గా మారుతోందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రాజకీయ నాయకులు, యూట్యూబర్లు వాడుతున్న భాష తీవ్ర అభ్యంతరకరంగా ఉంటుందని, ఈ విషయంలో వారంతా ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. హెడ్‌లైన్ డెడ్‌లైన్ కాకూడదన్నారు. బూతులు మాట్లాడే రాజకీయనేతలు ఒక్కరు కూడా మొన్నటి ఎన్నికల్లో గెలవలేదని, వాళ్లకు ఓటమే గతి అన్న విషయాన్ని గమనించాలని పరోక్షంగా వల్లభనేని వంశీ, కొడాలి నాని తదితర వైసీపీ నేతలను ఉద్దేశించి చురకలు అంటించారు. రాజకీయాలు సహా అన్ని రంగాల్లో ప్రమాణాలు పడిపోవడం బాధకరమని అన్నారు. రాజకీయ సభల్లో 4-బీ (బస్సు, బత్తా, బాటిల్స్, బిర్యానీ) కల్చర్ రావడం విలువల పతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. వార్తల్లో నిజాలకే గానీ ఇజాలకు తావు ఉండకూడదని సూచించారు. రాజకీయ నేతలు సొంతంగా మీడియా సంస్థలు నిర్వహించడం పాత్రికేయ స్ఫూర్తికి విఘాతమేనని, ప్రజాస్వామ్యానికీ మంచిదికాదని నొక్కిచెప్పారు. గ్రామీణ అంశాలు, మాతృభాషకు పత్రికలు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం సీనియర్ ఎడిటర్ ఇనగంటి వెంకట్రావు రచించిన 'విలీనం-విభజన, గతం-స్వగతం, మన ముఖ్యమంత్రులు' పుస్తకాన్ని మంగళవారం వెంకయ్య ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను అభిమానించే పాత్రికేయుల్లో ఇనగంటి వెంకట్రావు ఒకరని వెల్లడించారు. సమకాలీన రాజకీయాలు, సామాజిక చరిత్రకు ఈ పుస్తకం అద్దం పడుతుందని కొనియాడారు. రాజకీయాల్లోకి వచ్చిన యువతకు ఇది ఒక మంచి విషయ దీపిక అని అభివర్ణించారు. పాత్రికేయులతో పరిచయం, సంభాషణల వల్ల తాను ఎన్నో జీవితాలను చదివిన అనుభవాన్ని సముపార్జించగలిగానన్నారు. ప్రజాస్వామ్య సౌధానికి నాలుగో స్తంభమైన మీడియా బలంగా ఉండాలని ఆకాంక్షించారు. "మొదటి సారి అమ్మ శాశ్వతంగా దూరమైనప్పుడు, రెండో సారి ఉపరాష్ట్రపతి బాధ్యత చేపట్టడానికి ముందు అమ్మ లాంటి బీజేపీకి రాజీనామా చేయాల్సి వచ్చినప్పుడు నాకు దుఃఖం ఆగలేదు" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. రాజ్యాంగ పదవి చేపట్టిన నాటి నుంచి ఇంత వరకు ఎన్నడూ పార్టీ కార్యాలయానికి వెళ్లలేదని, విలువలకు లోబడి నడుచుకుంటున్నానని తెలిపారు. సభాధ్యక్షత వహించిన మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వెంకట్రావు రచనా శైలి ఓ ప్రవాహంలా సాగుతుందని కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు భండారు శ్రీనివాస రావు, కట్టా శేఖర్‌రెడ్డి, కె.రామచంద్రమూర్తి, అల్లం నారాయణ, శైలేష్ రెడ్డి, మాజీ సీపీఆర్వో వనం జ్వాలానరసింహారావు, విశ్రాంత ఐఏఎస్ కె.లక్ష్మీనారాయణ, మాజీ ఐపీఎస్ చేరెడ్డి రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

నేడు, రేపు భారీ వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, జనగాం, పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం మధ్య రాష్ట్రంలో ఏడు మండలాల్లో 6-10 సెం.మీ. మధ్య వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. మరో 78 మండలాల్లో 2-6 సెం.మీ. మధ్య వర్షపాతం రికార్డు అయినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

నకిలీ పత్రాలతో ఇంటి రుణాలు

- వనపర్తిలో కానిస్టేబుల్ ముఠా మోసాలు
- బ్యాంకులతో పాటు పోలీసు శాఖకూ టోకరా
- మొత్తం రూ.2.61 కోట్లు దండుకున్న ముఠా

వనపర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు, డబుల్ రిజిస్ట్రేషన్లతో ఒకే ఇంటిపై ఒకేసారి మూడు నాలుగు రుణాలు తీసుకుంటూ పోలీసు శాఖను, బ్యాంకులను మోసగిస్తున్న ముఠాను వనపర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాను నడిపిస్తున్నది ఓ పోలీస్ కానిస్టేబుల్ కావడం గమనార్హం. వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మంగళవారం విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. 2007 నుంచి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బండారు రాకేష్. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగి ఇళ్లు కట్టి విక్రయించడం ప్రారంభించాడు. తదనంతరం హరీశ్‌కుమార్, తాళ్లపల్లి మల్లేష్, సందీప్, బుక్క కిషోర్ కుమార్, సుంకరి శేఖర్ అనే వ్యక్తులతో ముఠాగా ఏర్పడి నకిలీ పత్రాలతో బ్యాంకులను మోసం చేయడానికి పథకం రచించాడు. వనపర్తిలోని రామ్‌నగర్‌లో సుంకరి శేఖర్ కట్టిన ఇంటిని రాకేష్ కొంటున్నట్లు రిజిస్ట్రేషన్ చేసి, 3 నకిలీ అగ్రిమెంట్లు తయారుచేశారు. దీనికి పోలీసు శాఖలోని భద్రతా స్కీంలో రూ.26 లక్షల 80 వేలు, ఐవోబీ నుంచి రూ.20 లక్షలు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.25 లక్షలు, ఎల్ఐసీ నుంచి రూ.17 లక్షల 50 వేలు.. ఇలా మొత్తం ఒకే ఇంటిపై రూ.89 లక్షల 30 వేలు మోసపూరితంగా రుణం పొందారు. ఇదే కాకుండా తన స్నేహితుడైన తోళ్ల శ్రీనివాసులు ఇంటిని సుంకరి శేఖర్ కొంటున్నట్లు మొదట భద్రతా స్కీంలో రూ.20 లక్షల 59 వేలు, తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.28 లక్షల రుణం తీసుకున్నారు. మళ్లీ అదే ఇంటిపై నకిలీ డాక్యుమెంట్లు తయారుచేసి బుక్క ప్రతాప్ అనే వ్యక్తికి రూ.40 లక్షలకు అమ్మారు. మరో కేసులో శివశంకర్ నుంచి స్వాతి పేరు మీద ఒక ఇంటిని కొంటున్నట్లు ఎల్ఐసీ రుణం రూ.38 లక్షలు తీసుకుని, అదే ఇంటికి నకిలీ డాక్యుమెంట్లు తయారుచేసి అరుణ్ బాషా అనే వ్యక్తికి అమ్మారు. దానిపై భద్రతా రుణం రూ.37 లక్షలు తీసుకున్నారు. ఇలా మొత్తం రూ.2 కోట్ల 61 లక్షల 89 వేలను రాకేష్ ముఠా దండుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

మద్యం మత్తులో ట్రాఫిక్ సీఐపై వ్యక్తి దాడి

- నిందితుడిపై కేసు నమోదు.. ఆలస్యంగా వెలుగులోకి ఘటన

వరంగల్ క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): "నేను అమెరికా నుంచి వచ్చాను నన్నే అడ్డుకుంటావా" అంటూ ఓ మందు బాబు సీఐపై దాడి చేశాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో పట్టుబడిన వాహనాన్ని స్వాధీనం చేసుకుంటుండగా సీఐ, సిబ్బందిపై పిడి గుద్దులు కురిపించాడు. పోలీసులపై దుర్భాషలాడుతూ నానా యాగి చేశాడు. హనుమకొండలో ఈ నెల 3న జరిగిన ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హనుమకొండ పలివేల్పుల క్రాస్‌లో ఈ నెల 3న పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మడికొండకు చెందిన తౌటిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అతని స్నేహితుడితో కలిసి కారులో వస్తుండగా అతని వాహనాన్ని ఆపారు. డ్రైవింగ్ సీటులో ఉన్న రాజశేఖర్‌రెడ్డికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష నిర్వహించగా అతను మద్యం తాగినట్లుగా వెల్లడైంది. దీంతో కారును పోలీసులు స్వాధీనం చేసుకోవడానికి యత్నించగా రాజశేఖర్‌రెడ్డి ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి చొక్కాను పట్టుకొని కిందపడేసి దాడి చేశాడు. అడ్డుకోబోయిన గన్‌మెన్, సిబ్బందిపై దాడికి దిగాడు. పోలీసులు అతన్ని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్కడ కూడా అదే తీరుగా ప్రవర్తించాడు. సీఐ సీతారెడ్డి ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు హుజూరాబాద్ జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

ఎంపీ కుమారుడిని.. న్యూరో సర్జన్‌ని!

- అద్దె బెంజ్ కార్లు.. చుట్టూ బౌన్సర్లతో డాబు
- ఏపీకి చెందిన ఘరానా మోసగాడి అరెస్టు

హైదర్‌నగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బెంజ్ కారు.. వెంట బౌన్సర్లతో దర్పం ప్రదర్శిస్తూ.. ఎంపీ కుమారుడినని, హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్నానని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. కేపీహెచ్‌బీ ఎస్సై శ్రీలతా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లా చిన్ననట్టుకి చెందిన వాయిల వెంకటేశ్వర్లు (29) విశాఖపట్నం రిషికొండలో నివసిస్తుంటాడు. ఇటీవల హైదరాబాద్ వచ్చి కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ఉమెన్స్ పీజీ హాస్టల్‌కు వెళ్లాడు. హాస్టల్ నిర్వాహకురాలికి తాను ఏపీకి చెందిన టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కుమారుడినని, పేరు విక్రాంత్ రెడ్డి అని పరిచయం చేసుకున్నాడు. జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్‌లో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్నట్లు చెప్పాడు. తన బంధువులు, జూనియర్ డాక్టర్లను హాస్టల్‌లో చేర్పించే నెపంతో తన అనుచరులతో వచ్చి హడావుడి చేశాడు. అతన్ని హాస్టల్ నిర్వాహకురాలు బాగా నమ్మింది. ఈ క్రమంలో తమకు జూబ్లీహిల్స్‌లో జ్యువెలరీ షాపు ఉందని, ఆమె 4 తులాల బంగారు గొలుసును రీమోడలింగ్ చేయిస్తానని తీసుకున్నాడు. ఆ తర్వాత రూ.55 వేలు, మరోసారి రూ.45 వేలు తీసుకున్నాడు. తర్వాత కనిపించలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దాంతో మోసపోయానని గ్రహించిన మహిళ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంకటేశ్వర్లును కేపీహెచ్‌బీలో అరెస్టు చేసి, అతని నుంచి రెండు బెంజ్ కార్లు స్వాధీనం చేసుకున్నారు. అతను గతంలోనూ అద్దెకు తీసుకున్న బెంజ్ కార్లలో తిరుగుతూ ఇలాంటి మోసాలకు పాల్పడ్డాడని, అతనిపై ఏపీలో 12 కేసులు, హైదరాబాద్‌లో రెండు కేసులు ఉండగా ఓ సారి జైలుశిక్ష అనుభవించాడని పోలీసులు తెలిపారు. .

రూ.4.2 కోట్ల గంజాయి సీజ్

- ఇద్దరి అరెస్టు.. 847 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న 874 కిలోల గంజాయి (హై-గ్రేడ్)ని ఎలైట్ గ్రూప్ ఫర్ డ్రగ్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) సీజ్ చేసింది. దీని విలువ రూ.4.2 కోట్లుగా ఉంటుందని ఈగల్ అధికారులు తెలిపారు. ఈగల్ ఎస్పీ చెన్నూరు రూపేశ్ కథనం ప్రకారం.. ఒడిసాలోని మల్కన్‌గిరి నుంచి పెద్దమొత్తంలో గంజాయి వస్తోందనే సమాచారంతో ఖమ్మం ఆర్ఎన్‌సీసీ, ఈగల్ బృందాలు మంగళవారం శంషాబాద్ సమీపంలోని తొండిపల్లి వద్ద కాపుకాచాయి. ఓ వాహనంలో తరలిస్తున్న 874 కిలోల గంజాయిని సీజ్ చేసి.. ఒడిసాలోని మల్కన్‌గిరికి చెందిన ధన, రాజేందర్ బజింగ్‌లను అరెస్టు చేశాయి. సీజ్ చేసిన గంజాయి విలువ రూ.4.2 కోట్లుగా ఉంటుంది. నిందితుల నుంచి ఒక బులేరో వాహనం, ఒక తల్వార్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ ముఠాకు చెందిన రమేశ్ సుబ్రీ, జగదీశ్‌కుల్‌దీప్, షిబో అలియాస్ షిబా, బసు, షఫీలను అరెస్టు చేయాల్సి ఉందని వివరించారు. ఈ ముఠా ఈ ఏడాది మొత్తం 1,450 కిలోల గంజాయిని యూపీకి తరలించిందని అధికారులు వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చమురు సెగలు

రష్యా నుంచి చమురు కొనుగోలుచేయడం మీద భారత విదేశాంగ శాఖ సోమవారం విడుదల చేసిన ప్రకటన ఎన్నడూ లేనంత స్పష్టంగా, నిర్దిష్టంగానే కాక, అమెరికా వీరంగాన్నీ, ఆ దేశాధ్యక్షుడి హెచ్చరికలనూ బేఖాతరుచేస్తున్న సందేశమూ అందులో అంతర్లీనంగా ఉంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైన ఈ మూడేళ్ళలో, పలుమార్లు రష్యాచమురు మీద మనకు అమెరికానుంచి హెచ్చరికలు వచ్చినప్పటికీ, ఇంత గట్టిగా జవాబు ఇవ్వడం ఇదే తొలిసారి కావచ్చు. దేశప్రయోజనాలు, అవసరాలను పరిరక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని, ఎటువంటి నిర్ణయానికైనా సిద్ధపడతామని ఈ ప్రకటన స్పష్టం చేస్తోంది. రష్యా చమురు బూచిని చూపి పాతికశాతం సుంకాలనుంచి మించి భారత్‌ను బాదేయాలని ట్రంప్ సిద్ధపడుతున్న నేపథ్యంలో, భారత్ తన వైఖరిని ఇలా స్పష్టపరిచి, దేనికైనా సిద్ధమన్న సందేశాన్నిచ్చినట్టు కనిపిస్తోంది.

అమెరికా అధ్యక్షుడికి రష్యా చమురు ఇప్పుడు నెత్తురులాగా ఎర్రగా కనిపిస్తోంది. ఒక మహాయుద్ధానికి కందెనలాగా ఉపకరిస్తున్నదని ఇప్పుడు అనిపిస్తోంది. రష్యా యుద్ధకండూతికి, ఊచకోతకు ఉక్రెయిన్‌లో వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నా భారత్‌కు ఎంతమాత్రం పట్టడం లేదనీ, రష్యానుంచి చవుక చమురు కొని, బహిరంగమార్కెట్‌లో అమ్ముకుంటూ భారీగా లాభాలు పోగేసుకుంటున్నదని ట్రంప్ ఆగ్రహిస్తున్నారు. పాతికశాతంతో సరిపెట్టకుండా మరింత భారీగా మనలను సుంకాల మీద సుంకాలతో దెబ్బతీయడానికి ఆయన సిద్ధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో భారత్ కూడా ధీటుగానే జవాబు ఇచ్చింది. రష్యా చమురుతో వ్యాపారం చేస్తున్న ఇక్కడి కంపెనీలమీద ఇప్పటికే ఈయూ ఆంక్షలు విధించిన నేపథ్యంలో, తనను అమెరికా, ఈయూలు అకారణంగా లక్ష్యం చేసుకున్నాయంటూ విమర్శ లాంటి వివరణ ఒకటి భారత్ విడుదల చేసింది. రష్యానుంచి అమెరికా ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నవేమిటో, ఈయూ కొనుగోలుచేస్తున్నవి ఎంతో ఆ ప్రకటన వివరించింది. భారత్‌కంటే రష్యాతో ఇప్పటికీ యూరోపియన్ యూనియన్ (ఈయూ) అత్యధికవాణిజ్యం చేస్తున్నది.

ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం మొదలుకాగానే, ప్రపంచ ఇంధనమార్కెట్లు కల్లోలంలోకి జారుకుంటున్న తరుణంలో ఈ దిగుమతులను అమెరికా స్వయంగా ప్రోత్సహించింది. రష్యా ముడిచమురులో 80శాతం భారతదేశానికే చేరి, ఇక్కడ శుద్ధిచేసినదానిలో అధికశాతం తిరిగి యూరప్‌కే ఎగుమతి అవుతోంది. ఇలా, శుద్ధిచేసిన రష్యన్ చమురు విదేశాలకే తరలిపోతున్నా, సదరు దిగుమతులు మనదేశ ప్రజల ప్రయోజనార్థం జరుగుతున్నట్టుగా మంత్రులు చెబుతూంటారు. భారత్ నుంచి ఈయూకు శుద్ధిచేసిన పెట్రోలియం ఎగుమతులు ఏటా రెట్టింపవుతున్నాయి. ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ముందు భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా ఒకశాతం కంటే లేదు. కానీ, ఈ యుద్ధం అందించిన ప్రయోజనంతో భారతదేశంలోని కంపెనీలు తాము లబ్ధి పొందుతూ, ఈయూను వెలిగిస్తూవచ్చాయి. యుద్ధాన్ని రష్యా అంతేబలంగా ఇప్పటికీ కొనసాగిస్తున్న నేపథ్యంలో, ఆయిల్ మీద ఆంక్షలతో రష్యాను బలహీనపరచాలన్న ప్రయత్నాలు బలంగా సాగుతున్నాయి. మనను బెదిరిస్తున్న ఈయూ దేశాలు రష్యానుంచి ఒకపూట దిగుమతి చేసుకుంటున్న చమురు ఉత్పత్తులు మన మూడునెలల దిగుమతులతో సమానమని చమురుమంత్రి హర్‌దీప్ పురి ఇటీవల వ్యాఖ్యానిస్తూ ఈయూదేశాలు రష్యా నుంచి కొనుగోలు చేస్తున్న చమురు ఉత్పత్తుల లెక్కలను విప్పిచెప్పారు.

ట్రంప్ తొలివిడత పాలనలో బెదిరింపులకు లొంగి వెనెజువెలా, ఇరాన్‌ల నుంచి చవకైన చమురు దిగుమతులను వదులుకున్నట్టుగా, ఇప్పుడు రష్యా నుంచి చమురు దిగుమతులు ఆపేయడానికి భారత్ సిద్ధపడకపోవచ్చు. ప్రత్యామ్నాయ మార్గాలతో ప్రజాప్రయోజనాలను ఎట్టిపరిస్థితుల్లో కాపాడుకుంటామన్న మన విదేశాంగశాఖ వ్యాఖ్యలో అమెరికాకు అంతర్లీనంగా ఓ హెచ్చరిక కూడా ఉన్నది. డ్రిల్ బేబీ డ్రిల్ అంటూ తమ చమురుకంపెనీలను ఇబ్బడిముబ్బడిగా చమురు తోడిపోసుకోమంటున్న ట్రంప్ ఇలా మనలను బెదిరిస్తూ, అమెరికా చమురు అమ్మకానికి మార్గం సుగమం చేసుకుంటున్నారు. హెచ్చిన అమెరికా సుంకాలనూ, రష్యా చమురు దిగుమతులనూ బేరీజు వేసుకొని ఏది కావాలో, ఏది వదులుకోవాలో తేల్చుకోవాలన్నది ట్రంప్ బెదిరింపుల సారాంశం. అంతిమంగా ఏ నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, మై ఫ్రెండ్..ఇండియాస్ ఫ్రెండ్ అంటూ ట్రంప్‌ను ఘనంగా కీర్తించిన ఒకప్పటి ఆప్తమిత్రుడు నరేంద్రమోదీ, ట్రంప్ మారిన వైఖరితో ఇంటాబయటా ఇబ్బందిలో పడినమాట వాస్తవం. ఎంతోకాలం తరువాత మోదీనోట స్వదేశీ మాట వినిపించడం వెనుక కొత్త విధానం కంటే ఈ విరక్తి ఎక్కువగా పనిచేసివుండవచ్చు.


తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనాయకులు తరుచు దుబాయి పర్యటనలకు వస్తున్నా, స్థానికంగా ఉన్న తమ పార్టీ మద్దతుదారులను కనీసం కలవడానికి కూడా ఇష్టపడరు. వారిని వీలయినంత దూరంగా ఉంచుతారు. నాయకుల ఇటువంటి వైఖరి వల్లే ప్రజలూ పార్టీలను అధికారం నుంచి దూరంగా ఉంచుతున్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తమ జనహిత యాత్రలో ఈ సత్యాన్ని గ్రహిస్తే చాలు.

జనహిత యాత్ర పరమార్థమేమిటి?

భారత జాతీయ కాంగ్రెస్ అధికారంలో ఉన్న అతి కొద్ది రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరును ఆ రాష్ట్ర ప్రజలే కాకుండా ఆసేతు హిమాచలం సమస్త ప్రజలతో పాటు ప్రవాస భారతీయులు సైతం నిశితంగా గమనిస్తున్నారు. భారతదేశ వ్యవహారాలపై ఆసక్తి చూపే విదేశీ మేధావులు, దౌత్యవేత్తలు కూడా తెలంగాణ ప్రభుత్వ పనితీరుతో పాటు అక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విధానాలు ఏమిటని శ్రద్ధగా ఆరా తీస్తున్నారు. హైదరాబాద్‌లో పర్యటించి వచ్చిన పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు కూడా తమ సమావేశాలలో ఏ మంత్రి ఏ విధంగా, కుర్చీపై రెండు కాళ్లు వేసుకుని కూర్చున్నారు అనే విషయంతో సహా వివిధ విశేషాలపై ఛలోక్తులు విసురుతుంటారు.

గల్ఫ్ లేఖ

ప్రభుత్వ విధానాలను ప్రజలలోకి ప్రభావశీలంగా తీసుకువెళ్లేందుకు అధికార పార్టీ అంకితభావంతో కృషి చేస్తేనే రాజకీయ ప్రయోజనాలు సమకూరుతాయి. తెలంగాణలో ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తున్నా అందుకు తగినట్లుగా ప్రజాదరణ పొందలేకపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జనహిత యాత్ర పేరిట కాంగ్రెస్ నాయకత్వం ప్రజల మధ్యకు వెళ్లేందుకు పూనుకోవడం ముదావహం. జిల్లాలలో పార్టీ స్థానిక నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించి, ఆ తరువాత క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని బేరీజు వేసేందుకు పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి పల్లెలు, పట్టణాలలో పర్యటిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ తరహా కసరత్తు ఏమి లేకుండా తెలంగాణ పీసీసీ వ్యవహారాల ఇన్‌ఛార్జీ మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత యాత్ర జన సమస్యల పరిష్కారానికి చేసే మేలు ఏమోగానీ కనీసం పార్టీ ఆత్మావలోకనం చేసుకోవడానికీ అయినా ఎంత వరకు దోహదం చేస్తుందో తెలియదు. అధికారిక లావాదేవీలు (పైరవీలు అని చెప్పడం సబబుగా లేదు) చేసేవారు పెరిగిపోయి నిజమైన



పార్టీ నాయకులు దాదాపుగా కరువైపోయిన రోజులివి. పార్టీ గురించి చిత్తశుద్ధితో పట్టించుకునేవారు అసలు ఉన్నారా? బహుశా, ఈ కారణానే కాబోలు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేపట్టిన కొన్ని సాహసోపేత చర్యలు, అమలుపరిచిన పథకాల గురించి జనాలలో ఆశించిన స్థాయిలో స్పందన లేదు.

దేశంలో ఇప్పటి వరకు కేరళతో సహా ఏ ఇతర రాష్ట్రం కూడ గల్ఫ్ దేశాలలో మరణించిన మృతులకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించలేదు. ఒక్క తెలంగాణలో మాత్రమే అనేక మందికి ఇటువంటి సహాయం అందింది. అయితే గ్రామాలలో ఈ ప్రజాహిత చర్యకు సరైన ప్రచారం లభించలేదు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కొద్ది కాలం క్రితం కలిసినప్పుడు ఈ విషయమై ప్రశ్నించాను. ప్రభుత్వాధినేతగా తాను అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులదని ఆయన మందహాసంతో సమాధానమిచ్చారు. ఇది ఆయన మనోగతాన్ని కొంతవరకు విశదీకరించింది.

విదేశాలలో మంచి స్థితిలో ఉన్న ప్రవాసుల కంటే స్వదేశంలో వారిపై ఆధారపడి ఉన్న కుటుంబాలు లక్ష్యంగా బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. భారత్‌లో యూరియా, ఇతర ఎరువుల కొరత దృష్ట్యా వాటి దిగుమతి తీరును పరిశీలించడానికి సౌదీ అరేబియాకు వచ్చిన (బీజేపీ అధ్యక్షుడు కూడా అయిన) కేంద్ర ఎరువుల మంత్రి జె.పి.నడ్డాకు ఒక నిమిషం కూడ తీరిక లేదు. అయినా ఆయన తన పార్టీ మద్దతుదారుల కొరకు కొంత సమయాన్ని కేటాయించారు. అంతకు ముందు వ్యక్తిగత పని నిమిత్తం దుబాయి పర్యటనకు వచ్చిన నితిన్ గడ్కరీ, బీజేపీకి మద్దతునిచ్చే ప్రవాస ప్రముఖులు అందరినీ విందుకు ఆహ్వానించారు. ధర్మపురి అర్వింద్ వచ్చినప్పుడల్లా కార్యకర్తలను ఉత్తేజపరుస్తారు. కాంగ్రెస్ విషయానికి వస్తే, కేరళ ముఖ్యనాయకులు అందరూ తరుచుగా సందర్శిస్తూ తమ పార్టీ ప్రవాస విభాగాన్ని పటిష్ఠ వ్యవస్థగా తీర్చిదిద్దారు. గల్ఫ్‌లోని పార్టీ నాయకులతో సంప్రదింపులలో ఉండే పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ త్వరలో పార్టీ కార్యక్రమం ఒకదానిలో పాల్గొనేందుకు కువైత్‌కు రానున్నారు. తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ మృతులకు అందించిన ఆర్థిక సహాయంపై వివరాలతో వెళ్ళి ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేసిన ఒక ప్రవాస కాంగ్రెస్ నాయకుడిని నిజామాబాద్ జిల్లాలో ప్రతిపక్ష భారాస కార్యకర్తలు బట్టలు విప్పి కొట్టారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ ప్రవాస నాయకుడిని కనీసం పరామర్శించే తీరిక కూడ తెలంగాణ పీసీసీ నాయకులకు లేకుండా పోయింది.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనాయకులు తరుచు దుబాయి పర్యటనలకు వస్తున్నా, స్థానికంగా ఉన్న కాంగ్రెస్ మద్దతుదారులను కనీసం కలువడానికి కూడా ఇష్టపడరు. వారిని వీలయినంత దూరంగా ఉంచుతారు. నాయకుల ఇటువంటి వైఖరి వల్లే ప్రజలూ పార్టీలనూ అధికారం నుంచి దూరంగా ఉంచుతున్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తమ జనహిత యాత్రలో ఈ సత్యాన్ని గ్రహిస్తే చాలు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రశ్నార్థకమవుతున్న ఈసీ విశ్వసనీయత



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'భారతదేశంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) చచ్చిపోయింది..' అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ఒక లోక్‌సభ నియోజకవర్గంలో 1.5 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని తమ దర్యాప్తులో తేలిందని, ఈ విషయాన్ని సాక్ష్యాధారాలతో సహా త్వరలో నిరూపిస్తామని ఆయన ప్రకటించారు. అనేక విషయాల్లో రాహుల్‌గాంధీ అడపాదడపా చేసే ఆరోపణలు సంచలనాత్మకంగా ఉంటున్నాయి. అవి, కొన్నిసార్లు న్యాయస్థానం విమర్శలకు గురైనప్పటికీ ఎన్నికల కమిషన్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. ఇదే సమయంలో బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతున్న తీరుపై కొద్ది రోజులుగా పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించిపోయాయి. ఎన్నికల కమిషన్ పనితీరుపై పార్లమెంట్‌లో చర్చించడం సంప్రదాయాలకు విరుద్ధమని, గతంలో బలరాం జాఖడ్ స్పీకర్‌గా ఉన్నప్పుడు ఈ మేరకు రూలింగ్ ఇచ్చారని ఉభయ సభల అధిపతులు వాదిస్తున్నారు. అయినప్పటికీ బిహార్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్‌ను ప్రతిపక్షాలు అంత సులభంగా వదిలిపెట్టే అవకాశాలు కనిపించడం లేదు.


సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కేసుపై విచారణలో ఎస్ఐఆర్ జరుగుతున్న తీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఎన్నికల కమిషన్ ఓటర్ల పౌరసత్వంపై దృష్టి కేంద్రీకరించడం, కొత్త ఓటర్లను చేర్చుకోవడం కాకుండా ఉన్న ఓటర్లను జాబితా నుంచి తొలగించడంపై సుప్రీంకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఎన్నికల జాబితాలో నమోదు చేసుకోవాలంటే ఒక వ్యక్తికి భారతీయ పౌరసత్వం ఉండాలని, కేవలం భారతీయ పౌరులనే ఓటర్లుగా చేర్చుకోవడం తమ బాధ్యత అని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఓటర్లుగా నమోదు కావాలంటే 11 డాక్యుమెంట్లు సమర్పించాలని, 1987 నుంచి 2004 మధ్య పుట్టినవారు తమ తల్లిదండ్రుల్లో ఒకరి డాక్యుమెంట్‌ను, 2004 తర్వాత పుట్టినవారు తల్లి, తండ్రి ఇరువురి డాక్యుమెంట్లనూ సమర్పించాలని చెబుతోంది. కేంద్రం జారీ చేసిన ఆధార్, తాము జారీ చేసిన ఎన్నికల గుర్తింపు కార్డులను కూడా ఈసీ పరిగణనలోకి తీసుకోవడం లేదు.

పౌరసత్వం ఆధారంగా ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం పేరుతో ఎన్నికల కమిషన్ అధికార పార్టీని గెలిపించేందుకు ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. పౌరసత్వ సర్టిఫికెట్ జారీ చేయడం ఎన్నికల కమిషన్ పని కాదని, ఎన్నికలను పర్యవేక్షించే, నిర్వహించే రాజ్యాంగ బాధ్యత మాత్రమే కమిషన్‌కు ఉన్నదని మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా కూడా వాదిస్తున్నారు. నిజానికి 2025లో ఓటర్ల జాబితా ప్రకటించేందుకు ముందే ఓటర్ల జాబితా సమగ్ర సవరణ చేసి ఉంటే ఎన్నికల కమిషన్ ఇంత వివాదంలో ఇరుక్కునేది కాదు. బిహార్‌లో ఎన్నికలు సరిగ్గా రెండు మూడు నెలల్లో జరుగుతాయనగా ఆగమేఘాలపై కేవలం నెలలోపు ఈ సవరణ చేసేందుకు పూనుకోవడమే కమిషన్ నిజాయితీని శంకించేలా చేస్తోంది.

ఒక రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ దేశంలో చాలా కాలంగా వివాదంలో ఉంటూనే వస్తోంది. 1990లో టీఎన్ శేషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ అయిన తర్వాత ఎన్నికల వ్యవస్థలో ఎన్నో కీలక మార్పులు తీసుకువచ్చారు. డబ్బు, మద్యం పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, గోడలపై రాతల్ని రాయడంతో పాటు ఎన్నికల ప్రసంగాల్లో మతాన్ని ఉపయోగించడాన్ని కట్టుదిట్టంగా అరికట్టారు. ఓటర్ల ఐడీ కార్డులను, ప్రవర్తనా నియమావళిని ప్రవేశపెట్టారు. ఎన్నికల ఖర్చులపై పరిమితిని విధించారు. ఎన్నికలకు ఎన్ని వాహనాలు ఉపయోగించారో కూడా అభ్యర్థులు లెక్క చెప్పాల్సి వచ్చేది. రిటర్నింగ్ అధికారులు ఈ వాహనాల మీటర్లను చెక్ చేసి ఎన్నికల ఖర్చులపై రోజువారీ లెక్కలతో సరిపోల్చేవారు. ఎన్నికల ముందు యూపీతో పాటు అనేక రాష్ట్రాల్లో 3లక్షల మందికి పైగా రౌడీషీటర్లని ముందస్తు అరెస్టులు చేయించిన శేషన్ ఒక దశలో ఓటర్లను ప్రలోభపెట్టినందుకు ఇద్దరు కేంద్రమంత్రులను తొలగించాల్సిందిగా ప్రధానమంత్రికే తాఖీదు పంపారు. శేషన్ హయాంలో పోలింగ్ బూత్‌ల స్వాధీనం, ఎన్నికల సంబంధిత దాడులు, దొమ్మీలు, హత్యలు 90 శాతం పైగా తగ్గిపోయాయి. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్న విషయంపై ఆయనే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకున్నారు. 'ఇప్పటి వరకూ రాజకీయ నాయకులు చాలా చెత్తపనులన్నీ చేశారు. నేను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నంతకాలం ఎన్నికలు ఎలా నిర్వహించాలో నేనే నిర్ణయిస్తాను..' అని శేషన్ ప్రకటించారు. 'ఈ శేషన్ ఘటోత్కచుడిలా ఉన్నాడే..' అని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూడా ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల వ్యవస్థకు విశ్వసనీయత సాధించినందుకు ఆయనకు రామన్ మెగసెసే అవార్డు లభించింది.

కాని శేషన్ అనంతరం మళ్లీ పరిస్థితులు క్రమంగా మొదటికి రావడం ప్రారంభమైంది. యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ నవీన్ చావ్లా వంటి అస్మదీయులను కమిషనర్లుగా నియమించారు. శేషన్ ప్రవేశపెట్టిన సంస్కరణలు, కట్టుదిట్టంగా అమలు చేసిన నిబంధనలన్నీ ఇప్పుడు నీరుకారినట్లు అనిపిస్తున్నాయి. అన్ని వ్యవస్థల మాదిరే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. డబ్బు, మద్యం, రెచ్చగొట్టే ఉపన్యాసాలతో పాటు అనేక అవలక్షణాలు ఎన్నో మళ్లీ ప్రవేశించాయి. అధికారంలో ఉన్న రాజకీయనాయకుల ఆగడాలపై శీతకన్ను వేసే పరిస్థితి స్పష్టంగా కనపడుతోంది.

గత కొన్నేళ్లుగా ఎన్నికల కమిషన్‌పై రకరకాల ఆరోపణలు వస్తున్నాయి. పోలైన ఓట్ల శాతాన్ని ప్రకటించడంలో విపరీతమైన ఆలస్యం చేయడం, అంచనాలను అధిగమించి అత్యధిక ఓట్లు పోలయ్యాయని ప్రకటించడం, లెక్కపెట్టిన ఓట్లు, పోలైన ఓట్లకు పొంతన లేకపోవడం, ఓటర్ల జాబితాలో పేర్లు మాయం కావడం లాంటి అనేక ఆరోపణలు వచ్చాయి. 2014 నుంచీ ఇప్పటి వరకూ ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అంతర్గత కారణాల వల్ల కమిషన్‌కు రాజీనామా చేసి వెళ్లడం కూడా కొట్టిపారేయదగిన విషయం కాదు. 2018లో మధ్యప్రదేశ్‌లోను, 2024లో మహారాష్ట్రలోనూ భారీ ఎత్తున బోగస్ ఓటర్లను చేర్చారన్న ఆరోపణలు వచ్చాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా అక్రమాలు జరిగాయని రాహుల్‌గాంధీ ఇప్పుడు ఆరోపిస్తున్నారు. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తున్న వేలాది మంది స్థానిక ఈఆర్‌ఓలు, క్రింది స్థాయి సిబ్బంది ఓటర్ల జాబితాలో చేసే మార్పులపై ఇప్పుడు ప్రతిపక్షాలు దృష్టి సారిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత మాట అటుంచితే తాము ఓడిపోయినందుకు కారణాలు వెతుక్కోవడం ప్రతిపక్షాల నైజం. గతంలో బీజేపీ కూడా ఓడిపోయినప్పుడల్లా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించేది. అదే సమయంలో తాము గెలిచిన నియోజకవర్గాల్లో అక్రమాలు జరిగాయని ఏ పార్టీ ఆరోపించదనేది సత్యం.



బిహార్‌లో 2025 జనవరిలో ప్రకటించిన జాబితా ప్రకారం 7.80కోట్లుగా ఉన్న ఓటర్లు, ఆగస్టు 1న ప్రకటించిన ఎస్ఐఆర్ తొలి జాబితా ప్రకారం 7.24 కోట్లకు తగ్గిపోయారు. సెప్టెంబర్ 1న ప్రకటించే మలి జాబితాలో ఇప్పుడున్న ఓటర్లలో ఎంతమంది అదృశ్యమవుతారో?! ఎన్నికల వ్యవస్థలో అక్రమాలు సంభవించకుండా చూడవల్సిన ఎన్నికల కమిషన్ స్వయంగా వివాదాలకు గురైతే ప్రజాస్వామ్యం పై ప్రజలకు నమ్మకం పోదా?

ఎన్నికల్లో ఒక పార్టీ ఓడిపోవడానికి ప్రజా వ్యతిరేకత ప్రధాన కారణం. ప్రజా వ్యతిరేకత ఏ మాత్రం ఉన్నా మిగతా కారణాలు కూడా ఆ పార్టీ ఓటమిని మరింత బలపడేలా చేస్తాయి. చాలా చోట్ల ప్రజలు తమ వ్యతిరేకతను పైకి వ్యక్తం చేయరు. 'నా నియోజకవర్గంలో ఒక గ్రామంలో నేను ఎప్పుడు వెళ్లినా నన్ను ప్రేమగా బిడ్డా అని పలకరించే ఒక వృద్ధురాలు ఈ సారి నన్ను చూడగానే ముఖం తిప్పుకుంది. దీనితో నేను ఓడిపోతానని అర్థమైంది' అని సీనియర్ కాంగ్రెస్ నేత జైపాల్‌రెడ్డి ఒక సందర్భంలో చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాయలసీమలో కూడా వైసీపీ తుడిచిపెట్టుకుపోవడం ప్రజా వ్యతిరేకతకు నిదర్శనం. ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉంటే సామాజిక వర్గాలు, ప్రలోభాలు, అధికార దుర్వినియోగం, మతతత్వ పోకడలు కాపాడలేవనేది సత్యం.


ఆగస్టు 1న ప్రకటించిన బిహార్ ఓటర్ల ముసాయిదా జాబితాలో 66 లక్షల మందిని తొలగించారు. వారిలో పౌరాలు సమర్పించనివారు, మరణించినవారు, వలస వెళ్లినవారు, డూప్లికేట్ ఓటర్లు ఉన్నారు. బిహార్‌లో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు, నేపాలీ చొరబాటుదారులు ఎంత మంది ఉన్నారో ఎన్నికల కమిషన్ ప్రకటించలేదు. దేశంలో ఎక్కడైనా 18 సంవత్సరాలు దాటినవారు ప్రతిసారీ పెద్ద ఎత్తున ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకుంటారు. అయితే బిహార్‌లో మాత్రం ప్రతి ఎన్నికలకూ ఓటర్ల సంఖ్య పెరుగుతూ ఉంటే ఈసారి ఓటర్ల సంఖ్య తగ్గినట్లు స్పష్టమవుతోంది. 2025 జనవరిలో ప్రకటించిన జాబితా ప్రకారం 7.80కోట్ల ఓటర్లు ఉంటే ఇప్పుడు ప్రకటించిన ఎస్ఐఆర్ తొలి జాబితా ప్రకారం 7.24 కోట్ల మందికి తగ్గిపోయారు. సెప్టెంబర్ 1న ప్రకటించే మలి జాబితాలో ఇప్పుడున్న ఓటర్లలో ఎంతమంది అదృశ్యమవుతారో చెప్పలేం. బిహార్ ఎస్ఐఆర్ చిలికిచిలికి గాలివానగా మారి దేశ రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదు.

ఎన్నికల వ్యవస్థలో అక్రమాలు సంభవించకుండా చూడవల్సిన బాధ్యత ఉన్న ఎన్నికల కమిషన్ స్వయంగా వివాదాలకు గురైతే దేశంలో ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం పోతుంది. గత ఏడాది చండీగఢ్‌లో ఒక రిటర్నింగ్ అధికారి మేయర్ ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించి పట్టుబడ్డారు. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఈ రిటర్నింగ్ అధికారి క్షమాపణతో సంతృప్తి చెంది శిక్ష విధించకుండా వదిలిపెట్టారు. ఆ అధికారే మళ్లీ నామినేటెడ్ కౌన్సిలర్‌గా ఆరు నెలల్లో మున్సిపల్ కార్పొరేషన్‌లో అడుగుపెట్టారు. తెలంగాణలో ఒక సీఈఓ హయాంలో మిస్సింగ్ ఓట్లు, పోలయిన ఓట్ల విషయంలో రెండుసార్లు తీవ్ర ఆరోపణలు వస్తే ఆయన క్షమాపణలు చెప్పి ఊరుకున్నారు. ఆధునిక భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇలాంటి ప్రహసనాలు మనకెన్నో ఎదురవుతాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఇప్పుడు గద్దర్ ఉండాల్సింది!

ఆపదలో అయినవాళ్లు యాదికొస్తారంటారు. నేడు తాము ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులలో తాడిత పీడిత ప్రజలు, మరీ ముఖ్యంగా ఆదివాసులు, ఇప్పుడు గద్దర్ ఉంటే ఏమి చేసేవాడు అని తమవైన అనుభవాల్లోంచి ఊహించుకుంటున్నారు. ఏడాది కాలంగా గద్దర్ ఫౌండేషన్ కార్యకలాపాలలో భాగంగానూ, ఎన్‌కౌంటర్లలో అమరులైన వారి కుటుంబాలను పరామర్శిస్తూనూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అనేక గ్రామాలు తిరిగాను. ఎక్కడికి వెళ్లినా– పాలక ప్రభుత్వాల అమానవీయ చర్యలను ప్రజలు నిరసిస్తున్నారు. గద్దర్ ఉంటే ఇలా ఉండేది కాదంటున్నారు. ఇలా గద్దర్ లేని లోటు కొంచెం కొంచెంగా ప్రజలకు, ముఖ్యంగా సామాజిక కార్యకర్తలకు, అనుభవంలోకి వస్తున్నది.



ఈ దేశ ప్రజా సంస్కృతిపై ఒక కళాకారుడిగా గద్దర్ వేసిన ప్రభావం ఎనలేనిది, మరొకరు పూడ్చలేనిది. ప్రజా కళాకారుడిగా ఆడి పాడటమే కాదు, తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర సాధన తర్వాతి కాలంలో కూడా సామాజిక సమస్యలను, విషయాలను పట్టించుకొని, పాలకుల అపసవ్య విధానాలకు వ్యతిరేకంగా తాను కదలటమే గాక మొత్తం సమాజాన్ని కదిలించాడు. సామాజిక చారిత్రక సందర్భానుసారంగా కలిసి వచ్చే శక్తులను, వ్యక్తులను ఏకం చేసి అనేక ఐక్య ఉద్యమాలను నిర్మించాడు. పార్టీలను, ప్రజా సంఘాలను ఏకతాటి మీదికి తెచ్చి ప్రజాస్వామిక విలువల కోసం నిరంతరం ఉద్యమించాడు.

ఈ మధ్యన మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు ఒక ఎన్‌కౌంటర్‌లో చనిపోతే ఆయన మృతదేహాన్ని ఇవ్వకుండా ప్రభుత్వాలు అమానవీయంగా వ్యవహరించాయి. బతికి ఉన్నప్పుడు ప్రభుత్వాల దృష్టిలో అతను ఏమైనా కావచ్చు, చనిపోయిన తర్వాత ఆ శవాన్ని వారి కుటుంబీకులకు అప్పగించి సంప్రదాయ బద్ధంగా దహన సంస్కారాలు చేసుకునేందుకు వీలు కల్పించటం కనీస మానవీయత. దాన్ని కూడా పాటించకుండా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న గడ్డు కాలం ఇది. గద్దర్ ఉన్నప్పుడు ఎన్‌కౌంటర్లలో చనిపోయిన విప్లవకారుల మృతదేహాలను కుటుంబాలకు చేర్చటానికి ఎంతో కృషి చేశాడు. ఆ క్రమంలో పోలీసులతో, ప్రభుత్వాధినేతలతో తీవ్రంగా ఘర్షణపడ్డాడు. ప్రజాస్వామిక వాదులు అందరినీ ఏకం చేసి శవాల స్వాధీన కమిటీ పేర గొప్ప మానవీయ కార్యాన్ని నెరవేర్చాడు.

నేడు ఆదివాసులు గతంలో ఎన్నడూ లేని విధంగా కష్టనష్టాల పాలవుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో, మావోయిస్టుల ఏరివేత అంటూ ఆదివాసులపై యుద్ధం ప్రకటించాయి. అడవులను ఆక్రమిస్తూ ఆదివాసులకు నిలువ నీడ లేకుండా చేస్తున్నాయి. లక్షల మంది పోలీసులు, పారా మిలిటరీ బలగాలతో ఆదివాసీ ప్రాంతాలను చెరబట్టి అమాయక ఆదివాసులను అక్రమంగా జైళ్లలో నిర్బంధిస్తున్నారు. ఎదురుకాల్పుల పేరిట హత్య చేస్తున్నారు. గద్దర్ జీవితాంతం ఆదివాసుల హక్కుల కోసం పోరాడారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై, దోపిడీ పీడనలపై పాటలు రాశాడు. ఆదివాసుల సంస్కృతి, జీవనం, వారిపై అమలవుతున్న అణచివేతలపై ఓ బ్యాలే రాశాడు. అడవిపై ఆదివాసులది జన్ మహక్కు అని చాటి చెప్పాడు. నేడు ఈ మానవ హనన కాలంలో నేడు గద్దర్ ఉండివుంటే సమాజాన్నంతా కదిలించి ప్రజలకు అండగా నిలిచేవాడంటూ ప్రజలు గద్దర్ లేని లోటును చూస్తున్నారు, అనుభవిస్తున్నారు.

మునుపెన్నడూ లేని స్థాయిలో ఇవ్వాళ పౌర ప్రజాస్వామిక హక్కులకు ప్రమాదం ఏర్పడింది. సర్వత్రా రాజ్యాంగ స్ఫూర్తి, విలువలు తుంగలో తొక్కబడుతున్నాయి. ఈ నేపథ్యంలోంచే గద్దర్ రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని చేపట్టాల్సి వచ్చింది. కాబట్టి ప్రజాస్వామ్య ప్రేమికులారా గద్దర్ ఆశయాల వెలుగులో పయనిద్దాం. రాజ్యాంగ విలువల పరిరక్షణకై ఉద్యమిద్దాం. ఆదివాసులపైనా, ప్రజలపైనా కొనసాగుతున్న అన్ని రకాల అణచివేతలను నిరసిద్దాం.

■ సూర్యకిరణ్
గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి
(నేడు గద్దర్ ద్వితీయ వర్ధంతి)

తెలంగాణ జాతిపిత, ఉద్యమ కెరటం

తెలంగాణ ఉద్యమ నేతగా, రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, నీళ్లు–నిధులు–నియామకాలలో తెలంగాణ నష్టపోయిందంటూ పలు సమావేశాలలో తన గొంతుక వినిపించిన తెలంగాణ ఉద్యమ మాష్టారు ఆచార్య కొత్తపల్లి జయశంకర్. 1934, ఆగస్ట్ 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆత్మకూర్ మండలం, అక్కంపేట గ్రామంలో మహాలక్ష్మి, లక్ష్మీకాంతారావు దంపతులకి జయశంకర్ జన్మించారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్లం, హిందీ భాషలలో మంచి ప్రావీణ్యం గల వీరు తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. బెనారస్ యూనివర్శిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా తీసుకుని, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేసారు. 1975 నుంచి 1979 వరకు సీకేయం కాలేజీ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. 1979 నుంచి 91 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, 1991 నుంచి 1994 వరకు అదే విశ్వవిద్యాలయంలో ఉపకులపతిగా సేవలు అందించారు.



పాఠశాల దశలోనే నాయకుడిగా ఎదిగిన వీరు 'ఇడ్లీ సాంబర్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేసారు. 1952లో నాన్ ముల్కీ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారు. 1954లో విశాలాంధ్ర ప్రతిపాదనని ఎండగట్టిన ధీశాలి. 1969లో తెలంగాణ తొలి దశ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. తరవాత 1995లో మలి దశ ఉద్యమంలో మార్గనిర్దేశకుడిగా నిలిచారు. తెలంగాణలోని ప్రతి పల్లె ఆయన మాటలతో ఉద్యమానికి ఊపిరి ఊదింది. ఊరూరా తెలంగాణ నినాదాన్ని విశ్వవ్యాప్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో ఉద్యమ స్వరూపాన్ని వివరించారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని లెక్కలతో సహా ప్రజల ముందుంచి తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను వివరించారు. "మా వనరులు మాకు ఉన్నాయి, మా వనరులపై మాకు పూర్తి అధికారం కావాలి" అని నొక్కి వక్కాణించారు. "యాచక దశ నుంచి శాసన దశకు తెలంగాణ రావాలె, మా రాష్ట్రం మాకు కావాలి" అంటూ విన్నవించారు. తెలంగాణలో అభివృద్ధి నత్తనడకన కొనసాగుతూ ఉంది. నీళ్లలో మన వాటా తేలిన తర్వాత జలవనరుల విషయంలో స్వేచ్ఛ ఉంటుంది. స్వయం పాలనలో శ్వాసిస్తాం, ఇతరుల పాలనలో యాచిస్తూ ఉన్నాం. నిజాం నవాబు కాలంలో ఇక్కడ గొలుసు చెరువులు ఉండేవి. కావాలని వాటిని నాశనం చేసారు. తెలంగాణ వస్తే ఈ చెరువులను పునరుద్ధరించాలి అని పలు సమావేశాల్లో చెప్పారు.

2001 ఏప్రిల్ 27న టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటయ్యాక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సరి అయిన నాయకుడిగా కేసీఆర్‌ను గుర్తించి, పార్టీలకి అతీతంగా ముందుకు వెళ్లాలని కోరిన వ్యక్తి జయశంకర్ సార్ మాత్రమే. 2009 నవంబరు 29న కేసీఆర్ ఆమరణ దీక్ష, 2009 డిసెంబర్ 4న శ్రీకాంతాచారి ఆత్మాహుతి ఈ ప్రాంత ప్రజలను కలచి వేసింది. ఉద్యమం వైపు పరుగులు పెట్టించింది. 2009 డిసెంబరు 23న శాసనసభ తీర్మానం ద్వారా రాష్ట్ర ప్రక్రియ ప్రారంభిస్తామన్న చిదంబరం ప్రకటనతో తెలంగాణలో ఆందోళనలు ప్రారంభం అయ్యాయి. ఆ ప్రకటనతో జయశంకర్ సార్ తీవ్ర స్థాయిలో మనస్తాపం చెందారు. పల్లె, పట్టణాలను ఉద్యమం వైపు మళ్లించి సామాజిక రాజీనామాలు, ఛలో అసెంబ్లీ ఉద్యమ కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా నిలిచారు. తెలంగాణ మేధావులతో చర్చించి, కవులు, కళాకారులు, రచయితలు, ఉపాధ్యాయ, ఉద్యోగులు, జర్నలిస్టులు, వివిధ పార్టీల ప్రతినిధులు, అన్ని కుల సంఘాలను ఏకం చేసి ఉద్యమాన్ని ముందుకి తీసుకుపోయారు. 'పుట్టుక నీది, చావు నీది, బ్రతుకు అంతా దేశానిది' అని చెప్పిన కాళోజీ మాటను నిజం చేసి, 'బతుకు అంతా తెలంగాణది' అని చెప్పారు. 'తెలంగాణ రాష్ట్రం రావాలి, అప్పుడే నేను మరణిస్తా' అని చెప్పిన త్యాగశీలి వీరు. అమరుల త్యాగాలు, బలిదానాలు, ఉద్యమ భావాలు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జూన్ 2, 2014 నుంచి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుకోవాలని 2014 మార్చి 4న ప్రకటించింది. తర్వాత భారత దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది.


రాష్ట్రాన్ని చూడకుండానే జయశంకర్ సార్ గొంతు క్యాన్సర్‌తో బాధపడుతూ 2011 జూన్ 21న కన్నుమూశారు. తెలంగాణ ప్రభుత్వం జయశంకర్ సార్ సేవలను గుర్తించి ఆయన పేరు మీద అగ్రికల్చరల్ యూనివర్సిటీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటు చేసింది. విద్యారంగంలో ప్రతి ఏటా జూన్‌లో జరిగే బడి పండుగకు 'జయశంకర్ బడిబాట' అని నామకరణం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన పేరు పెట్టడం అభినందనీయం. ఆగస్టు 6న రాష్ట్ర వ్యాప్తంగా వారి జయంతి నిర్వహించుకోవడం మనందరి బాధ్యత. వారి కాంస్య విగ్రహాలని అన్ని జిల్లాల్లో, మండలాల్లో ఏర్పాటు చేయాలి.

● కామిడి సతీష్‌రెడ్డి
(నేడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి)



మాట్లాడుతున్న దయాకర్‌రావు

గాలి మోటార్లు.. గాలి ముచ్చట్లు... 8

- ఇదే సీఎం రేవంత్‌రెడ్డి పాలన
- 'కాళేశ్వరం'పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- మాజీ మంత్రి దయాకర్‌రావు













ఓరుగల్లుకు కొత్త రూపు

అభివృద్ధి బాటలో వడివడిగా అడుగులు

చారిత్రక ఓరుగల్లు నగరం కొత్త రూపు సంతరించుకుంటోంది. దశాబ్దాల ప్రగతి స్వప్నాలు సాకారం దిశగా పయనిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా పోరాటాలు, నిరసనలతో పాలకులపై ఒత్తిడి తీసుకురావడంతో అత్యంత కీలకమైన అభివృద్ధి పనుల్లో కదలికలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ పనులు పూర్తి కావస్తుండగా, ఓరుగల్లువాసుల గగనయానానికి మార్గం సుగమం అవుతోంది. భూసేకరణ పూర్తిచేసి, దసరా నాటికి పనులు ప్రారంభించేలా ఏఏఐ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. మరోవైపు 30ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి డీపీఆర్ రెడీకాగా, రింగ్ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును పీఎం మిత్ర పథకంలో కేంద్రం చేర్చటంతో కొత్త ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఏర్పడింది. పెండింగ్ పనులు పట్టాలెక్కుతుండటంతో అభివృద్ధితో పాటు వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. మొత్తంగా ఓరుగల్లు నగరం రెండో రాజధాని స్థాయికి చేరుకుంటోంది.

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాకతీయుల రాజధానిగా వెలుగొందిన ఓరుగల్లు అభివృద్ధికి ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి. ప్రధానంగా 1969 నుంచి కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు జరిగాయి. 55 ఏళ్ల తరువాత ఎట్టకేలకు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి అడుగులు పడ్డాయి. కాజీపేటలో 2023 జూలై 8న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాగన్ పీరియాడిక్ ఓవరాలింగ్ (పీ వోహెచ్) వర్క్‌షాపునకు భూమి పూజ చేశా రు. 160 ఎకరాల్లో రూ.521 కోట్ల వ్యయంతో నిర్మించే పీవోహెచ్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో గత ఏడాది సెప్టెంబరు 9వ తేదీన కాజీపేట పీవోహెచ్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ మల్టిపుల్ రైల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నట్లుగా రైల్వే బోర్డు ప్రకటించింది. దేశంలో తొలి మల్టిపుల్ రైల్వే మ్యాన్యుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ కాజీపేటలోనే ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించనున్నారు. దీంతో మూడువేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు వస్తుండగా, పరోక్షంగా 10వేల మందికి పైగా ఉపాధి కలగనుంది.

ఇక ఆకాశంలో విహారం

ఓరుగల్లు వాసులు మరో ప్రధాన డిమాండ్ మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ. నిజాంకాలంలో ఎగిరిన విమానాలకు బ్రేక్ పడింది. దీంతో 30ఏళ్లుగా వరంగల్ వాసులు విమానాశ్రయం కోసం డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మామునూరు ఎయిర్‌పోర్టుపై ప్రధానంగా దృష్టి పెట్టింది. ప్రధానంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 150కిలోమీటర్ల పరిధిలో మరో ఎయిర్ పోర్టు ఉండకూడదనే నిబంధనను జీఎంఆర్ సంస్థ ఒప్పించి తొలగించారు. దీంతోపాటు ఎయిర్ పోర్టు నిర్మాణానికి కేంద్ర విమానాయ శాఖను ఒప్పించి, బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా నిర్మించేందుకు గ్రీన్‌సిగ్నల్ తీసుకవచ్చా రు. రైతులను ఒప్పించి 253ఎకరాల వరకు భూమిని కూడా సేకరించటం

(మిగతా 7వ పేజీలో...)

- సాకారం అవుతున్న దశాబ్దాల కలలు
- పూర్తికావస్తున్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ... లక్ష మందికి పైగా ఉపాధి
- వరంగల్‌కు వచ్చేస్తున్న ఎయిర్‌పోర్టు.. దసరా నాటికి పనులు ప్రారంభం
- 'పీఎం మిత్ర'లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు చోటు
- కొత్తగా కంపెనీలు వస్తే 2లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- మూడు దశాబ్దాల కల అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి అడుగులు
- భద్రకాళి ఆలయంలో మాడవీధులు.. టూరిస్ట్ స్పాట్‌గా చెరువు అభివృద్ధి
- రింగ్ రోడ్డుతో నగరానికి నయా హంగులు


కామన్ మెస్ వద్ద విద్యార్థులు, పోలీసుల తోపులాట

కేయూ మెస్‌లో అవకతవకలు

- అధికారులను ఘెరావ్ చేసిన విద్యార్థులు
- కేర్‌టేకర్‌తో పాటు మరో ఉద్యోగిపై వేటు

కేయూ క్యాంపస్ ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో కామన్ మెస్ వద్ద విద్యార్థులు నిరసన, ఆందోళనలకు దిగారు. మంగళవారం ఉదయం విద్యార్థులు కామన్ మెస్‌లో అల్పాహారం తినే సమయంలో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. మెస్‌కు సరఫరా చేసే కట్టెల కాంట్రాక్టరు అధిక వంట చెరుకు సరఫరా ఇచ్చినట్లు బిల్లులు వెలుగులోకి రావడంతో విద్యార్థులు గొడవకు దిగారు. తప్పుడు బిల్లులతో సొమ్ము చేసుకుంటున్న కాంట్రాక్టర్‌ను తొలగించాలని విద్యార్థులు నిరసన, ఆందోళన చేపట్టారు. అదే క్రమంలో అక్కడ పనిచేస్తున్న వర్సిటీ ఉద్యోగులు విద్యార్థులను సముదాయించేందుకు ప్రయత్నించగా విద్యార్థులు విన్పించుకోలేదు. హాస్టల్స్ సిబ్బంది, ఇతర అధికారులు ప్రమేయంతో దొంగబిల్లులు పెడుతున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులకు సర్దిచెప్పారు. సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. అదే క్రమంలో విద్యార్థులు వర్సిటీ పరిపాలన భవనం వరకు నినాదాలు చేస్తూ వెళ్లారు. వర్సిటీ ఉన్నతాధికారులు, పోలీసులకు విద్యార్థుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలకు వర్సిటీ హాస్టల్స్ అవకతవకలపై విన్నవించారు. కామన్‌మెస్‌లో పనిచేస్తున్న కేర్ టేకర్‌తోపాటు మరో ఉద్యోగిని మరోచోటికి బదిలీ చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు శాంతించారు.కేయూ ఇన్స్‌పెక్టర్ ఎస్.రవికుమార్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు.

ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం చేయాలి..

- పెద్ద విమానాల రాకపోకలకు వసతులు కల్పించాలి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరిన ఎంపీ, ఎమ్మెల్యేలు

హనుమకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడిని మంగళవారం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలతో కలిసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వరంగల్ మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి ఆమోదం తెలిపినందుకు వారు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని కూడా అందజేశారు. అలాగే పెద్ద విమానాల రాకపోకలకు వీలుకల్పించేలా అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎయిర్‌పోర్టు భూసేకరణ కోసం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రూ.205కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆ భూమిని విమానాశ్రయ విస్తరణ కోసం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. మామునూరు ఎయిర్ పోర్టు అభివృద్ధితో పాటు వరంగల్ ప్రజలకు మెరుగైన విమన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని.. పర్యాటకం, వ్యాపారంతోపాటు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వివరించారు. ఎంపీ, ఎమ్మెల్యేల విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. రోడ్డు కనెక్టివిటీ, మౌలిక వసతుల కల్పన, భూసేకరణ అనంతరం విమాన రాకపోకలు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు.


కేంద్ర విమానాయాన మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు


బీఆర్ఎస్ కార్యాలయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను వీక్షిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్యపు ఆరోపణలు

- స్థానిక ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే కేసీఆర్‌పై దుష్ప్రచారం
- కాంగ్రెస్ తీరును ప్రజాక్షేత్రంలోనే ఎండగడుతాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్యపు ఆరోపణలు చేస్తూ ప్రజల దృష్టిని మార్చే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేయగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి దాస్యం వినయ్‌భాస్కర్ వీక్షించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను, 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దేశంలోనే అత్యంత వేగంగా కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిచేసి తెలంగాణ ప్రజలకు సాగు, తాగు నీరు అవసరాలు తీర్చిందని వినయ్‌భాస్కర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ అబద్ధపు ప్రచారం చేస్తోందన్నారు. ఎన్నికల్లో 420 హామీలు, ఆరు గ్యారంటీలు ఇచ్చి అమలు చేసే ధైర్యం లేక కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శించారు. రోజుకో కమిషన్, విచారణ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లబ్ధిపొందేందుకే కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ తీరును ప్రజాక్షేత్రంలోనే ఎండగడుతామని వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, జడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌కుమార్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఇలాగేనా!?

- పనులు ముందుకు సాగడం లేదు
- వారంలో పనులు మొదలు పెట్టకపోతే వేరే వారికి కేటాయిస్తాం..
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ఎల్కతుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేదని, వారంలోపు నిర్మాణాలు ముందుకు సాగకపోతే వాటిని రద్దు చేసి వేరే లబ్ధిదారులకు కేటాయిస్తామని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా మంగళవారం కలెక్టర్ అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల పునాది వరకు వచ్చి ఆగిన ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 95 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, కేవలం 31 ఇళ్లు మాత్రమే నిర్మాణం చేపట్టడంపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణం చేపట్టి ఆరు నెలలు గడిచినా పనులు ఎందుకు ముందుకు సాగడంలేని హౌసింగ్ డీఈ సిద్ధార్థ, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌లను నిలదీశారు. నిత్యం పనులను పరిశీలించకపోవడంతోనే జాప్యం జరుగుతోందని మండిపడ్డారు. లబ్ధిదారులు నిర్మాణాల వద్ద లేకపోవడంతో.. వారు ఎక్కడున్నారని అధికారులను ప్రశ్నించారు. దీంతో మీరు గ్రామానికి వస్తున్నట్లు సమాచారం లేదని గ్రామస్థులు బదులిచ్చారు. ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని హౌసింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫొటోలు దిగడానికి పరిశీలనకు రాలేదని, పనులు వేగవంతంగా చేయించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 33 వేల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం నిరీక్షిస్తున్నారని, వారం రోజుల్లో నిర్మాణాలు ముందుకు సాగకుంటే.. వాటిని రద్దుచేసి వేరే వ్యక్తులకు కేటాయిస్తామని లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్, పంచాయతీ కార్యదర్శి దగ్గరుండి పనులు చేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఐతరాజు ప్రసాద్‌రావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఐ భరత్ చంద్ర, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పుల్లూరి శ్రీధర్‌రావు, యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మండ సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


హౌసింగ్ డీఈ, పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్



రామప్ప చెరువుకు జలకళ

దేవాదుల ద్వారా చేరుకున్న గోదావరి జలాలు

వెంకటాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట శివారులో ఉన్న రామప్ప చెరువులోకి గోదావరి జలాలు చేరుకున్నాయి. గంగారం దేవాదుల పంపుహౌస్ నుంచి మోటార్లు ఆన్ చేయగా అవి భీంఘన్‌పూర్ పంపుహౌస్‌లోకి చేరి అక్కడి నుంచి రామప్ప చెరువులోకి వచ్చాయి. ఇరిగేషన్ అధికారులు జూలై 17న ఒక మోటారు, ఈనెల 2న మరో రెండు మోటార్లను ఆన్‌చేసి నీటిని విడుదల చేయగా అదే రోజు మధ్యాహ్నం గోదావరి జలాలు రామప్ప చెరువులోకి చేరాయి. యాసంగి పంట కోసం భీంఘన్‌పూర్ పంపుహౌస్ నుంచి ఒక మోటారు ద్వారా రామప్ప చెరువులోకి రెండు టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ రవీందర్ తెలిపారు. రామప్ప చెరువు 30 అడుగుల నీటిసామర్థ్యం కలిగి ఉంది. జూలై 17నుంచి మోటార్లు ఆన్‌చేయగా 1,430 ఎంసీఎఫ్‌టీ నీటిని రామప్పకు తరలించారు. జూలై 17కు ముందు రామప్ప నుంచి ధర్మసాగర్ పంపుహౌస్‌కు 1380 ఎంసీఎఫ్‌టీ నీటిని పంపినట్టు రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రామప్ప నీటిమట్టం 26.2 అడుగులు ఉన్నట్టు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలి

జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ మెడికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లు ఉన్న అన్ని ఆస్పత్రులు ప్రభుత్వ మార్గదర్శకాలు, నియమ నిబంధనలు కచ్చితంగా పాటించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ చట్టం పరిధిలో రిజిస్టర్ అయిన సెంటర్లపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధమని, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ జరిపే వాటి గురించి, చట్ట విరుద్ధంగా అబార్షన్లు నిర్వహించే వారి గురించి సమాచారం తెలియజేసేందుకు ఫోన్ నెంబర్ 6300030940 క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రతీ ఆశాకార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమా దేశ్‌పాండే మాట్లాడుతూ.. లీగల్ వలంటీర్ల ద్వారా లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, వైద్య, ఆరోగ్యశాఖకు సహకరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఏసీపీ నరసింహారావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, బన్ను ఆరోగ్య సేవల సొసైటీ ప్రతినిధి నీతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐటీఐ, ఏటీసీలలో 'స్పాట్'

కాజీపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో 2025 - 26 విద్యా సంవత్సరానికి గాను మిగిలి ఉన్న సీట్లకోసం ఈ నెల 6 నుంచి 28 వరకు ఉదయం 11 గంటల లోపు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. నేరుగా వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు అర్హులే, కొత్త వారు మాత్రం ప్రతీరోజు ఉదయం 9 నుంచి 1 గంటవరకు కాజీపేట ఐటీఐలో నేరుగా హాజరుకావల్సి ఉంటుందని చెప్పారు. వెకెన్సీ వివరాలు ప్రతిరోజు వెబ్‌సైట్‌లో ఉంచనున్నట్టు తెలిపారు. వాక్‌ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశం పొందేవారు హెచ్‌టీటీపీఎస్ // ఐటీఐ. తెలంగాణ. గవ్. ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కాజీపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట - హసన్‌పర్తి వడ్డెపల్లి రైల్వే బ్రిడ్జివద్ద మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాజీపేట రైల్వే ఎస్సై ఎం.అభినవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మృతుడి వయస్సు 65 - 70 మధ్య ఉంటుంది. ఎత్తు 5.5 పసుపురంగు ఫుల్ హ్యాండ్ షర్ట్, బెల్లం కలర్ లోయర్ ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై పుట్టుమచ్చ ఉంది. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రెండురోజుల కిందట బ్రిడ్జి కింద ఉన్న నీటిలో పడి చనిపోవడంతో ముఖం గుర్తించడానికి వీలులేదు. ఆనవాళ్ల బట్టి యాచకుడిగా భావిస్తున్నామని స్థానికులు సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ 87126 58609, 9440 027342 నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం సీజ్

వరంగల్ క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 55, 56 డివిజన్‌లలో అక్రమంగా విక్రయిస్తున్న సుమారు 6 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని విక్రయదారులైన దూలం ప్రసాద్, భూపతి మనోహర్‌లపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ దుర్గాభవాని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై వెంకన్న చందు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సంధ్య

వరంగల్ మెడికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రతీ బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సంధ్య తెలిపారు. మంగళవారం వరంగల్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్, కూరపాటి ఆస్పత్రి సౌజన్యంతో కాకతీయ మెడికల్ కలాశాల సేవార్డ్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా 5 కేఎం వాకథాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగంలో ఎంతో అభివృద్ధి సాధించిన శిశువులకు ఈ లిక్విడ్ గోల్డ్ (అమ్మ పాలు)ను మించిన పౌష్టికాహారం లేదన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే తల్లిపాలను మించిన అమృతం లేదన్నారు. అయితే దురదృష్టవశాత్తు కొంతమంది చిన్నారులు పలు కారణాలతో తల్లిపాలకు దూరమవ్వడం బాధాకరమని, వీరికోసం నగరంలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో మిల్క్ బ్యాంక్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఎన్‌ఐసీయూ) నిత్యం ఎంతో మంది శిశువులు ప్రాణాలతో పోరాడుతున్నారని, ఇలాంటి వారికి తల్లిపాలు ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన సేవార్డ్ బాధ్యులను కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సంధ్య అభినందించారు.

డాక్టర్ కూరపాటి రాధిక మాట్లాడుతూ.. తల్లిపాలతో విస్తృత ప్రయోజనాలు ఉన్నాయని, వాటిపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. తల్లిపాలు ప్రకృతి అందించిన ఉత్తమ ఆహారమని తెలిపారు. కేఎంసీ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు కొనసాగిన ఈ వాకథాన్‌లో డాక్టర్ శ్రీరామ్‌రెడ్డి, డాక్టర్ అశోక్‌రెడ్డి, డాక్టర్ అనిల్, డాక్టర్ కరుణాకర్, డాక్టర్ బలరాంనాయక్, డాక్టర్ సుమంత్, డాక్టర్ కూరపాటి రమేశ్, డాక్టర్ నవీన్, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ నవదీప్, సేవార్డ్‌క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షురాలు జి.అనన్య, ప్రధాన కార్యదర్శి సాయి సుధాంశ్‌రెడ్డి, రామకృష్ణారావు, హేమాంగిని, కేఎంసీ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, జయ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, రోహిణి నర్సింగ్ కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



వాకథాన్ నిర్వహిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వసతి గృహాలను తనిఖీ చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గురుకులాలు, వసతి గృహాలను ప్రత్యేక అధికారులు తరుచుగా తనిఖీ చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం ఆమె రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్స్ నిర్వహణపై ప్రత్యేక అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల సంక్షేమం కోసం అన్ని మండలాలకు స్పెషల్ అధికారులను నియమించామని, జిల్లా, మండల స్థాయి అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. పోషకాహారం, పరిశుభ్రత, విద్యా సామగ్రి, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

చిన్నారిని ఢీకొట్టిన ట్రాలీ ఆటో

అక్కడికక్కడే మృతి.. గుండేడులో ప్రమాదం



చిన్నారి రిషిక మృతదేహం

కమలాపూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 20 నెలల చిన్నారి ఆటలాడుకుంటుండగా ఆటో ట్రాలీ ఢీకొనడంతో మృతిచెందింది. ఈ సంఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని గుండేడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ హరికృష్ణ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుండేడు గ్రామానికి చెందిన కాశెశ శ్రీకాంత్ - తిరుమల దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె రిషిక ఉన్నారు. కుమారుడు రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం శ్రీకాంత్ కూలీ పనులకు వెళ్లిపోయాడు. తల్లి తిరుమల ఇంటి పనుల్లో నిమగ్నమైంది. రిషిక ఆడుకుంటూ ఇంట్లో నుంచి రోడ్డుపైకి వచ్చింది. ఈ క్రమంలో అటుగా వచ్చిన కూరగాయలు విక్రయించే ఆటో ట్రాలీ రిషికను ఢీకొట్టింది. దీంతో రిషిక అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న కమలాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిన్నారి రిషిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

క్రీడా పాఠశాలలో ఫర్నిచర్ కోసం దరఖాస్తుల స్వీకరణ

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో త్వరలో తాత్కాలికంగా ప్రారంభం కానున్న క్రీడా పాఠశాల, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు ఫర్నిచర్, ఇతర సామాన్లు సమర్పించేందుకు గుత్తేదార్ల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6నుంచి 8వ తేదీ వరకు హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో గుత్తేదార్లకు దరఖాస్తులను అందుబాటులో ఉంచుతామన్నారు. స్పోర్ట్స్ పాఠశాలలో విద్యార్థులకు అందించాల్సిన సదుపాయాల్లో భాగంగా ఉడెన్ డైనింగ్ టేబుల్స్, ఐరన్ బెడ్ విత్‌ప్లైఉడ్, పరుపులు, బెడ్‌షీట్స్, పిల్లోస్‌తోపాటు ఫర్నిచర్, ఇతర సామాన్లు సరఫరా చేసేందుకు గుత్తేదార్ల నుంచి ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని డీఎస్‌ఏను సంప్రదించాలని అశోక్‌కుమార్ సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

హసన్‌పర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణలో భాగంగా హౌస్ వైరింగ్, సెల్ ఫోన్ రిపేరింగ్, ఏసీ, రిఫ్రిజిరేటర్, సీసీటీవీ వంటి కోర్సులలో ఉచిత శిక్షణనిస్తున్నట్లు భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బాన రవి తెలిపారు. ఆయా కోర్సులలో ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు స్వయంగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 18 నుంచి 45 సంవత్సరాలు కలిగిన వరంగల్, హనుమకొండ, ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ ఆర్‌సెటీ) సంస్కృతి విహార్, టీటీడీసీ హసన్‌పర్తి, వరంగల్ జిల్లా, 506371 చిరునామాలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 97040 56522, 98493 07873, 99491 08934 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జనగామలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ హాస్పిటల్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ రెసిడెంట్ విభాగంలో ఖాళీగా ఉన్న 28 పోస్టుల భర్తీకి ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే రోజు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఆయా కేటగిరీలకు సంబంధించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. www.gmc.jangaon.org వెబ్‌సైట్ నుంచి ఒరిజినల్ ఫార్మట్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు.

బస్సు బోల్తా ఘటనలో మరొకరు మృతి



బి. లాలు(ఫైల్)

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో మహబూబాబాద్‌కు బయలుదేరిన మినీ బస్సు అదుపుతప్పి బోల్తా పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రగాయాలతో హయత్‌నగర్ సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో తాపీమేస్త్రీ బానోత్ లాలు(45) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. మృతుడు బానోత్ లాలు మహబూబాబాద్ పట్టణ తాపీమేస్త్రీల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కావడంతో పట్టణంలోని తాపీమేస్త్రీలు శ్రీనివాస సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీంతో మానుకోట పట్టణంలో విషాదం నెలకొంది.

కౌలు రైతు ఆత్మహత్య



సమ్మయ్య (ఫైల్)

మంగపేట, ఆగస్టు 5 (ఆం ధ్రజ్యోతి) : తన అవసరాలకు ఫర్టిలైజర్ షాపు యజమాని అప్పు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెందిన కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా మంగపేట మండలంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగపేట మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన పరమాత్ముల సమ్మయ్య (52) పన్నెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి డబ్బులు అవసరం కాగా ఓ ఫర్టిలైజర్ వ్యాపారిని సోమవారం రూ. 50 వేలు అప్పు అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని, అప్పు ఇచ్చేది లేదని ఆయన తేల్చి చెప్పాడు. ఇప్పటికే రూ. లక్ష అప్పు ఉన్నావని, మళ్లీ అడిగితే ఎలా? అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మనస్తాపం చెందిన సమ్మయ్య అతడి వద్దే గడ్డి మందు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లి తాగాడు. అపస్మారస్థితికి చేరుకున్న సమయ్యను గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తున్న క్రమంలో మంగళవారం ఉదయం సమ్మయ్య మృతి చెందాడు. మృతురాలి భార్య కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంగపేట ఎస్సై సూరి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమర్తే ఉన్నారు.

డెంగీతో యువతి మృతి



దీపిక(ఫైల్)

వాజేడు, ఆగస్టు 5(ఆంధ్ర జ్యోతి): డెంగీ లక్షణాలతో యువతి మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని కోయవీరాపురం గ్రామానికి చెందిన ఉయిక దీపిక(22)కు ఐదు రోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు వాజేడు వైద్యశాలకు తరలించారు. రక్తనమూనాల పరీక్ష అనంతరం డెంగీ లక్షణాలు ఉన్నాయని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో ఆమెను ఏటూరునాగారంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందించగా ఆరోగ్యం మెరుగైంది. మళ్లీ సోమవారం దీపిక అనారోగ్యానికి గురైంది. దీంతో వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్న క్రమంలోనే మృతిచెందింది. దీపిక ఈ ఏడాది డిగ్రీ పూర్తిచేసి బీఈడీలో చేరేందుకు సిద్ధమవుతోంది. తండ్రి రామారావు నాలుగేళ్ల క్రితం మృతిచెందగా తల్లి దేవమ్మ, అన్న సంరక్షణలో ఉంటూ చదువుకుంటోంది.

ప్రజాసమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



నర్సంపేటలో కూనంనేని సాంబశివరావును సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

నర్సంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కారం అయ్యేవరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం ములుగు వెళ్తున్న ఆయనకు నర్సంపేటలో సీపీఐ నాయకులు స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు గడిచినా దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. పాలకుల విధానాల వల్ల నిరుద్యోగ సమస్య, నిరక్షరాస్యత, భూసమస్య, ప్రజాసమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారీవర్గాలకు పాలకులు ఊడిగం చేసే ఆర్థిక విధానాలను తీసుకురావడం వల్ల పేదలపై పన్నుల భారం పడుతోందన్నారు. పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మేడ్చల్ జిల్లాలో ఈనెల 19 నుంచి 22 వరకు జరిగే రాష్ట్ర మహాసభలో చర్చించి రానున్న రోజుల్లో ప్రజలను ప్రజాపోరాటాల వైపు మళ్లించేందుకు నిర్ణయాలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు పంజాల రమేశ్, నర్సంపేట మండల కార్యదర్శి యాకూబ్, జిల్లా సమితిసభ్యులు మియాపురం గోవర్ధన్, గడ్డం యాకయ్య, నాగరాజు, పిట్టల సతీష్ పాల్గొన్నారు.

గుళికలు తీసుకోవాలని బలవంతం చేయొద్దు

● కొత్తగూడ ఏవో ఉదయ్ ● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గాంధీనగర్‌లో మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

కొత్తగూడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొనుగోలుకు వచ్చిన రైతులకు వారికి అవసరం లేని గుళికలు లేక ఇంకా ఏదైనా వస్తువులు తీసుకోవాలని బలవంతం చేయొద్దని ఏవో ఉదయ్ హెచ్చరించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'యూరియా కావాలంటే గుళికలు కొనాల్సిందే' అనే కథనానికి స్పందించిన ఏవో ఉదయ్ గాంధీనగర్‌లోని మన గ్రోమోర్ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. యూరియా విక్రయాలను పర్యవేక్షించారు. యూరియాకు ఇతర వస్తువులు లింక్ పెట్టి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు యూరియాతో లింకులు పెట్టినా, బ్లాక్ చేసినా అధిక ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి విషయాలపై రైతులకు ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో వెంట ఏఈవో వినోద్ ఉన్నారు.

మహిళా డెయిరీ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పరకాల మహిళా డైరీ ఏర్పాటు, నిర్వాహణకు సమగ్ర ప్రణాళికలు జిల్లా అధికారులు రూపొందించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరకాల మహిళా డైరీ ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన అంశాలపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారదతో కలిసి మంగళవారం రాత్రి ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా డైరీ ఏర్పాటు నిర్వహణ, పాల సేకరణ, పాలు, పాల ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ తదితర అంశాలపై అధికారులు, ముల్కనూరు డైరీ జీఎం భాస్కర్‌రెడ్డితో ఎమ్మెల్యే చర్చించారు.

అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పరకాల మహిళా డైరీ ద్వారా పాలు, పాల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. పాల ఉత్పత్తి పెంచేందుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు డైరీ తోడ్పడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. మహిళా డైరీ ద్వారా పాలు, పాల ఉత్పత్తులను తీసుకురావాలన్నారు. డైరీ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్‌డీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గద్దర్ వర్ధంతి సభకు రావాలి

కేయూ క్యాంపస్ ఆగస్టు 5, (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హరిత కాకతీయ టూరిజం హోటల్‌లో బుధవారం మధ్యాహ్నం 1 గంటలకు జరిగే గద్దర్ రెండో వర్ధంతి సభకు అందరూ తరలిరావాలని టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్ పిలుపునిచ్చారు. మంగళవారం కేయూలో ఏర్పాటుచేసిన సమావేశంలో టీజీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్, బీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్‌లతో కలిసి మాట్లాడారు.

గద్దర్ వర్ధంతి సభలో ప్రొఫెసర్ కంచ అయిలయ్య, గాదె ఇన్నయ్య, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, గద్దర్ ఫౌండేషన్ చైర్మన్ కొల్లూరి సత్తయ్య, కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్, ఓయూ జేఏసీ నేత డాక్టర్ నలిగంటి శరత్, చింతం ప్రవీణ్, సాయిని నరేందర్, బండి మొగిలి తదితరులు హాజరై మాట్లాడుతారని తెలిపారు. గద్దర్ అభిమానులు, తెలంగాణ ఉద్యమకారులు, కవులు, కళకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



ఆయన జీవితమంతా తెలంగాణమే!

- వివక్ష, అన్యాయాన్ని శాస్త్రీయంగా నిరూపించిన మేధావి
- మలిదశ ఉద్యమానికి వెన్నంటి వున్న గురువు
- దోపిడీపై నిలదీసిన ధీశాలి
- అన్యాయాలపై పోరాడిన యోధుడు
- నేడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి

హనుమకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 'మా వనరులు మాకున్నాయి.. మా వనరులపై మాకు అధికారం కావాలి.. యాచక దశ నుంచి శాసించే దశకు తెలంగాణ రావాలి!.. మా తెలంగాణ మాగ్గావాలి!!..' అని గర్జించిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తన ఆశగా, శ్వాసగా జీవించిన మహోన్నత వ్యక్తి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ భావజాలాన్ని ప్రజల మనసుల్లో ప్రజ్వరిల్ల చేసిన చైతన్య దీప్తి. ఉద్యమ నిర్మాణంలో కీలక భూమిక పోషించడమేకాక దాని వ్యాప్తిలోనూ నిర్మాణాత్మక పాత్ర పోషించారు. విద్యార్థులకు మనసుకు హత్తుకునేలా పాఠాలు బోధించినట్లుగానే తెలంగాణ ఉద్యమ ఆవశ్యకతనూ అంతే సులభంగా ప్రజలకు అర్థమయ్యేలా అనేక వేదికలపై విడమర్చిచెప్పిన మహోపాధ్యాయుడు. నేడు ఆయన జయంతి. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ స్మృతిలో ఒక సారి..

పరిపాలనాదక్షుడు

జయశంకర్ గొప్ప అధ్యాపకుడే కాదు మంచి పరిపాలనాదక్షుడు కూడా. ఎమర్జెన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, వైస్‌చాన్సలర్‌గా, హైదరాబాద్‌లో సీఫెల్ రిజిస్ట్రార్‌గా, న్యూఢిల్లీలోని ప్రభుత్వ జాతీయ కమిషన్ ఆర్గనైజింగ్ సెక్టార్ మెంబర్‌గా, కేరళలోని మహాత్మాగాంధీ వర్సిటీ ప్లానింగ్ బోర్డు సభ్యుడిగా, సీఫెల్, వరంగల్‌లోని ఆర్ఈసీలకు బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యుడిగా వివిధ పదవులను సమర్థవంతంగా నిర్వహించి పాలనాదక్షుడిగా పేరు గడించారు.

విజ్ఞాన సర్వస్వం

జయశంకర్ నడిచే విజ్ఞాన సర్వస్వం. పలు అంశాలపైన ఆయనకు పూర్తి సాధికారత ఉండేది. బహుభాషా కోవిదుడు. ఉర్దూలో చదువుకున్నందువల్ల ఆయనకు ఆ భాష అంటే వల్లమాలిన అభిమానం ఉండేది. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అపారమైన నైపుణ్యముండేది. ఆయన ఆర్థిక శాస్త్రవేత్త మాత్రమే కాదు. గొప్ప రాజనీతిజ్ఞుడు. తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఒక శాస్త్రీయతను సమకూర్చిన వ్యక్తి. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తన ప్రసంగాల ద్వారానే కాక రచనల ద్వారా కూడా ప్రజలకు విడమరిచి చెప్పారు. ఇందుకు ఆయన రాసిన పుస్తకాలు, వందలాది వ్యాసాలు తిరుగులేని ఆనవాళ్లకు శిలాశాసనాలు. ఆయన రచనలే తెలంగాణ ఉద్యమ చరిత్రకు బోధనకు పాఠ్యగ్రంథాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్, తెలంగాణలో ఏం జరుగుతోంది, వక్రీకరణలు-వాస్తవాలు, తల్లడిల్లుతున్న తెలంగాణ వ్యాస సంపుటి, తెలంగాణ (అంగ్లంలో) ఆయన రచనల్లో కొన్ని.

గ్రామీణ నేపథ్యం

జయశంకర్‌ది గ్రామీణ నేపథ్యం. పల్లె నుంచి అంచెలంచెలుగా పల్లవించిన జీవితం ఆయనది. 1934 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటలో విశ్వబ్రాహ్మణ కులంలో జన్మించారు. తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంతారావు. ఆయనకు ముగ్గురు అన్నదమ్ములు. ముగ్గురు అక్కచెల్లెళ్లు. సొంత కుటుంబాన్ని నిర్మించుకోకుండా తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసిన ఆజన్మ బ్రహ్మచారి. అధ్యాపకుడిగా ఆయన ఎంతోమందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు.

సాంస్కృతిక పునరుజ్జీవనం

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు పూర్తిగా ధ్వంసమైనందుకు ఆచార్య జయశంకర్ ఎంతో ఆవేదన చెందారు. ఈ ప్రాంత భాష, యాస ఈసడింపునకు గురైంది. తెలుగు భాషను భ్రష్టుపట్టిస్తున్నారని అనేక వేదికలపై ఆందోళన వ్యక్తం చేశారు. సీమాంధ్ర సంస్కృతిని తెలంగాణ ప్రజలపై రుద్దడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. భాషకు మతం ఉండదు. మతానికి భాష ఉండదు. సీమాంధ్రులు రాసిన కవిత్వంలోనూ ఉర్దూ పదాలున్నాయి. సీమాంధ్రులకు వాళ్లు వాడినది ఉర్దూ పదం అనేది వాళ్లకు తెలియదు. అది తెలియదనేది కూడా వాళ్లకు తెలియదు. అందుకే ఎవడి భాష వాడికే ప్రామాణికం అంటూ సహేతుకంగా వాదించేవారు. రెండేళ్లపాటు గొంతు క్యాన్సర్‌తో బాధపడి 2011 జూన్ 21న ఆచార్య జయశంకర్ తుదిశ్వాస విడిచారు. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను 50 ఏళ్లుగా బతికించి.. శిఖరాగ్రస్థాయికి చేర్చి.. తాను కలలు కన్న ప్రత్యేక రాష్ట్రాన్ని కళ్లారా చూడకుండానే కన్నుమూశారు.

విలక్షణమైన వ్యక్తిత్వం

జయశంకర్‌ది విలక్షణమైన వ్యక్తిత్వం. నిరాడంబరుడు. నిగర్వి. తెలంగాణ విషయానికి వస్తే మాత్రం ఆయనంత కఠినంగా ఇంకెవరూ ఉండేవారు కాదు. తాను నమ్మిన సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడి ఉన్న వ్యక్తి. ఆయన ఎన్నో ఉన్నత పదవులను నిర్వహించారు. వాటన్నింటిలో రాణించారు. రాజీపడడం ఆయన డిక్షనరీలోనే లేదు. చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, విస్పష్టంగా చెప్పడం జయశంకర్‌కు వెన్నతో పెట్టిన విద్య.

ఉద్యమ శిఖరం

జయశంకర్ తెలంగాణ కోసం రాజకీయ ప్రకియ అనివార్యమని ప్రగాఢంగా విశ్వసించారు. కానీ దాని ద్వారానే ప్రత్యేక తెలంగాణ సాధ్యం కాదని జీవితమంతా బోధించారు. తెలంగాణ భావజాలాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడం ద్వారా పోరాటం సాగించిన ఉద్యమ శిఖరం. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకుముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి ఆమెరికా వరకు వ్యాపింపచేయడంలో ఆయన పాత్ర మరువలేనిది. ఎవరూ మాట్లాడడానికి సాహసించని కాలంలోనే 1954లో విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్.

విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన మేధావి. అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించారు. తెలంగాణ డిమాండ్‌ను 1969 నుంచి సునిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ నిరంతరం రచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కేసీఆర్‌కు మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. తెలంగాణ తొలి ఉద్యమంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా మలి ఉద్యమాన్ని చాలా జాగ్రత్తగా నిర్మాణం కావడంలో మార్గదర్శనం నెరిపారు. తెలంగాణ ఉద్యమానికి తాత్వికతను, సైద్ధాంతికతను కల్పించడం ద్వారా సిద్ధాంతకర్తగా అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.



ఎంవోయూపై సంతకం చేస్తున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి

నిట్, థాయిలాండ్ ఏఐటీల మధ్య ఎంవోయూ

- ద్వంద్వ మాస్టర్ డిగ్రీలు పొందే అవకాశం
- మొదట జియోఇన్‌ఫార్మాటిక్స్‌లో కోర్సు ప్రారంభం
- ప్రతీ స్పెషలైజేషన్‌లో 20 మంది విద్యార్థులకు అవకాశం

హనుమకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్, థాయిలాండ్‌లోని ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మధ్య మంగళవారం ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. దీంతో ఈ రెండింటి మధ్య గ్లోబల్ అకడమిక్ భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా మరో కీలక అడుగుపడింది. అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై రెండు సంస్థలు సంతకం చేశాయి. వరంగల్ నిట్ తరుపున డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొఫెసర్ వెంకటయ్య చౌదరి, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ పి.రతీష్‌కుమార్, పరిశోధన, అభివృద్ధి డీన్ ప్రొఫెసర్ సోనావాణె షిరీష్ హరి, విద్యార్థుల సంక్షేమం డీన్ కె.కిరణ్‌కుమార్, రిజిస్ట్రార్ సునిల్ కుమార్ మెహతా, సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కె.వెంకట్ రెడ్డి, ప్రొఫెసర్ ఎం.శశి, ప్రొఫెసర్ మనాలి పాల్ పాల్గొన్నారు.

ఏఐటీ థాయిలాడ్ తరుపున స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, గ్లోబల్ వాటర్ అండ్ శానిటేషన్ సెంటర్ కో డైరెక్టర్ ప్రొఫెసర్ సంగమ్ శ్రేష్ఠ, మార్కెటింగ్, రిక్రూట్‌మెంట్ అండ్ డిజిటల్ స్ట్రాటజీ మేనేజర్ అలిస్టినా శ్రేష్ఠ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఆర్థర్ లాన్స్ గోన్జాలెస్, రణధీర్ మందాడి పాల్గొన్నారు. ఈ ఒప్పందం ద్వంద్వ మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్, ఉమ్మడి పరిశోధన, విద్యార్థులు, బోధన సిబ్బంది మార్పిడి, అంతర్జాతీయ సెమినార్లు, వర్క్‌షాపుల నిర్వహణ వంటి కార్యక్రమాలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది. ఈ ఎంవోయూలో భాగంగా మొదటి ద్వంద్వ మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను జియోఇన్‌ఫార్మాటిక్స్ స్పెషలైజేషన్‌లో ప్రారంభిస్తారు. ఇది రెండేళ్ల వ్యవధిగల ప్రోగ్రామ్. ప్రతీ స్పెషలైజేషన్‌కు 20 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. విద్యార్థులు రెండు సంస్థల నుంచి అకడమిక్ అవసరాలను పూర్తి చేసిన తర్వాత వరంగల్ నిట్ నుంచి ఎంటెక్, ఏఐటీ థాయిలాండ్ నుంచి మాస్టర్ డిగ్రీ పొందుతారు.

ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబుధి మాట్లాడుతూ.. ఈ భాగస్వామ్యం భారతీయ ఉన్నత విద్యావ్యవస్థను అంతర్జాతీయాకరణ దిశగా తీసుకువెళ్లే ముందడుగు అన్నారు. ఇది కేవలం విద్యమార్పిడికే కాకుండా ప్రపంచస్థాయిలో పరిశోధన, ఆవిష్కరణలకు రెండు సంస్థల మధ్యవేదికగా నిలుస్తోందన్నారు. వరంగల్ నిట్ పూర్వ విద్యార్థి అయిన ప్రొఫెసర్ నితిన్ త్రిపాఠి ఈ కార్యక్రమానికి పూర్తిగా సహకరిస్తానని, ప్రపంచస్థాయిలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణ ద్వారా సమాజానికి సేవ చేయడమే లక్ష్యమని అన్నారు. రాబోయే రోజుల్లో పరస్పర సందర్శనలు, మరిన్ని ఉమ్మడి కార్యక్రమాల ద్వారా ఈ ఒప్పందం ప్రయోజనాలను మరింత విస్తరించాలని రెండు సంస్థలు నిశ్చయించాయి.

బోడ కాకరకాయ ప్రియం


కిలో ధర రూ.200

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూరగాయల్లో రారాజు బోడ కాకరకాయ.. ఇవి వర్షాకాలంలో మాత్రమే వస్తాయి.. బోడ కాకరకాయలు ఎక్కువగా దొరకకపోవడంతో హాట్ కేక్‌లా అమ్ముడుపోతున్నాయి. కిలో బోడ కాకరకాయ రూ.200కు విక్రయిస్తున్నారు. కిలో చికెన్ ధర కన్నా ఎక్కువగా పలుకుతోంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి ప్రాంతానికి చెందిన రైతు బోడ కాకరకాయలు 50 కేజీల బస్తాలో తీసుకువస్తే గంటలోనే ఖాళీ అయిపోయాయి. గతంలో సాధారణంగా వర్షాకాలంలో పల్లెల్లో చెలకలు, గుట్టల వద్ద బోడ కాకరకాయలు దొరికేవి. వర్షాకాలంలో అవి ఎక్కువగా పండుతాయి. గతంలో పల్లెల్లో దొరికిన బోడ కాకరకాయలను పట్టణాలకు తీసుకువచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం కోతుల బెడదతో గ్రామాల్లో చెలకల వద్ద బోడ కాకరకాయతో పాటు ఇతర కూరగాయల పంటలూ కరువయ్యాయి. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి ప్రాంతం నుంచి ఓ రైతు మంగళవారం మానుకోట పట్టణానికి తన ద్విచక్రవాహనం పై 50 కేజీల బస్తాలో బోడ కాకరకాయలు తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. కిలో రూ.200కు ధరతో విక్రయించాడు. అవి గంటలోనే హాట్ కేక్‌లా అమ్ముడుపోయాయి. బోడ కాకరకాయ నోరూరించే రుచితో పాటు ఔషధ గుణాలుండడంతో వాటిని జనం కొనడానికి ఆసక్తి చూపుతున్నారు.



మహబూబాబాద్‌లో బోడ కాకరకాయలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఇరిగేషన్ సీఈగా వెంకటేశ్వర్లు



హనుమకొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ చింతగట్టు నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్‌గా వరంగల్ ఎస్ఈ వెంకటేశ్వర్లుకు పదోన్నతి లభించింది. మంగళవారం రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ కార్యాలయం ఉత్తర్వుల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఈలను సీఈలుగా పదోన్నతులు కల్పించారు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్లుకు పదోన్నతి కల్పించి సీఈగా నియమించారు. కాగా, గతంలో ఇన్‌చార్జి సీఈగా పనిచేసిన జి.అశోక్‌కుమార్ జూలై 31న ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే.

ఎంజీఎంలో మార్చురీ, ఫ్రీజర్లకు మరమ్మతులు

నిధులు మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ మెడికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ప్రభుత్వ ఆస్పత్రిలో శవాల నిర్వహణ మరింత సౌకర్యంగా ఉండేందుకు, మార్చురీ విభాగంలో ఫ్రీజర్ల మరమ్మతు పనులు ప్రారంభమైనట్లు ఎంజీఎం పర్యవేక్షకుడు కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజులుగా ఫ్రీజర్లు పనిచేయక శవాలను భద్రపర్చేందుకు ఇబ్బంది ఏర్పడుతున్న నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ప్రత్యేక దృష్టి సారించి రూ.4.95 లక్షలు ప్రత్యేకంగా మంజూరు చేశారని తెలిపారు. ఈ పనులను సర్ఫ్ సైంటిఫిక్ వారు చేయడంతోపాటు ఒక యేడాది నిర్వహణ చేస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో రోజు రోజుకూ పెరుగుతున్న శవాల సంఖ్యలో దృష్టిలో ఉంచుకొని మార్చురీ విభాగంలో శవాల భద్రతతో కూడిన నిర్వహణ కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అవసరమైన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఆస్పత్రికి వచ్చే బాధిత కుటుంబాలకు మరింత మానవీయంగా సేవలందించేందుకు మార్గం సుగమం అవుతుందని ఆయన తెలిపారు.

● చింత తీర్చు చెట్టు

కోటలో నేటికీ నీడనిస్తున్న శతాబ్దాల కాలం నాటి వృక్షం

వరంగల్ కోటలో పురాతన కాలంనాటి చింతచెట్టు పర్యాటకులను ఆకర్షిస్తోంది. సుమారు 200 ఏళ్లనాటి ఈ వృక్షం నేటికీ నీడనిస్తోంది. మధ్యకోటలోని రాతికోట సమీపంలోని పొలాల మధ్య ఉన్న ఈ చెట్టును స్థానికులు మొండి చింత అని పిలుస్తుంటారు. దాని చుట్టూ ముగ్గురు వ్యక్తులు నిలబడి చేతులు చాచినా అందనంత వైశాల్యం ఉంటుంది. ఒకప్పుడు ఇది విరివిరిగా కాసేదని, ఇప్పుడు దాదాపు ఆగిపోయిందని వృద్ధులు చెబుతున్నారు. తమ చిన్నతనంలోనే ఈ చెట్టు కింద దాగుడుమూతలు ఆడేవారమని, ఆ చెట్టు తొర్రలో ఆరుగురి వరకు దాక్కునేవారమని అంటున్నారు. ఎండకు, వానకు ఇది అందరినీ కాపాడేదని గుర్తు చేస్తున్నారు.

- ఖిలావరంగల్



ఓరుగల్లుకు కొత్త రూపు

(5వ పేజీ తరువాయి)

దాదాపు పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రూ.450కోట్లు కేటాయించింది. దసరా నాటికి భూసేకరణ పనులు పూర్తిచేసి, పనులు ప్రారంభించాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) భావిస్తోంది. 2028లో వరంగల్ నుంచి ఆకాశయానం చేసే అవకాశం ప్రజలకు దక్కే అవకాశం ఉంది. దీంతో పారిశ్రామికంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి అడుగులు పడనున్నాయి. ప్రధానంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్పతో పాటు చారిత్రక కాకతీయుల కట్టడాలకు టూరిస్టులు పెరగనున్నారు.

టెక్స్‌టైల్ పార్కుతో ఉద్యోగాలు

వరంగల్‌లోని అజంజాహిమిల్లు మూతపడటంతో ఉన్న ఒక్క భారీ పరిశ్రమ లేకుండా పోయింది. పత్తి ఉత్పత్తి ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో మరో వస్త్ర పరిశ్రమను ఏర్పాటు చూసేందుకు వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట, సంగెం మండలం చింతలపల్లి గ్రామాల్లో 1,350 ఎకరాల్లో 2017 అక్టోబరు 22న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేశారు. అయితే ఆశించిన స్థాయిలో కంపెనీలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రాలేదు. 2020-21లో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ (పీఎం మిత్ర) పార్కు పథకం ఏర్పాటు చేసింది. అయితే ఈ పథకంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును చేర్చేందుకు నిబంధనలు అడ్డంకిగా చూపించింది. ఎట్టకేలకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో పీఎం మిత్ర పథకంలో కాకతీయ టెక్స్‌టైల్ పార్కును చేర్చారు. దీంతో 2027-2028 నాటికి పీఎం మిత్ర పథకం ద్వారా వచ్చే గ్రాంట్లతో పనులు పూర్తి చేయనున్నారు. దీంతో వివిధ దేశాల నుంచి భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. ఈలోగా ఎయిర్‌పోర్టు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండటంతో వరంగల్‌కు టెక్స్‌టైల్ పార్కు మరో మణిహారంగా మారనుందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

మరికొన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం

వరంగల్‌ను తెలంగాణకు రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తోంది. అందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న అనేక అభివృద్ధి పనులకు మోక్షం కలిగిస్తోంది. ఇప్పటికే వరంగల్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు చేపట్టింది. భూసేకరణ కూడా పూర్తి చేసింది. ఆరెపల్లి జంక్షన్ వద్ద రైతుల అభ్యంతరాలతో రింగ్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఈ సమస్య కూడా పరిష్కరించేందుకు కుడా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆర్ఆర్, ఐఆర్ఆర్ పూర్తయితే వరంగల్ నగరానికి కొత్త శోభ సంతరించుకోనుంది. అలాగే ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు భద్రకాళి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే రూ.30కోట్ల నిధులు కేటాయించి మాఢవీధులు అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. అలాగే భద్రకాళి చెరువులో టూరిస్టులను ఆకర్షించేందుకు ఐలాండ్‌ల నిర్మాణంతో పాటు గ్లాస్‌వంతెనలు, అతిథి గృహాలను నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. భద్రకాళి ఆలయ అభివృద్ధిని చేసి వరంగల్‌ను టూరిస్ట్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఇప్పటికే 1975నాటి వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను మార్చి గత ఏడాది నవంబరు 18న కొత్త వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తీసుకవచ్చారు. సుమారు రూ.90కోట్ల వ్యయంతో తెలంగాణ ప్రజా కవి, ధిక్కార స్వరం కాళోజీ నారాయణరావు స్మారకార్థం కాళోజీ కళా క్షేత్రాన్ని నిర్మించారు. వీటితో పాటు ఓరుగల్లు ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకరానున్నారు. ఇప్పటికే దాదాపు 70శాతంకు పైగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పూర్తయ్యాయి. వచ్చే డిసెంబర్ నాటికి మిగతా పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకవచ్చేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది.

అండర్ డ్రైనేజీకి అడుగులు

వరంగల్ మహానగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. యూజీడీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఈనాటి కాదు. స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీ నుంచి 1994లో వరంగల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయినప్పటి నుంచి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. 1995, 2016లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థపై కార్పొరేషన్ అధికారుల బృందం సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినప్పటికీ పనుల ఊసే లేకుండా పోయింది. గత ఏడాది ఏప్రిల్ 24న మడికొండలో జనజాతర సభలో, మే 7వ తేదీన హనుమకొండ చౌరస్తాలో నిర్వహించిన ప్రచారసభలో ఇచ్చిన హామీ మేరకు గత నవంబరు 18న రూ.4,170కోట్లు విడుదల చేస్తూ జీవో నెం.573 విడుదల చేశారు. ఈ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు భారీ వర్షాల వరద నీరు, నీటి సరఫరా వ్యవస్థ, నీటి వనరుల పునర్జీవం, జలాశయాల నిర్వహణ ప్రణాళిక, బ్లూ- గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపకల్పన, పవర్, టెలికాం, కేబుల్, ఇంటర్నెట్ తదితర సేవలు అందించేలా డిజైన్ చేశారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో 30ఏళ్ల నగరవాసుల కల కూడా నెరవేరపోతుందనే ఆనందం వ్యక్తం అవుతోంది.

మద్యం మత్తులో ట్రాఫిక్ సీఐపై దాడి

- పట్టుబడ్డ వాహనాన్ని స్వాధీనం చేస్తుండగా పిడిగుద్దులు
- అడ్డుకున్న గన్‌మెన్, సిబ్బంది.. పీఎస్‌కు తరలింపు..
- సీఐ సీతారెడ్డి ఫిర్యాదుతో నిందితుడిపై కేసు, రిమాండ్

వరంగల్ క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో మద్యం తాగినట్లు తేలగా, వాహనాన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులపై ఓ మందుబాబు తిరగబడ్డాడు. సర్దిచెప్పబోతుండగా హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డిని దూషిస్తూ కాలర్ పట్టుకొని దాడి చేశాడు. దీంతో అక్కడున్న పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి కేయూ ఎస్సై బొజ్జ రవీందర్ కథనం ప్రకారం..

కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలివేల్పుల క్రాస్‌లో ఈ నెల 3న ఆదివారం రోజు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. మడికొండకు చెందిన తౌటిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తన స్నేహితుడితో కలిసి కారులో వస్తుండగా తనిఖీల్లో భాగంగా పోలీసులు వాహనం ఆపారు. డ్రైవింగ్ సీటులో ఉన్న రాజశేఖర్‌రెడ్డికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష నిర్వహించగా మద్యం తాగినట్లుగా వెల్లడైంది. దీంతో కారును పోలీసులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించగా కారును అప్పగించేందుకు ససేమిరా అనడంతో వాహనదారుడికి, ట్రాఫిక్ పోలీసులకు మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో వాహనదారుడు సీఐ చొక్కా పట్టుకొని కిందపడేసి చొక్కా చింపి దాడి చేశాడు. అడ్డుకోబోయిన గన్‌మెన్, సిబ్బందిపై దాడికి దిగాడు. అప్రమత్తమైన పోలీసులు.. వెంటనే వాహనదారుడిని బంధించి కేయూ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొని వచ్చారు. అక్కడ కూడా అదే తీరుగా ప్రవర్తించాడు. తాను అమెరికా నుంచి వచ్చానని, నానా దుర్భాషలాడుతూ కేయూ పోలీసులపై చిందులు వేశాడు. కాగా, సీఐ సీతారెడ్డి ఫిర్యాదు మేరకు నిందితుడు రాజశేఖర్ రెడ్డిపై బీఎన్ఎస్ చట్టం ప్రకారం 292, 1115 (2), 121 (1), 132 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు హుజురాబాద్ జైలుకు తరలించామని ఎస్సై రవీందర్ తెలిపారు.

గుండెపై అవగాహన కార్యక్రమం

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్ రోడ్డులోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల (బాలికలు- 1)లో మంగళవారం గుండెపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎండబ్ల్యూవో గౌస్ హైదర్ ఆధ్వర్యంలో ప్రముఖ కార్డియాలజిస్టు శ్రీనివాస్ విద్యార్థులకు గుండె పనితీరుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గుండెపోటు లక్షణాలు, గుండెపోటు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీపీఆర్ ప్రదర్శన గురించి వివరించారు. అలాగే నిత్యం నడక ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో మైనారిటీ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ నీరజ, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్డియాలజిస్టు శ్రీనివాస్



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వందశాతం కాన్పులు జరగాలి

మడికొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వంద శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు జరుగాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. కాజీపేట మండలం కడిపికొండలోని పీహెచ్‌సీని మంగళవారం ఆయన సందర్శించి తనిఖీచేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. ప్రతీ మంగళ, శనివారాల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది సబితారాణి, శ్రీవాణి పాల్గొన్నారు.

'చేయూత' పెన్షన్ పంపిణీపై అవగాహన

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నూతనంగా ప్రవేశపెట్టిన చేయూత (ఆసరా) పెన్షన్ పంపిణీపై అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నేషన్ యాప్ వినియోగం, పెన్షన్‌ల పంపిణీ విధానం, నిబంధనలు, నిర్వహణపై సదస్సులో చర్చించారు. ఈ సదస్సులో సెర్ప్(హైదరాబాద్) డైరెక్టర్ గోపాల్‌రావు, డీఆర్‌డీవో మేన శ్రీను, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రవిందర్, మండల అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు, పోస్టల్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంరక్షణలో 'సఖీ' పాత్ర కీలకం

హసన్‌పర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న మహిళల సంరక్షణలో సఖీ సెంటర్ పాత్ర కీలకమని యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాంభార్గవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని యూపీహెచ్‌సీ ఆవరణలో సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి ఆధ్వర్యంలో సఖీ సెంటర్ ముఖ్య ఉద్దేశ్యాలు, మహిళలకు అందిస్తున్న సేవల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంభార్గవ్ ముఖ్య అతిథిగా హాజరై సఖీ సెంటర్ అందిస్తున్న సేవల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఆపదలో ఉన్న మహిళలు సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్న మహిళల సంరక్షణలో ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్ 181, చైల్డ్ లైన్ నెంబర్ 1098కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం లభిస్తుందన్నారు. అంతేకాకుండా 0870-2452112, 7382983088 నెంబర్లకు కాల్ చేయడం ద్వారా బాధిత మహిళలకు సహాయం అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సఖీ సెంటర్ కేస్ వర్కర్ భారతి, ఆసుపత్రి సిబ్బంది మానస, సాయి, మెరినా, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పింగిళి కళాశాలలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు

వడ్డెపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఉచిత మెగా హెల్త్ క్యాంపును కళాశాల హెల్త్ క్లబ్, ఫిజికల్ ఎడ్యుకేషన్, వడ్డెపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించారు. హెల్త్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ సుభాషిణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి జ్యోతి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాలిక ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థినులకు రక్త పరీక్షలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్‌తో పాటు వైద్య సిబ్బంది కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూకే సాధ్యం

మడికొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూకే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం కాజీపేట మండల శాఖ సమావేశం మడికొండలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించారు.ఈ సందర్భంగా సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా నాయకులు దేవిరెడ్డి మాలకొండరెడ్డి, సంధ్యారాణి, భానుప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

హసన్‌పర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాబోయే స్థానిక ఎన్నికల ప్రత్యేక ప్రచారంలో భాగంగా మంగళవారం అనంతసాగర్, మడిపల్లి, జయగిరి గ్రామాలలో ఎంపీటీసీ స్థానాల గెలుపు కోసం ఎన్నికల ప్రత్యేక ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కరపత్రాలు స్టిక్కర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్లు దాసరి రాజు, తాళ్ళ శ్యాం, మండల ప్రధాన కార్యదర్శి శంకర్, ఎర్రగోళ్ళ రాజు, ముద్రవేణి రాజుయాదవ్, సురేష్‌యాదవ్, రాజేశ్వర్‌రావు, మధుసూదన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలి మోటార్లు.. గాలి ముచ్చట్లు...

- ఇదే సీఎం రేవంత్‌రెడ్డి పాలన
- 'కాళేశ్వరం'పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- మాజీ మంత్రి దయాకర్‌రావు

జనగామ రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి పాలన గాలి మోటార్లు ఎక్కి, గాలి ముచ్చట్లు చెప్పడానికే సరిపోతున్నదని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి దయాకర్ రావు ఎద్దేవా చేశారు. హైదరాబాద్ బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయం నుంచి మాజీ మంత్రి హరీశ్ రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజెంటేషన్‌ను నిర్వహించగా జనగామ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో దయాకర్‌రావు, స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి మాట్లాడారు.

సోషల్ మీడియా వేదిక ద్వారా అబద్ధపు మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్, పాలనను పక్కకు పెట్టి రాజకీయ కక్ష సాధింపులే లక్ష్యంగా నడుస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో గోదావరి నదిపై అడ్డగోలుగా ప్రాజెక్టులు నిర్మించి తెలంగాణకు నీళ్ల రాని పరిస్థితిల్లో కేసీఆర్ ముందు చూపుతో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మిస్తే తెలంగాణ సస్యశ్యామలంగా మారిందన్నారు. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారాలు చేస్తే తెలంగాణ ప్రజలు ఊరుకోరన్నారు. పోలవరం ప్రాజెక్ట్ మూడు సార్లు కూలితే ఒక్కసారి కూడా ఎన్‌డీఎస్‌ఏ రిపోర్ట్ లేదని కాళేశ్వరంలో ఒక్క మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగితే రిపేర్ చేసే వెసులుబాటు ఉన్నా, ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాద్ధాంతం చేస్తుందని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డి పాలన టీవీ సీరియల్‌లా నడుస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొన్నటి వరకు ఫార్ములా ఈ- కారు కేసు, నిన్నటి వరకు ఫోన్ ట్యాపింగ్, నేడు కాళేశ్వరం ప్రజెక్ట్ మీద పడ్డారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పన్నుతున్న కుట్రలు, వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తాళ్ల సురేశ్ రెడ్డి, సిద్ధిలింగం, జమున, పెద్ది రాజిరెడ్డి, ఇర్రి రమణారెడ్డి, గాంధీ నాయక్, ఉడుగుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే భవన నిర్మాణ అనుమతులు

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- నగరంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో నిర్మించే భవనాలు, ఇళ్లు ప్రభుత్వ మార్గ నిర్దేశాలు పాటిస్తేనే అనుమతులు ఇస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం వరంగల్ నగరంలోని కాకతీయ కాలనీ ఫేజ్-2, కాశిబుగ్గ, డాక్టర్స్ కాలనీలలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. భవన నిర్మాణ అనుమతులుకు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి అధికారులతో కొలిపించి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిబంధనలు అతిక్రమించి భవన నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, ఏసీపీ రజిత, టీపీవో ఇర్షాద్ పాషా, ఇన్‌చార్జి ఈఈ సంతోష్‌బాబు, డీఈ సతీష్ పాల్గొన్నారు.



భవన నిర్మాణ అనుమతులు పరిశీలిస్తున్న కమిషన్

చెత్త తరలింపు వాహనాల సమాచారం అందించాలి

వరంగల్ నగరంలో చెత్త తరలింపు వాహనాల పూర్తి సమాచారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్(ఐసీసీసీ)కి అందించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పనిచేసే సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. శానిటేషన్‌కు సంబంధించిన వాహనాలైన స్వచ్ఛఆటోలు, ట్రాక్టర్లు, జేసీబీలు, టిప్పర్లు ఐసీసీసీకి అనుసంధానం చేయాలన్నారు. తద్వారా వాహనాలు పని చేస్తున్నాయా? ఎక్కువ వరకు వచ్చాయి? అనేది వెంటనే తెలుసుకోవచ్చని అన్నారు. సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు కేటాయించిన వాహనాలకు ప్రత్యేక గుర్తింపు నెంబర్ కేటాయించామని, లింక్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రత్యేక యాప్ ద్వారా వాహనాలను మానిటరింగ్ చేయాలన్నారు. డీసెంట్రలైజ్డ్ ట్రాన్స్‌ఫర్ కేంద్రాలను విలీన గ్రామాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బంది 24/7 డ్యూటీలలో ఉండాలని సూచించారు. అదనంగా ఉన్న జవాన్‌లను టీములుగా ఏర్పాటుచేసి ప్లాస్టిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కేటాయించాలని సీఎంఎచ్‌వోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఐటీ మేనేజర్ రమేష్‌తో పాటు ఐసీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పైడిపెల్లిలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలన

గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పైడిపెల్లిలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూమ్ గదులను వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అక్కడ పనులు చేపడుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి అక్కడి ఎలక్ట్రికల్ పనులను పర్యవేక్షించారు. అక్కడ నిర్మిస్తున్న రోడ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట ఇన్‌చార్జి ఈఈ సంతోష్‌బాబుతో పాటు డీఈలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



తహసీల్దారు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

హసన్‌పర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను కాపాడడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి అన్నారు. మంగళవారం సీపీఐ నాయకులు స్థానిక తహసీల్దారు చల్ల ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా సమితి సభ్యులు అలువాల రాజు మాట్లాడుతూ.. భీమారం రెవెన్యూ శివారు సర్వే నెం.70లో గల ప్రభుత్వ భూమిని రక్షించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ భూమిని ఆక్రమణదారులు కబ్జా చేసి ప్రహరీ నిర్మించారని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ ముందుకు రావాలి

కేయూ క్యాంపస్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు అందరూ ముందుకు రావాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. మంగళవారం కేయూలో అవెన్యూ ప్లాంటేషన్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త నిర్వహణలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఆడిటోరియంలో ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, జీవవైవిధ్యం మొక్కల రక్షణపై ఆధారపడుతుందని చెప్పారు. మొక్కలు భావితరాలకు అవసరమన్నారు. విద్యార్థులు, సిబ్బంది, వలంటీర్లు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. పొగడ, అల్లనేరేడు, చింత, టెర్మినేలియా జాతులకు చెందిన సుమారు 350 మొక్కలను చెప్పారు. మనమహోత్సవాన్ని వర్సిటీ క్యాంపస్‌లో మరిన్ని రోజుల పాటు కొనసాగిస్తామని వెల్లడించారు. కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, పీవోలు వెంకటేశ్, కుమారస్వామి, రాధిక, సుజాత, సౌజన్య, శైలజ, రత్నమాల, ప్రవీణ్‌కుమార్, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ బి.రమ, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ బి.సుకుమారి, డాక్టర్ కరుకాల అనితారెడ్డిలు పాల్గొని ఉత్సాహంగా మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో అవెన్యూ ప్లాంటేషన్ ఇన్‌చార్జి పి.వెంకటయ్య, డాక్టర్ పోడేటి శ్రీనివాస్, ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, ప్రొఫెసర్ వై.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తదితరులు

రామదాసు కీర్తనల ఆంగ్లానువాద పుస్తకం ఆవిష్కరణ

హనుమకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ గోపాల్‌పూర్‌లోని సరస్వతీనగర్‌కు చెందిన కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు మాడభూషి రాజగోపాలచారి రచించిన రామదాసు కీర్తనల ఆంగ్లానువాద పుస్తకావిష్కరణ సోమవారం శ్రీభద్రాచలం దేవస్థానంలో జరిగింది. షోయర్ యువర్ మెర్సీ ఓ శ్రీరామ అనే ఈ ఆంగ్లానువాద పుస్తకాన్ని ఆలయ ఈవో రమాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆచార్య రాజగోపాలాచార్య ఎంతో శ్రమతీసుకొని రామదాసు 77 కీర్తనలను ఆంగ్లంలోకి అత్యంత అద్భుతంగా అనువాదం చేయడం ఎంతో అభినందనీయం అన్నారు. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన రామదాసు కీర్తనలు ఇక విశ్వవ్యాప్తం అవుతాయన్నారు. ఆచార్య రాజగోపాలాచారి మాట్లాడుతూ.. రామదాసు రచించిన కీర్తనలు ఆంగ్లానువాదం చేసే భాగ్యం కలగడం తనపూర్వజన్మ సుకృతం అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మాలతీ, వేదపండితులు అంతర్వేది క్రిష్ణమాచార్యులు, శ్రీకాంత రాఘవన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆచార్య రాజగోపాలచార్యను ఈవో శాలువతో ఘనంగా సత్కరించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు.



రామదాసు కీర్తనల ఆంగ్లానువాద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

హనుమకొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో ఎదిగే వారు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం హనుమకొండ న్యూ బస్టాండ్ సమీపంలోని లక్ష్మిపురంలో మేరా యువ భారత్ సమావేశం హాల్‌లో నెహ్రూ యువ కేంద్రం వరంగల్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై యువతకు ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్ హాజరై వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. స్వయం ఉపాధితో ఎదగాలనే వారు భవిష్యతులో వ్యాపారం చేయాలనుకే వారు ఆయా రంగాలకు సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. పీఎం సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, స్టార్ట్ అఫ్ ఇండియా, 18 రకాల వృత్తుల వారికి పీఎం విశ్వకర్మ పథకాల ద్వారా ఉపాధి పొందాలని పిలుపునిచ్చారు. లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ జన్ను మహేందర్ మాట్లాడుతూ.. కేవలం ప్రభుత్వ ఉద్యోగాల వైపే చూడకుండా, ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి తెలుసుకొని ఆసక్తి ఉన్న రంగంలో పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి యువత తయారు కావాలని తెలిపారు. బ్యాంకింగ్ ద్వారా అందిస్తున్న సుకన్య సమృద్ధి యోజన, పీఎం జీవన జ్యోతి యోజన, పీఎం సురక్ష బీమా యోజన, ముద్ర లోన్స్, పీఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనశిక్షణ సంస్థాన్ జిల్లా డైరెక్టర్ ఖాజా మొసియొద్దీన్ మాట్లాడుతూ.. టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్రాబ్రిక్ పెయింటింగ్, కంప్యూటర్ కోర్సులలో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించుటకు దోహదం చేస్తున్నాయని అన్నారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కె. అనితారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అవకాశాలు ఉన్నా అవగాహన లేక వెనుకబడి పోతున్నారని, స్వయం ఉపాధి పథకాల గురించి తెలుసుకొని జీవితంలో ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సయ్యద్, ఇక్బా తాబర్, రథం ఫౌండేషన్ ప్రతినిధి సంతోష్ కుమార్, మేరా యువ భారత్ సూపరింటెండెంట్ బానోతు దేవీలాల్, డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్ షాపునకు హాజరైన నిరుద్యోగులు, విద్యార్థినులు

బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ అమలు చేయాలి

లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య

హనుమకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో రైతుల భూ రికార్డులను డిజిటలైజేషన్ చేసి బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ అధారంగా రూపొందించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీని వల్ల రైతులు మోసపోకుండా, సబ్సిడీలు నేరుగా అర్హులైన వారికి అందుతాయని అన్నారు. లోక్‌సభలో డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. తెలంగాణ ఏవైనా పైలెట్ ప్రాజెక్టులు ఉన్నాయా? బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని ఎప్పుడు అమలు చేస్తారు? అన్ని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇస్తూ.. దేశవ్యాప్తంగా డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ నవీనకరణ కార్యక్రమం (డీఐఎల్‌ఆర్‌ఎంపీ) ప్రస్తుతం అమలులో ఉందని తెలిపారు. అయితే బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఈ కార్యక్రమంలో భాగంగా లేదని, కనుక దానిని ఎప్పుడు అమలు చేస్తారో ప్రస్తుతం చెప్పలేమన్నారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ... బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ అమలుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ విధానంతో భూ రికార్డులను ఎవరూ నకిలీ చేయలేరని, ఎటువంటి మోసాలు లేకుండా రైతులకు సబ్సిడీలు నేరుగా అందుతాయని, రైతులకు అందించే ప్రభుత్వ పథకాలు సజావుగా అమలవుతాయని స్పష్టం చేశారు. రైతులకు ఉపయోగపడే ఈ ఆధునిక టెక్నాలజీ అమలుపై కేంద్ర మంత్రి మరింత దృష్టి పెట్టాలని ఎంపీ కావ్య కోరారు.

పర్యావరణంపై అవగాహన కార్యక్రమం

హనుమకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండలం భీమారం ప్రభుత్వం పాఠశాలలో మండల విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ సుస్థిరతపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లకు ప్రత్యామ్నాయంగా కాటన్ సంచులను ప్రదర్శించారు. పండ్లు, కూరగాయలు, ఇతర రోజువారి సామగ్రికి కాటన్ సంచులనే వాడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉపేందర్ రెడ్డి, ఆశోక్ కుమార్, మునిగాల పద్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఉచితంగా బట్ట సంచులను పంపిణీ చేశారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సత్వరమే పూర్తి చేయాలి

పెంబర్తిలో లబ్ధిదారుల ఇళ్ల పరిశీలనలో కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలని, లేకుంటే ప్రొసీడింగ్ కాపీలను రద్దు చేస్తామని కలెక్టర్ స్నేహ శబరీష్ హెచ్చరించారు. మండలంలోని పెంబర్తిలో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో మాట్లాడారు. నిర్మాణ పనుల పురోగతి గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఇళ్లు మొదలు పెట్టని, పునాది వరకు వచ్చి ఆగిన ఇళ్ల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పైలట్ గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టి ఆరునెలలు అవుతోందన్నారు. ఇంకా ఇండ్ల నిర్మాణ పనులు నెమ్మదిగా సాగడం సరైంది కాదన్నారు. నిర్మాణ పనులు వేగంగా సాగాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు నిలిపేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పనులు ముందుకు సాగకపోతే వాటిని రద్దుచేసి తదుపరి జాబితాలోని అర్హులకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామన్నారు. త్వరగా పూర్తి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ భూక్యా సిద్ధార్థ నాయక్, తహసీల్దార్ చల్ల ప్రసాద్, ఎంపీడీవో చంద్రగిరి రవి, ఎంపీవో కట్ట కర్నాకర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ సరిత, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ చైర్మన్ నాగవల్లి శ్రీనివాస్, ఎస్సై దేవేందర్, కమిటీ సభ్యులు జోరుక పూల, రమాదేవిరమేష్, గోపాల్, సునిల్, సుధాకర్, పంచాయతీ కార్యదర్శి హేమలత, కారోబార్ చాతల్ల సదానందం, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పెంబర్తిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యారంగం ప్రభుత్వ ఆధీనంలో కొనసాగాలి

వడ్డెపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగం ప్రభుత్వ ఆధీనంలో కొనసాగించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు కార్పొరేట్ విద్యా, వైద్య రంగాన్ని ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. విద్య, వైద్యాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్‌చేస్తూ ఈ నెల 12న హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, హనుమకొండ జిల్లా కార్యదర్శి నీల రవీందర్, జిల్లా నాయకులు పరిమల గోవర్ధన్, నగేష్, పోలబోయిన రాజు, గాదె ప్రణయ్, రాజేందర్,సీతారాంరెడ్డి, చీపురు ఓదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
బుధవారం
6 ఆగస్టు 2025
నవ్య
కుటుంబ కదంబం



వన్ పీస్ డ్రెస్‌లతో వయ్యారంగా..!

ఫ్యాషన్

మారుతున్న పోకడలకు అనుగుణంగా సరికొత్త హంగులద్దుకుని 'వన్ పీస్ డ్రెస్‌లు' ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. ఒకవైపు సంప్రదాయం, మరోవైపు ఆధునికత కలగలసినట్లు ఉండడంతో... యువతులు, ఉద్యోగినులు ఈ డ్రెస్‌లను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఆకర్షణీయమైన రంగుల్లో వివిధ డిజైన్లలో ఇవి లభ్యమవుతున్నాయి. రోజువారీ ధరించడానికి సాధారణ డిజైన్లను ఫంక్షన్లు, పార్టీల కోసం గ్రాండ్‌గా కనిపించేవాటిని ఎంపిక చేసుకుంటున్నారు మహిళలు.

ఈ డ్రెస్ మొత్తాన్ని ఒకే ఫ్యాబ్రిక్‌తో రూపొందిస్తారు. ఇది చూడడానికి ఫ్రాక్ మాదిరి కనిపిస్తుంది. పై భాగం అంటే టాప్ సన్నగా, కింది భాగం అంటే స్కర్ట్ వెడల్పుగా ఉంటుంది. టాప్ భాగానికి పొట్టి లేదా పొడవు చేతులు పెడుతుంటారు. దీనికి అందమైన నెక్ డిజైన్లు జోడిస్తారు. స్కర్ట్ భాగం.. మోకాళ్ల లేదా పాదాల వరకు పొడవుండే డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. అంబరిల్లా కట్, ఫ్రిల్స్ టైప్, మ్యాక్సీ, ఫ్లేర్డ్ మోడల్ డ్రెస్‌లను యువతులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఇవి ధరించడానికి సౌకర్యవంతంగా ఉండడంతో పాటు శరీరాకృతికి తగ్గట్టు ఇమిడిపోతాయి.

ఎలాంటి ఫ్యాబ్రిక్‌తోనైనా ఈ 'వన్ పీస్ డ్రెస్'లను చక్కగా డిజైన్ చేయవచ్చు. ఫ్లోరల్ ప్రింట్లు, చెక్స్ ఉన్న కాటన్, లినెన్ డ్రెస్‌లు.. కార్యాలయాలు, కాలేజీలకు వెళ్లేటప్పుడు ధరించడానికి అనువుగా ఉంటాయి. వీటిని ప్రయాణాలప్పుడు వేసుకున్నా హాయిగా అనిపిస్తుంది. జార్జెట్, షిఫాన్, సిల్క్, నెట్టెడ్ ఫ్యాబ్రిక్‌లతో రూపొందించిన డ్రెస్‌లు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటికి కుందన్, జర్దోసి, ఎంబ్రాయిడరీ వర్క్‌లను జోడించి మరింత ప్రత్యేకంగా అందుబాటులోకి తెస్తున్నారు. ఇవి పుట్టిన రోజు, పెళ్లిరోజు లాంటి సందర్భాల్లో; ఫంక్షన్లలో వేసుకోవడానికి బాగుంటాయి. ఇలా వన్ పీస్ డ్రెస్ ధరించినప్పుడు లైట్ మేకప్, సింపుల్ హెయిర్ స్టయిల్, మెడలో డాలర్ చెయిన్, చెవులకు పెద్ద జుంకాలు లేదా చాంద్‌బాలీలు, చేతికి వాచ్ లేదా బ్రాస్‌లెట్, మధ్య వేలికి పెద్ద రింగ్, పాదాలకు అందమైన శాండల్స్ వేసుకుంటే చాలు.. ఆకర్షణీయంగా కనిపిస్తారు.



ఒంటిచేత్తో పతకాలు పట్టేస్తోంది!



ఆమెది సాధారణ వ్యవసాయ కుటుంబం... పుట్టుకతోనే వైకల్యం... ఒకవైపు సమాజం చిన్న చూపు... మరోవైపు లోకుల సానుభూతి... మానసిక స్థైర్యంతో వీటన్నిటినీ అధిగమించి... పారా క్రీడల్లో రాణిస్తోంది హెచ్.శివాని. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏడు స్వర్ణ పతకాలు సాధించి, ఎందరికో ప్రేరణగా నిలుస్తున్న శివాని కథ ఆమె మాటల్లోనే...

"మాది కర్నూలు జిల్లా మద్దికెర. ఈరన్న, లలిత నా తల్లిదండ్రులు. మాది వ్యవసాయ కుటుంబం. నాన్న రోజూ గుంతకల్లుకు వెళ్లి... ఆకుకూరలు అమ్మేవారు. పుట్టుకతోనే నా కుడి చెయ్యి మోచేతి వరకూ మాత్రమే ఉంది. అది చూసిన కొందరు బంధువులు, ఇరుగు పొరుగువారు "ఈ అమ్మాయి మీకెందుకు? ఎక్కడైనా బయట పడేయండి. ఇంట్లోకి తెచ్చుకోవద్దు" అని గట్టిగా చెప్పారట. కానీ మా అమ్మ, నాన్న ఆ మాటలేవీ పట్టించుకోలేదు. నా తరువాత పుట్టిన ఇద్దరు తమ్ముళ్లతోపాటు నన్ను ఎంతో ప్రేమగా చూసుకున్నారు. అయితే ఇంటి బయట పరిస్థితి వేరేగా ఉండేది. సగమే ఉన్న నా చెయ్యిని చూసి చాలామంది ఏమైందని అడిగేవాళ్లు. సానుభూతి చూపించేవాళ్లు. అటువంటప్పుడు 'నేను ఏమీ చేయలేనా? ఏమీ సాధించలేనా?' అని ఎంతో బాధ కలిగేది. ఒకప్పుడు నన్ను ఎక్కడైనా పడేయమని చెప్పినవాళ్లు ఆశ్చర్యపడేలా ఏదైనా సాధించాలని అనుకునేదాన్ని. నేను ఐదవ తరగతిలో కొడుమూరులో మా మేనత్త ఇంట్లో ఉండేదాన్ని అక్కడే నవోదయ పరీక్షలకు కోచింగ్ తీసుకున్నాను. కర్నూలు నవోదయ స్కూల్‌లో సీటు వచ్చింది. అక్కడ స్నేహితులు నన్ను చాలా బాగా చూసుకునేవాళ్లు. .

అలా అన్నవారే మెచ్చుకున్నారు...

మా స్కూల్ ప్రిన్సిపాల్ (ప్రస్తుతం నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్) సాగరిక మేడమ్ చొరవతో నా జీవితం కొత్త మలుపు తిరిగింది. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు.. తెలంగాణలోని రంగారెడ్డి నవోదయ స్కూల్‌లో జరుగుతున్న పారా స్పోర్ట్స్‌కు పంపించారు. అక్కడ షాట్‌పుట్, జావెలిన్ త్రోలో నా టాలెంట్‌ను గుర్తించి నన్ను ఎంపిక చేశారు. నాకు చదువుతో పాటు క్రీడల్లో కూడా రోజూ శిక్షణ ఇచ్చారు. శిక్షణకు రోజూ మధ్యాహ్నం వెళ్లి, రాత్రికి వచ్చేవాళ్లం. ఒక వైపు శిక్షణ తీసుకుంటూనే... జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొన్నా. మొదట గుజరాత్‌లో జరిగిన ఈవెంట్లలో షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్, జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్ వచ్చింది. దాంతో ఒకప్పుడు మా కుటుంబాన్ని పట్టించుకోనివారు కూడా.. మా ఇంటికి వచ్చి, మా అమ్మానాన్నలతో. నా గురించి గొప్పగా మాట్లాడారు. "ఈ అమ్మాయి ఏమీ చేయలేదని అనుకున్నాం.. అయితే చాలా గొప్పగా సాధించింది" అని అభినందించారు.

చాలా గర్వంగా అనిపించింది



2023లో థాయ్‌లాండ్‌లో జరిగిన ఈవెంట్లలో రెండు బంగారు పతకాలు సాధించాను. అక్కడ మన జాతీయ గీతం ఆలపించడం, నా శరీరంపై మన త్రివర్ణ పతాకాన్ని కప్పుకోవడం మాటలకు అందని, ఎన్నటికీ మరచిపోలేని అనుభూతి. చాలా గర్వంగా అనిపించింది. 2024లో కూడా థాయ్‌లాండ్‌లో పతకాలు గెలిచాను. ఇప్పటికి నేను ఏడు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సాధించాను. దీనికి మా కోచ్ వేణు వినకోటి సహకారం ఎంతో ఉంది. భవిష్యత్తులో దేశం కోసం మరిన్ని పతకాలు గెలవాలన్నదే నా లక్ష్యం.

అందరిలోనూ నైపుణ్యం ఉంటుంది...

తమకు వైకల్యం ఉందనీ.. జీవితంలో ఏదీ సాధించలేమని కొందరు నిరుత్సాహపడుతూ ఉంటారు. ఇది సరైన ఆలోచన కాదు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. నేను క్రీడల్లో పాల్గొనడానికి బయట రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ఎంతోమందిని చూశాను. నాకు చెయ్యి మాత్రమే లేదు. వాళ్లకు ఇంకా చాలా అవయవాలు లేవు. 'వాళ్లకన్నా నేనే అదృష్టవంతురాలిని కదా' అనుకున్నాను. ఇప్పుడు నాకు చెయ్యి లేదన్న విషయమే గుర్తుకు రాదు. భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం చేయాలనేది నా లక్ష్యం. అందుకే మదనపల్లె నవోదయ స్కూల్‌లో ఇంటర్‌లో చేరాను. మా ప్రిన్సిపాల్ గీత మేడమ్ నా సమస్యను కలెక్టర్ శ్రీధర్ చామకూరి గారి దృష్టికి తీసురువెళ్లారు. ఆయన సాయంతో నాకు కృత్రిమమైన కుడి చేతిని అమర్చారు. ఆ చేతికి ఇంకా అలవాటు పడాల్సి ఉంది. మా స్కూల్‌లో నా పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.. నా డైట్, ప్రాక్టీస్ విషయంలో చాలా జాగ్రత్తగా చూసుకుంటున్నారు. కోచ్ సహకారంతో రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాను."

● గౌనిపల్లె శ్రీనివాసులు

అందంగా ఇస్తినమ్మ వాయినం...

వరలక్ష్మీ వ్రతం చేసుకున్న తరవాత బంధుమిత్రులను, ఇరుగు-పొరుగు మహిళలను పిలిచి వాయినాలు ఇస్తూ ఉంటాం. తాంబూలం లేదా పసుపు-బొట్టు అని పిలిచే ఈ వాయినంలో పసుపు కొమ్ములు, కుంకుమ, తమలపాకులు, వక్కలు, పూలు, పండ్లు, గాజులు, చీర లేదా రవికెల గుడ్డ, నానబెట్టిన శనగలు, జాజికాయ, రూపాయి బిళ్ల, చెక్క, దువ్వెన, చిన్న అద్దం, కాటుక భరిణె, గోరింటాకు, కొబ్బరికాయ, పసుపు తాడు తదితరాలు ఉంటాయి. ఇలా వాయినంతోపాటు చిన్న బహుమతిని కూడా ఇస్తూ మురిసిపోతుంటారు మహిళలు. అలా ఇవ్వదగ్గ బహుమతుల గురించి తెలుసుకుందాం...



- ప్రస్తుతం రకరకాల పోట్లీ బ్యాగ్‌లు లభ్యమవుతున్నాయి. ఇవి చూడడానికి అందంగా ఆకర్షణీయంగా ఉంటున్నాయి కూడా. వీటి ధర అంత ఎక్కువగా ఉండదు. ఈ పోట్లీ బ్యాగ్‌లను తీసుకువచ్చి వాటిలో వాయినాన్ని అందంగా సర్ది ఇవ్వవచ్చు. కాటన్ వస్త్రంతో తయారుచేసిన చిన్న చిన్న బ్యాగ్‌లు, పర్సులు కూడా విరివిగానే దొరుకుతున్నాయి. వీటిమీద చక్కని పెయింటింగ్, ఎంబ్రాయిడరీ, అద్దాలు లేదా పూసల వర్క్‌లు చేసి ఉంటున్నాయి. వీటిని కూడా గిఫ్ట్ కింద ఇవ్వవచ్చు. ఇవి మహిళలకు పలువిధాలుగా ఉపయోగపడతాయి.
- మట్టి, ఇత్తడి, పంచలోహాలతో రూపొందించిన చిన్న లక్ష్మీదేవి బొమ్మను ఇవ్వవచ్చు. అలాగే దీపం కుందులు, పసుపు-కుంకుమ గిన్నెల స్టాండ్, అగరుబత్తులు గుచ్చే స్టాండ్, కర్పూరం వెలిగించే పళ్లెం, రాగి చెంబు ఇచ్చినా ఉపయోగకరంగానే ఉంటాయి. పూలు, లతలు, నెమళ్లతో తెల్లగా మెరిసే హారతి పళ్లెం, సింహాసనం, పూల సజ్జ లాంటి వాటిని కూడా మహిళలు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. వీటిని వైట్ మెటల్‌తో తయారు చేస్తారు కాబట్టి ఆకర్షణీయంగా కనిపిస్తుంటాయి.
- చక్కని జరీ బోర్డర్ ఉన్న జాకెట్ గుడ్డను బ్యాగ్‌లా మడత పెట్టి అందులో వాయినాన్ని సర్ది ఇవ్వడం నేటి ట్రెండ్.
- చెక్క, ఇత్తడి లేదా వైట్ మెటల్‌తో రూపొందించిన ట్రే లేదా తాంబాళంలో వాయినాన్ని సర్ది ఇవ్వవచ్చు. తామర పువ్వు ఆకారంలో ఉండే వెడల్పాటి గిన్నెను ఇచ్చినా బాగుంటుంది.
- వరలక్ష్మి వ్రత కథలు, మణిద్వీప వర్ణన, లలిత సహస్రనామాలు, లక్ష్మీదేవి స్తోత్రాలు లాంటి వాటిని పెద్ద అక్షరాలతో ప్రింట్ చేసిన పుస్తకాలు ఇస్తే పెద్దవారికి ఉపయోగకరంగా ఉంటుంది.



ఒంటరితనం వేధిస్తోందా?

ఒక్కోసారి అనుకోని కారణాల వల్ల ఒంటరిగా ఉండాల్సి వస్తుంది. ఆ సమయంలో అనవసరమైన ఆలోచనలు వేధిస్తూ ఉంటాయి. అలాంటి సందర్భాల్లో కుంగిపోకుండా ఆనందంగా ఎలా గడపాలో తెలుసుకుందాం...



- రోజూ కొద్దిసేపు ఇంటి పరిసరాల్లో వాకింగ్ చేయడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల కొత్త స్నేహాలు ఏర్పడవచ్చు. మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది. వ్యాయామం, ధ్యానం లాంటివి కూడా ఉపకరిస్తాయి.
- ఆత్మీయులకు ఫోన్ చేసి కొద్దిసేపు మాట్లాడడం వల్ల ఒంటరితనం అనే భావన కలుగదు. వీడియో కాల్ అయితే వెంటనే మనసు కుదుటపడుతుంది.
- ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండడం వల్ల ఒంటరిగా ఉన్నామనే ఆలోచన రాదు. ఇంటి పని, తోటపని లేదంటే ఆఫీసు పని ఇలా ఆసక్తి ఉన్నదానిమీద మనసు నిలిపితే ప్రయోజనకరంగా ఉంటుంది.
- వంట చేయడం, సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, కొత్త ప్రదేశాలను సందర్శించడం లాంటివి అలవాటు చేసుకుంటే ఒంటరితనం వేధించదు.
- ఒంటరితనాన్ని ఏకాంతంగా మార్చుకోవాలి. ఏకాంతంగా గడపడం వల్ల శక్తిని పుంజుకుని ఉత్సాహంగా ఉండగల్గుతారు.
- వీలైనప్పుడల్లా వృద్ధులకు, చిన్న పిల్లలకు అలాగే ఇతరులకు చేతనైన సహాయం చేస్తూ ఉంటే మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది.
- వ్యక్తిగత శ్రద్ధ, సమాజసేవ, ఇరుగు పొరుగు పిల్లలతో ఆడుకోవడం, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవడం, సమకాలిక పరిస్థితుల్లో వస్తున్న మార్పులు తెలుసుకోవడం లాంటివి చేస్తూ సమాజంతోపాటు నడుస్తూ ఉంటే ఒంటరితనమనే భావన మాయమవుతుంది.

విభిన్నం

కథలు చెప్పే కేక్‌లు

కళాదృష్టి ఉండాలే కానీ... ఇదిగో ఇలా... కేక్‌ను కూడా అద్భుత కళాఖండాలుగా మలచవచ్చు. ప్రాచీ దబాల్‌దేవ్... ఆమె చేతులో పడితే కేక్‌లు... చారిత్రక కట్టడాలుగా మారిపోతాయి. నిలువెత్తు ఆకృతిలో... రాజసం ఉట్టిపడుతూ... అబ్బురపరుస్తాయి. మన సంస్కృతిని గొప్పగా ఆవిష్కరిస్తాయి. అందుకే ప్రాచీకి కేక్ అంటే... కట్ చేసి నోట్లో వేసుకొని కరిగించేసే తీపి పదార్థమే కాదు... అలనాటి 'తీపి' గుర్తులు, సంప్రదాయ కళల సమ్మేళనం కూడా.



"బేకరీకి వెళ్లగానే ముందుగా నన్ను ఆకట్టుకొనేవి కేక్‌లు. అందుకు కారణం వాటిపై కనిపించే డెకరేషన్. చిన్నప్పటి నుంచీ నా దృష్టి దానిపైనే ఉండేది. ఆ ఆసక్తే ఇవాళ నన్ను కేక్ ఆర్టిస్ట్‌ను చేసింది. నేను పుట్టి పెరిగిందంతా మధ్యప్రదేశ్‌లోని రెవా జిల్లాలో. ప్రణవేశ్ దబాల్‌తో పెళ్లి తరువాత మా నివాసం ముంబయికి మారింది. ఇంట్లో ఖాళీ దొరికినప్పుడల్లా రకరకాల కేక్‌లు తయారుచేస్తుండేదాన్ని. ఫ్లేవర్స్ మాత్రమే కాకుండా... విభిన్న డిజైన్లు ప్రయత్నిస్తుండేదాన్ని. కొంతకాలానికి అనిపించింది... పూర్తి స్థాయిలో ఈ కళను నేర్చుకోవాలని. నా అదృష్టం ఏంటంటే... సుగర్ క్రాఫ్ట్‌లో పేరు పొందిన సర్ ఎడ్డీ స్పెన్స్ దగ్గర శిష్యరికం చేసే అవకాశం రావడం. బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో జరిగే శుభ కార్యాలకు ఆయన కేక్‌లు తయారుచేసేవారు. 2015లో యూకే వెళ్లి ఆయన వద్ద ఈ కళను అభ్యసించాను.

ప్రత్యేకత కోసం...

భారత్‌కు తిరిగి వచ్చాక నాదంటూ ప్రత్యేక శైలి ఉండేలా కేక్‌లు రూపొందించడంపై దృష్టి పెట్టాను. అందుకోసం ఎన్నో పరిశోధనలు, లెక్కలేనన్ని ప్రయోగాలు చేశాను. క్రమంగా వీగన్ కేక్‌లు మొదలుపెట్టాను. దాంతో ఆదరణ పెరిగింది. అంతేకాదు... కేక్ తయారీని సమకాలీన కథలు చెప్పే ఒక సాధనంగా మలిచాను. ఇదే నన్ను ప్రత్యేకంగా నిలిపింది. ఈ ఆలోచనా విధానమే నాకు పలు అవార్డులు, అభినందనలు తెచ్చి పెట్టింది. 2021లో 'స్వదేశ్ సమ్మాన్' పురస్కారం అందుకున్నాను. 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కింది. ఇంకా ఎన్నో ఉన్నాయి.



ఆ పాప కళ్లల్లో మెరుపులు...

ఒకసారి ఒక పదేళ్ల చిన్నారి తల్లితో కలిసి కేక్ డెలివరీ తీసుకువెళ్లడానికి వచ్చింది. కోట, దాని ముందు యువరాణి డిజైన్‌లో రూపొందించిన కేక్ అది. చూడగానే ఆ చిన్నారి కళ్లు మెరిసిపోయాయి. ఆ క్షణం నేను నా చిన్నప్పటి రోజులకు వెళ్లిపోయా. ఎడిన్ బ్లైటన్ కథలు చదువుతూ... మాయా ప్రపంచం గురించి కలలు కనేదాన్ని. ఆ పాపవల్ల ఆ పాత మధురాలు మళ్లీ కళ్ల ముందు కదలాడాయి. కాసేపు నన్ను నేను మరిచిపోయా. ఆ అనుభూతి ఎంతో అద్భుతంగా అనిపించింది. దాన్ని అందరికీ ఇవ్వాలని నిర్ణయించుకున్నా. అందుకే కోటలు, రాణులు, కళలు ఉట్టిపడేలా... అవి ఒక అందమైన కథ చెప్పేలా కేక్‌లు తయారు చేస్తున్నా.

భావం... భావోద్వేగం...

నా ప్రాజెక్ట్‌లు అన్నిటిలోకెల్లా మరిచిపోలేనిది, అత్యంత కష్టమైనది 'డ్యుమో డి మిలనో' ఇటాలియన్ కేథడ్రాల్ చర్చి రెప్లికా. 6.4 అడుగుల ఎత్తు, 4.6 అడుగుల వెడల్పుతో రూపొందించిన వంద కేజీల వీగన్ కేక్ అది. దీని తయారీకి వంద గంటలకు పైగా సమయం పట్టింది. అంతపెద్ద కేక్‌ను నిలబెట్టాలంటే.. చెదరని ఏకాగ్రత, అపారమైన ఓర్పు అవసరం. అన్నిటికీ మించి ఇలాంటి పురాతన, వారసత్వ కట్టడాల ప్రతిరూపాన్ని తయారు చేయాలంటే కళాత్మకత, వాస్తుశిల్ప శైలిని ఆకళింపు చేసుకొనే సామర్థ్యం కావాలి. ఈ ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందు నేను కట్టడం వాస్తుశిల్ప శైలి గురించి లోతుగా అధ్యయనం చేశాను. కనుకనే ఉన్నది ఉన్నట్టు కేక్‌పై చూపించగలిగాను. ఇది 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించింది. కేక్ అంటే నాకు చూడగానే ఆకర్షించి, నోట్లో వేసుకోగానే కరిగిపోయేలాంటి తీపి పదార్థం మాత్రమే కాదు... ఒక భావోద్వేగ బంధం. దాని తయారీ ఒక యజ్ఞం.

స్ఫూర్తి అవే...

నేను ఎంత పెద్ద కేక్‌లు చేసినా వాటిల్లో కోడిగుడ్డు వాడను. క్రీమ్ నుంచి కేక్ మిక్సింగ్ తయారీ వరకూ అన్నీ మొక్క ఆధారిత ఉత్పత్తులతో చేసిన పదార్థాలే ఉపయోగిస్తాను. కథక్ లాంటి సంప్రదాయ నాట్యం కావచ్చు... హస్తకళాకృతులు, చేనేతలు కావచ్చు... వారసత్వ కట్టడాలు కావచ్చు... మన చుట్టూ ఉండేవాటినే స్ఫూర్తిగా తీసుకొని కేక్‌లు రూపొందిస్తాను. ఇప్పటి వరకు ఇండియన్ ప్యాలెస్, పైథానీ చీర అంచు, బెంగాలీ పెళ్లికూతురు ధరించే సంప్రదాయ చీరలు, నగలు, మణిపురీ నాట్యం లాంటి నిలువెత్తు ప్రతిరూపాలు ఎన్నో నేను తయారు చేశాను. వాటిని చూసినప్పుడు నా మనసు పరవశిస్తుంది. ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తుంది. నేను కోరుకున్నది ఇలాంటి అనుభూతినే."

రంగు చుక్కల అర్థం?

బజారులో దొరికే ఆహారపు ఉత్పత్తుల ప్యాకెట్ల మీద రంగు రంగుల చుక్కలు ముద్రించి ఉండడం చూస్తూ ఉంటాం. ఒక్కో రంగు ఒక్కో అంశాన్ని తెలియజేస్తుంది. ఆ వివరాలు...

- ఆహార ప్యాకెట్లపై ఎరుపు రంగు చుక్క ఉంటే ఆ ఉత్పత్తుల్లో మాంసాహారాన్ని వినియోగించారని అర్థం. చికెన్, మటన్, చేప లాంటి మాంసాహారాలతో తయారు చేసినవిగా గుర్తించాలి.
- ఆహారపు ఉత్పత్తుల ప్యాకెట్ల మీద ఆకుపచ్చని చుక్క ఉంటే వాటిని శాఖాహారంతో తయారుచేశారని తెలుసుకోవాలి. వీటి తయారీలో గుడ్డు, మాంసం వినియోగించలేదని అర్థం.
- ప్యాకెట్లపై నీలి రంగు చుక్క ఉంటే అవి వైద్య పరమైన ఉత్పత్తులని అర్థం. నిర్దిష్టమైన వ్యాధి నివారణకు వైద్యుల సలహా మేరకు మాత్రమే వాటిని వినియోగించాలి.
- అదే పసుపు రంగు చుక్క ఉంటే ఆ ఉత్పత్తుల్లో గుడ్లు వాడారని తెలుసుకోవచ్చు.
- ప్యాకెట్ల మీద నలుపు రంగు చుక్క ఉంటే ఆ ఉత్పత్తులను రసాయనిక పదార్థాలతో ప్రాసెస్ చేసి ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా తయారుచేశారని అర్థం. వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యం ప్రభావితమవుతుందని తెలుసుకోవాలి.

ఆది నుంచీ అక్రమాల 'సృష్టి'

డాక్టర్ నమ్రత చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- సరగసీ పేరుతో ఆమె చేసిన మోసాలపై కీలక విషయాలు రాబట్టిన పోలీసులు
- ముగిసిన పోలీసు కస్టడీ.. తిరిగి జైలుకు..
- ఆధారాలు సేకరించి స్టేట్‌మెంట్ రికార్డు
- ఇతర రాష్ట్రాల్లోని శిశు విక్రయ ముఠాలతోనూ నమ్రతకు సంబంధాలు ఉన్నట్లు గుర్తింపు!



కస్టడీ ముగియడంతో డాక్టర్ నమ్రతను జైలుకు తరలిస్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సృష్టి ఫర్టిలిటీ సెంటర్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో ప్రధాన నిందితురాలు, ఆ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆమెను ఐదు రోజులు కస్టడీకి తీసుకుని విచారించిన గోపాలపురం పోలీసులు.. సృష్టిలో మోసాలపై కీలక విషయాలు రాబట్టినట్లు తెలిసింది. మంగళవారం పోలీసు కస్టడీ ముగియడంతో ఆమెను మేజిస్ట్రేట్ ఎదుట హాజరపరిచి, తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు, సోమవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న బినామీ డాక్టర్ విద్యుల్లతను పోలీసులు విచారించి సృష్టిలో మోసాలపై కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఇటీవల నమ్రత రాజస్థాన్‌కు చెందిన గోపాల్ సింగ్ దంపతులను సరగసీ పేరిట నమ్మించి.. మోసగించిన విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఒడిసా దంపతులకు పుట్టిన బిడ్డను రూ.90 వేలకు కొన్న నమ్రత.. ఆ బిడ్డను రాజస్థాన్ దంపతులకు రూ.35 లక్షలకు విక్రయించింది. కొన్నేళ్ల క్రితమే మోసాలు బయటపడి నమ్రత లైసెన్స్ రద్దు కావడంతో ఆమె ఇతర వైద్యులను బినామీగా పెట్టుకుని వారి పేరిట లైసెన్స్ తీసుకుని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, కర్ణాటక, ఒడిసా, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ శాఖలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

పెరుగుతున్న బాధితులు

ఎంతోమంది దంపతులను సరగసీకి ఒప్పించిన డాక్టర్ నమ్రత.. ఒక్కో జంట నుంచి రూ.30 నుంచి రూ.50 లక్షల వరకు దోచుకున్నట్లు పోలీసులు గుర్తించారని తెలిసింది. అనేక కోణాల్లో విచారించిన పోలీసులు ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నమ్రత ముఠాలో కీలక పాత్ర పోషించి కల్యాణి, సంతోషిలను పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే 15 మందిని అరెస్టు చేయగా.. మరికొందర్ని అరెస్టు చేయవచ్చని సమాచారం.

దందాలో ఆ ముగ్గురిది కీలక పాత్ర

సరగసీ పేరుతో శిశు విక్రయాలకు పాల్పడుతున్న నమ్రతకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలతో సంబంధాలు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైందని తెలిసింది. ఆ ముఠాలకు బట్టి రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు చెల్లించి చిన్నారులను కొంటున్నట్లు గుర్తించారు. ఆ పిల్లల్నే సరగసీ ద్వారా పుట్టినట్లు నమ్మించి పిల్లలు లేని దంపతుల నుంచి రూ.30 నుంచి 50 లక్షలు తీసుకుంటున్నట్లు తేలింది. ఈ దందాలో హర్ష, పవన్, నందిని అనే వ్యక్తులు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. హైదరాబాద్‌లోని పెట్టీకేర్, హెడ్జ్, ఒయాసిస్ కేంద్రంగా తన దందాను కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు.

ట్యాంకర్‌ను మింగిన రోడ్డు!

హైదరాబాద్ బంజారాహిల్స్‌లో కూలిన నాలా శ్లాబ్

- నాలాలో పడ్డ వాటర్ ట్యాంకర్
- డ్రైవర్‌ను, క్లీనర్‌ను బయటకు తీసిన స్థానికులు



పంజాగుట్ట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఐదు టన్నుల బరువు.. పదివేల లీటర్ల నీటి లోడుతో వెళ్తున్న.. భారీ వాటర్ ట్యాంకర్‌ని రోడ్డు మింగేసింది! అయితే, అది పైకి రోడ్డులా కనిపించినా.. రోడ్డు కాదు! ఆ ప్రాంతంలో ఉన్న బంజారా చెరువు నుంచి నీరు హుస్సేన్‌సాగర్‌లోకి పోవడానికి ఎప్పుడో 30 ఏళ్ల క్రితం నిర్మించిన నాలా శ్లాబ్!! ఇన్నేళ్లుగా వానలకు తడిసి.. ఎండలకు ఎండిన ఆ నాలా శ్లాబ్.. రెండురోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మరింత నాని పూర్తిగా బలహీనమైపోయింది! దుర్బలమైన ఆ శ్లాబ్‌పైకి అంత బరువైన నీళ్ల ట్యాంకర్ రావడంతో తట్టుకోలేక కుంగిపోయింది. దీంతో ట్యాంకర్ అందులో పడిపోయింది. మంగళవారం తెల్లవారుజామున జరిగిందీ ఘటన. ట్యాంకర్ ఎడమ భాగం నాలాలోకి కూరుకుపోవడంతో క్లీనర్ అందులో ఇరుక్కుపోయాడు. పెద్ద శబ్దంతో లారీ అందులో పడిపోవడంతో ఉలిక్కిపడి లేచిన స్థానికులు అక్కడికి చేరుకుని.. కష్టపడి అతణ్ని బయటికి తీశారు. వారికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. విషయం తీసుకున్న జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి, ఖైరతాబాద్ పోలీసులు, సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. సోమవారం (4వ తేదీ) కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి నుంచి వర్షం నీరు ఈ రోడ్డులోకి పోటెత్తడంతో.. స్థానికులు భారీ వాహనాల రాకపోకలను నియంత్రించడానికి రోడ్డు మొదట్లో బ్యారికేడ్లు కూడా ఏర్పాటు చేశారు. కానీ తెల్లవారుజామున వచ్చిన వాటర్ ట్యాంకర్ సిబ్బంది బ్యారికేడ్‌ను పక్కకు పెట్టి ముందుకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ దారిలో రోజూ 10 దాకా భారీ వాటర్ ట్యాంకర్లు రాకపోకలు సాగిస్తాయి. స్థానికులు కూడా తమ వాహనాలతో నాలాపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. కానీ.. రహదారి కింద ఈ నాలా ఉన్న విషయమే తమకు తెలియదని స్థానికులు చెబుతున్నారు. కాగా.. నాలాలో పడ్డ ట్యాంకర్‌ను బయటకు తీయడం అధికారులకు తలనొప్పిగా మారింది. ఇప్పటికే ట్యాంకర్ లో ఉన్న పదివేల లీటర్ల నీటిని పైపుల ద్వారా పూర్తిగా తొలగించారు. కానీ వాహనం బరువు సుమారు ఐదు టన్నులకు పైగా ఉంది. అసలే ఇరుకు దారి కావడంతో భారీ క్రేన్ లోపలికి వెళ్లే అవకాశం లేదు. ఒకవేళ తీసుకెళ్లినా.. 75 టన్నుల భారీ క్రేన్ బరువును నాలా స్లాబ్ తట్టుకుంటుందా? అని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పైగా ఇది.. పంజగుట్ట, బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1 మీదుగా లకిడీకపూల్, మెహిదీపట్నం వెళ్లే మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. కాబట్టి.. రాత్రి 11 గంటల తరువాత ప్రధాన రహదారిపై భారీ క్రేన్ పెట్టి ట్యాంకర్‌ను బయటికి తీయాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. ఇదే కాక.. ఈ నాలా మార్గంలో మిగతాచోట్ల కూడా శ్లాబ్ ఎంత బలంగా ఉందో తనిఖీ చేసి.. ఎక్కడిదాకా తొలగించాలో నిర్ణయించి, త్వరలో కొత్తది నిర్మిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.

సుప్రీం వ్యాఖ్యలు అవాంఛనీయం

- రాహుల్‌కు 'ఇండీ' కూటమి సమర్థన
- ఎవరు నిజమైన భారతీయుడో నిర్ణయించేది జడ్జీలు కాదు: ప్రియాంక



ఇండియా కూటమి పార్టీల ఫ్లోర్ లీడర్స్ సమావేశంలో రాహుల్, ఖర్గే, కనిమొళి, సుప్రియ తదితరులు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: చైనా మన భూభాగాన్ని ఆక్రమించిందన్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు అవాంఛనీయమని విపక్షాల 'ఇండీ' కూటమి పేర్కొంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేతకు పూర్తి మద్దతు ప్రకటించింది. మంగళవారం పార్లమెంటు ఉభయ సభల్లోని వివిధ విపక్షాల నాయకులు సమావేశమయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లోని ప్రతిపక్ష నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే కూడా హాజరయ్యారు. జాతీయ ప్రయోజనాలు ఇమిడి ఉన్న అంశాలపై వ్యాఖ్యలు చేయడం విపక్ష నేతగా రాహుల్ బాధ్యత అని పలువురు నేతలు పేర్కొన్నారు. రాహుల్‌నుద్దేశించి, పార్టీల ప్రజాస్వామిక హక్కులపైన సుప్రీంకోర్టు సిటింగ్ న్యాయమూర్తి అసాధారణ వ్యాఖ్య చేశారని, ఇది అవాంఛనీయమని అన్ని పార్టీల నాయకులూ అన్నట్లు కాంగ్రెస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ అంశంపై రాహుల్ సోదరి, వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రాను మీడియాను ప్రశ్నించగా.. ఎవరు నిజమైన భారతీయులో నిర్ణయించేది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కాదని ఆమె బదులిచ్చారు. 'ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆయన విధి. అదే ఆయన చేశారు' అని స్పష్టంచేశారు. మరోవైపు, సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఇకనైనా రాహుల్ తన నడత మార్చుకోవాలని, రాజ్యాంగ విలువలను గౌరవించాలని బీజేపీ సూచించింది. కోర్టు ఆక్షేపణ ఆయనకు తీవ్ర హెచ్చరికవంటిదని ఆ పార్టీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ అన్నారు. రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని దేశమంతా తిరిగేవాళ్లకు.. ఆ రాజ్యాంగమంటే వీసమెత్తు గౌరవం ఉన్నా.. కోర్టు అలాంటి వ్యాఖ్యలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

ఇండీ కూటమి ప్రదర్శన 11కు వాయిదా

అసెంబ్లీ ఎన్నికల ముంగిట బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను నిరసిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కార్యాలయం వరకూ ప్రతిపక్ష ఇండీ కూటమి నిర్వహించ తలపెట్టిన ర్యాలీ 11కి వాయిదా పడింది. తొలుత ఈ నెల 8న ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించినా జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) వ్యవస్థాపకుడు- జార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ మృతితో వాయిదా పడిందని ఆ కూటమి వర్గాలు తెలిపాయి. అయితే, రాహుల్ గాంధీ నూతన నివాసంలో ఈ నెల 7న ఇండీ కూటమి పక్షాల విందు సమావేశం యథాతథంగా సాగుతుందని ఆ వర్గాల కథనం. ఇక 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మహదేవపుర సెగ్మెంట్ ఓటర్ల జాబితాలో భారీస్థాయిలో అవకతవకలు జరిగినందుకు నిరసనగా రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో మంగళవారం బెంగళూరులో నిర్వహించాల్సిన ప్రదర్శన ఈ నెల 8కి వాయిదా పడింది.

రాజ్యసభలో సీఐఎస్ఎఫ్ దళాలపై రేణుక అసహనం

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) రాజ్యసభలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) దళాలను మార్షల్స్‌లా నియమించి ప్రతిపక్ష ఎంపీలను అడ్డుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రేణుకాతో పాటు ప్రతిపక్ష ఎంపీలు మంగళవారం వెల్‌లోకి దూసుకు వెళ్లేందుకు ప్రయత్నించగా సిఐఎస్ఎఫ్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. అనంతరం రేణుక మాట్లాడుతూ, పార్లమెంట్‌లో సిఐఎస్ఎఫ్ దళాలను మార్షల్స్‌గా వాడడం సరైంది కాదని అన్నారు. నిజమైన ఉగ్రవాదులను వారు పట్టుకోలేకపోయారని, ఆపరేషన్ మహదేవ్ పేరిట పట్టుకున్న వారు నిజమైన ఉగ్రవాదులో కాదో తెలియదని అన్నారు. కానీ పార్లమెంట్‌లో మాత్రం ఈ భద్రతా దళాలు మహిళలని కూడా చూడకుండా దురుసుగా ప్రవర్తిస్తాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ స్థాయి ఇదని రేణుకా విరుచుకుపడ్డారు.



తేలియా రూమల్ చీరను తయారు చేస్తున్న గూడ పవన్

'పుట్టపాక' చేనేత కళాకారులకు... కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారాలు

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారాలకు యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టపాక గ్రామానికి చెందిన ముగ్గురు చేనేత కళాకారులు ఎంపికయ్యారు. చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న ప్రభుత్వం వీరికి అవార్డులను అందజేయనుంది. చేనేత రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ పురస్కారాలను అందిస్తోంది. మంగళవారం ప్రకటించిన అవార్డులకు పుట్టపాకకు చెందిన చేనేత కార్మికులు సామల భాస్కర్, గూడ పవన్, కొలను శంకర్ ఎంపికయ్యారు. సామల భాస్కర్ నెమలి, దేవతామూర్తులు డిజైన్ ఉన్న చీరలను రూపొందించారు. ఇక గూడ పవన్ ఆరు నెలల పాటు శ్రమించి సహజమైన రంగులు అద్ది తేలియా రుమాల్ డబుల్ ఇక్కత్ చీరను నేశారు. రూ.75 వేల ఖరీదు చేసే ఈ చీర గత నెలలో పవన్‌కు జాతీయ పురస్కారాన్ని తెచ్చిపెట్టింది. కొలను శంకర్, రాజ్‌కోట్ సిల్క్, లెనిన్ కాటన్‌తో డబుల్ ఇక్కత్ పద్ధతిలో ప్రత్యేక చీరలు రూపొందించారు. ఇదే గ్రామానికి చెందిన గజం నర్మద కూడా మార్కెటింగ్ విభాగంలో జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★


ఇదొక తిండిపోతు కథ



- ఎస్‌జే శివ

'ఇప్పటి వరకూ తెలుగులో చాలా జోనర్‌లు వచ్చాయి. ఈ కొత్త జోనర్‌ను మా సినిమాతోనే ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. ఇదొక తిండిపోతు కథ. హాస్యంతో ప్రేక్షకులను రంజింపజేయడమే మా లక్ష్యం' అని అన్నారు దర్శకుడు ఎస్‌జే శివ. ఆయన దర్శకత్వంలో వైవా హర్ష టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఎస్‌జే శివ చిత్ర విశేషాలు పంచుకున్నారు. 'ఐదుగురు బ్యాచిలర్స్ మధ్య జరిగే కామెడీ కథ ఇది. కథ వినగానే ప్రవీణ్ ఈ సినిమాకు కథే హీరో..తప్పకుండా మనం చేద్దాం అన్నారు. ఇంతకు ముందు వచ్చిన 'ఘటోత్కచుడు', 'యమలీల' చిత్రాల్లా ఆడియన్స్ థ్రిల్లింగ్‌గా ఫీలవుతారు. ఈ సినిమాలో హారర్ థ్రిల్లర్, కామెడీ, ఎమోషన్స్ అన్నీ ఉన్నాయి. ఎస్వీసీ లాంటి గొప్ప సంస్థ మా చిత్రాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

'మాస్ జాతర'లో ఓలే.. ఓలే..!



రవితేజ కథానాయకుడిగా నటిస్తోన్న చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయిక. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ చిత్రంపై భారీ అంచనాలను పెంచేసింది. మొదటి గీతంగా విడుదలైన 'తు మేరా లవర్' అందర్నీ ఉర్రూతలూగించింది. ఇప్పుడు రెండో గీతంగా 'ఓలే ఓలే...'ని విడుదల చేసింది చిత్ర బృందం. రవితేజ- శ్రీలీల పోటా పోటీగా నర్తించి పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. భాస్కర్ యాదవ్ దాసరి సాహిత్యానికి భీమ్స్ సిసిరోలియో తనదైన శైలిలో స్వరపరిచారు.

విజువల్ వండర్‌గా జటాధర



సుధీర్ బాబు, బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలు పోషిస్తున్న మైథలాజికల్ సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర' చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని అద్భుతమైన గ్రాఫిక్స్‌తో విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సుధీర్‌బాబు, సోనాక్షి గెటప్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ ఏడాదిలోనే విడుదలయ్యే 'జటాధర' చిత్రాన్ని ఉమేశ్‌కుమార్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేర్నా అరోరా, శిల్పా సింగాల్, నిఖిల్ నందా నిర్మిస్తున్నారు.

దుల్కర్ కొత్త సినిమా




విలక్షణ నటుడు దుల్కర్ సల్మాన్ తెలుగులో నూతన దర్శకుడు రవి నేలకుదిటితో ఓ సినిమా చేయబోతున్నారు. హైదరాబాద్‌లో ఈ ప్రాజెక్టును ఘనంగా ప్రారంభించారు. ముహూర్తపు షాట్‌కు హీరో నాని క్లాప్ కొట్టారు. దర్శకుడు బుచ్చిబాబు సానా కెమెరా స్విచ్ఛాన్ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైనట్లు చిత్రబృందం తెలిపింది.

గూఢచారి రాక ఖరారు



బ్లాక్ బస్టర్ స్పై థ్రిల్లర్ 'గూఢచారి'కి సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'జీ2'. అడివి శేష్ కథానాయకుడిగా నటిస్తోన్న ఈ చిత్రాన్ని 2026 మే 1న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం ద్వారా వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. సినిమాలో ఈసారి ఏజెంట్ 116గా వామికా గబ్బి ఎంట్రీ ఇస్తున్నారు. యాక్షన్‌తో పాటు ఎమోషన్ ఉన్న క్యారెక్టర్ ఇది. ఇమ్రాన్ హష్మీ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అలాగే మురళీ శర్మ, సుప్రియా యార్లగడ్డ, మధు శాలిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 150 రోజులపాటు, ఆరు దేశాల్లో, 23 భారీ సెట్లతో ఈ సినిమాను చిత్రీకరిస్తున్నారు.

ఆ రీల్‌కు 190కోట్ల వ్యూస్



బాలీవుడ్ నటి దీపికా పడుకోన్ ఇటీవల ఓ హోటల్ ప్రచారం కోసం రూపొందించిన యాడ్‌లో నటించారు. ఆ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. ఈ వీడియో(రీల్)కు కేవలం 8వారాల్లోనే 190కోట్ల(1.9బిలియన్లు) వ్యూస్ వచ్చాయి. ఇదొక ప్రపంచ రికార్డు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంత వరకు మరే వీడియోకు ఇన్ని వ్యూస్ రాలేదు. దీంతో, దీపిక ఫ్యాన్స్ సంతోషపడుతున్నారు. 200కోట్ల వ్యూస్ మార్క్‌ను అందుకోనున్న మొట్టమొదటి వీడియోగా ఇది రికార్డులెక్కబోతోందని కామెంట్లు పెడుతున్నారు. దీపికకు సోషల్ మీడియాలో 8కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. కాగా, హార్దిక్ పాండ్యా 'టేక్ ది షాట్' అన్న క్యాప్షన్‌తో పోస్టు చేసిన రీల్ 160 కోట్ల(1.6బిలియన్) వ్యూస్‌తో రెండో స్థానంలో ఉంది. ఇదిలా ఉండగా, యూట్యూబ్‌లో మాత్రం గంగ్నమ్ స్టైల్ పాటకు ఇప్పటివరకు ఏకంగా 560కోట్ల(5.6బిలియన్) వ్యూస్ వచ్చాయి.

అప్పుడు జోక్యం చేసుకుంటా



టాలీవుడ్ నిర్మాతలు మెగాస్టార్ చిరంజీవిని మంగళవారం కలిశారు. ప్రస్తుతం పరిశ్రమలో నెలకొన్న పరిస్థితులను.. ఫెడరేషన్ సభ్యులు షూటింగ్‌లను బంద్ చేయడం వల్ల తలెత్తిన సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో నిర్మాతలు చిరంజీవితో చర్చించిన విషయాలను, ఆయన స్పందనను మీడియాతో సి.కల్యాణ్ పంచుకున్నారు. "నిర్మాతలమందరం కలసి ప్రస్తుతం పరిశ్రమలో తలెత్తిన సమస్యను చిరంజీవికి వివరించాం. 'ఈ విధంగా షూటింగ్స్ ఆగిపోవడం బాధాకరం. నిర్మాతల వెర్షన్‌ను విన్నాను. ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యుల వాదనలు కూడా విని తెలుసుకుంటాను. మరో రెండు మూడు రోజుల్లో పరిస్థితులు సద్దుమణుగుతాయేమో చూస్తాను. అప్పటికీ ఏ మార్పూ లేకుంటే నేను కలుగజేసుకుంటా' అని చిరంజీవి చెప్పారు' అని సి.కల్యాణ్ పేర్కొన్నారు.

ఐటీ ఉద్యోగుల కంటే వారికే వేతనాలెక్కువ: ప్రసన్నకుమార్

ఫిల్మ్ ఫెడరేషన్ వేతన పెంపుపై నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్ స్పందించారు. 'ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులతో మూవీ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు చర్చించారు. ఛాంబర్‌తోనే 'మా' ముందుకు వెళ్తుందని తెలిపారు. పేద సినీ కార్మికులకు మేం ఎప్పుడూ అండగా ఉంటాము. ఐటీ ఉద్యోగుల కన్నా యూనియన్ కార్మికులకు జీతాలెక్కువ. మా కార్మికులతోనే పనిచేయాలి అని యూనియన్ వాళ్లు చెప్పడం తప్పు' అని ప్రసన్నకుమార్ అన్నారు.

సినీ కార్మికుడు రోజుకు 15 గంటలు పనిచేస్తాడు: వల్లభనేని అనిల్

'యూనియన్ సభ్యులు కానివారితోనూ ఇకపై టాలీవుడ్ నిర్మాతలు పనిచేయించుకోవచ్చు' అని ఫిల్మ్ ఛాంబర్ తీసుకున్న నిర్ణయంపై ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ స్పందించారు. 'సినీ కార్మికుల్లో స్కిల్ లేకుంటే అంతర్జాతీయ స్థాయి సినిమాలు వచ్చేవా? ఇప్పుడేమో కార్మికులు వద్దు, కొత్తవారిని తీసుకువస్తామంటున్నారు. వేతన పెంపును ముందునుంచి అడుగుతూనే ఉన్నాం. సడన్‌గా బంద్ అని ఎప్పుడూ అనలేదు. అయినా, మేము అడిగినంత ఇచ్చేందుకు కొందరు నిర్మాతలు ముందుకు వచ్చారు. బయటివారికంటే సినీ కార్మికులకు జీతాలెక్కువ అని అంటున్నారు. కానీ సినీ కార్మికుడు రోజుకు దాదాపు 15 గంటలు పనిచేస్తాడు. కార్మికుల వేతన సమస్యలపై చర్చించడానికి లేబర్ కమిషనర్ అదనపు కమిషనర్ గంగాధర్‌ను కలిశాం. ప్రొడ్యూసర్ కౌన్సిల్‌తో చర్చిస్తామని ఆయన తెలిపారు. రేపటితో సినిమా ఇండస్ట్రీలో నెలకొన్న సందిగ్ధతలు తొలగిపోతాయి అని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు.

కార్మికులకు జీతాలు పెంచాలి: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

సినీ కార్మికుల వేతన పెంపు విషయంలో కార్మికులకు మద్దతు పలికారు తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. 'కార్మికులకు జీతాలు పెంచాలి. ఢిల్లీ పర్యటన తర్వాత కార్మికులతో నేను మాట్లాడుతాను. ఈ అంశాలని దిల్‌రాజుకు అప్పగించాం. కార్మికుల డిమాండ్లపై చర్చించి నిర్ణయం తీసుకోవాలి' అని పేర్కొన్నారు.

చిరంజీవి పుట్టినరోజున విడుదల



సత్యరాజ్ ప్రధాన పాత్రలో మోహన్ శ్రీవాత్సవ తెరకెక్కించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. దర్శకుడు మారుతి సమర్పణలో విజయ్‌పాల్ రెడ్డి అడిదెల నిర్మించారు. వశిష్ట ఎన్.సింహా, ఉదయభాను, ముఖ్య పాత్రలు పోషించారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో సత్యరాజ్ మాట్లాడుతూ 'మెగాస్టార్ చిరంజీవి గొప్ప నటుడు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 22న సినిమా విడుదలవుతుండటం ఆనందంగా ఉంది' అని అన్నారు.

టాటా క్యాపిటల్ రూ.17,200 కోట్ల ఐపీఓ



న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) టాటా క్యాపిటల్ నవీకరించిన ఐపీఓ పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) సెబీకి సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ 200 కోట్ల డాలర్ల (రూ.17,200 కోట్లు) వరకు సమీకరించాలని భావిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ లెక్కన కంపెనీ మార్కెట్ విలువ దాదాపు 1,100 కోట్ల డాలర్ల (రూ.94,600 కోట్లు) స్థాయిలో ఉండనుందని వారన్నారు. సెబీకి సోమవారం సమర్పించిన అప్‌డేటెడ్ డీఆర్‌హెచ్‌పీ ప్రకారం.. ఐపీఓలో భాగంగా టాటా క్యాపిటల్ మొత్తం 47.58 కోట్ల షేర్లను విక్రయించనుంది. అందులో 21 కోట్ల తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు ప్రమోటర్లు, ఇతర వాటాదారులకు చెందిన 26.58 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన అమ్మకానికి పెట్టనుంది. ఓఎఫ్ఎస్‌లో భాగంగా కంపెనీ ప్రమోటరైన టాటా సన్స్ తన వాటా నుంచి 23 కోట్ల షేర్లను, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) 3.58 కోట్ల షేర్లను ఉపసంహరించుకోనున్నాయి. ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో టాటా సన్స్ 88.6 శాతం, ఐఎఫ్‌సీ 1.8 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఐపీఓలో తాజా ఈక్విటీ జారీ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ టైర్-1 మూలధన నిధులను పెంచుకునేందుకు, భవిష్యత్ మూలధన అవసరాలు, రుణ వితరణ కోసం వినియోగించుకోనుంది.

సెన్సెక్స్ 308 పాయింట్లు పతనం

ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ బుధవారం వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు ముందు జాగ్రత్తగా ఇంధనం, బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో బీఎస్ఈ సెన్సెక్స్ మంగళవారం ట్రేడింగ్‌లో 308.47 పాయింట్లు కోల్పోయి 80,710.25 వద్దకు జారుకుంది. నిఫ్టీ 73.20 పాయింట్ల నష్టంతో 24,649.55 వద్ద ముగిసింది.

ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 22 పైసల నష్టంతో రూ.87.88 వద్ద ముగిసింది. భారత వస్తువులపై సుంకాలను మరింత పెంచుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయి.

రూ.178 కోట్లతో రాజమండ్రి ప్లాంట్ విస్తరణ

ఆంధ్రా పేపర్ లిమిటెడ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి ప్లాంట్ అప్‌గ్రేడేషన్, పేపర్ మెషిన్-3 పునర్ నిర్మాణం కోసం రూ.178 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆంధ్ర పేపర్ లిమిటెడ్ ప్రకటించింది. ప్రతిపాదిత పెట్టుబడులకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం లభించిందని తెలిపింది. ఈ పెట్టుబడులను అంతర్గత వనరులు, బ్యాంకు రుణాల రూపంలో సమీకరించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం ఏటా 36,000 టన్నులుగా ఉండగా ప్రతిపాదిత విస్తరణతో ఉత్పత్తి సామర్థ్యం 60 శాతం మేర పెరగనుందని పేర్కొంది. వచ్చే 13 నెలల కాలంలో ఈ విస్తరణను పూర్తి చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. కాగా జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కంపెనీ రూ.420.64 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.21.30 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

ఫార్మా దిగుమతులపై 250% సుంకాలు..!

ధరలు తగ్గిస్తే సరి..లేదంటే టారిఫ్ పోటు తప్పదు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రోజుకో బాంబు పేలుస్తున్నారు. తాజాగా ఆయన దృష్టి ఫార్మా కంపెనీలపై పడింది. ఈ కంపెనీలు.. అమెరికాలో ఔషధాల ఉత్పత్తి పెంచి ధరలు తగ్గించాలని కోరారు. లేకపోతే భారీ సుంకాల పోటు తప్పవని హెచ్చరించారు. సీఎన్‌బీసీ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. 'ప్రారంభంలో ఈ సుంకాల పోటు కొద్ది స్థాయిలోనే ఉంటుంది. ఏడాది, ఏడాదిన్నర తర్వాత ఇది 150 శాతం, ఆ తర్వాత 250 శాతం వరకు ఉంటుంది' అని ట్రంప్ స్పష్టం చేశారు. మిగతా అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అమెరికాలో ఔషధాల ధరలు మూడింతలు ఎక్కువగా ఉన్నందున, వాటి ధరలు తగ్గించక తప్పదని ట్రంప్ ఈ ఏడాది మార్చిలో హెచ్చరించిన విషయం తెలిసిందే.

భారత్‌పై ప్రభావం: ట్రంప్ తాజా హెచ్చరిక భారత ఫార్మా కంపెనీలకు గుబులు పుట్టిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం మన దేశం నుంచి 3,000 డాలర్ల (సుమారు రూ.2.61 లక్షల కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అందులో అమెరికా వాటా 14 శాతం వరకు ఉంది. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) ఇంకా కుదరక పోవడంపై భారత ఫార్మా కంపెనీలు ఇప్పటికే ఆందోళనలో ఉన్నాయి. ఇప్పుడు ట్రంప్ చేసిన తాజా హెచ్చరిక అమలైతే భారత జెనరిక్ ఔషధాలకు అమెరికా మార్కెట్ శాశ్వతంగా మూసుకుపోయినట్టేనని పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

బ్రిటన్‌కు మరిన్ని మత్స్య ఎగుమతులు

కలిసి రానున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ: భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) మన దేశ మత్స్య ఎగుమతులకు బాగానే కలిసి రానుంది. ప్రస్తుతం బ్రిటన్ మన దేశం నుంచి ఎగుమతయ్యే మత్స్య దిగుమతులపై 8.9 శాతం చొప్పున దిగుమతి సుంకం విధిస్తోంది. ఎఫ్‌టీఏతో ఈ సుంకం పూర్తిగా రద్దు కానుంది. దీంతో ప్రస్తుతం ఏటా బ్రిటన్‌కు రూ.1,000 కోట్ల వరకు ఉన్న మన మత్స్య ఎగుమతులు వచ్చే మూడేళ్లలో మూడింతలు పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

ఏపీకీ మేలు

ఈ ఎఫ్‌టీఏ తీర ప్రాంతం ఎక్కువగా ఉన్న గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు బాగా మేలు చేయనుంది. మన దేశం నుంచి జరిగే రొయ్యల ఎగుమతుల్లో దాదాపు 60 నుంచి 70 శాతం ఏపీ నుంచే ఎగుమతవుతాయి. ట్రంప్ సుంకాలతో బేల చూపులు చూస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని రొయ్యల ఎగుమతిదారులకూ భారత-బ్రిటన్ ఎఫ్‌టీఏ కలిసిరానుంది. అయితే ట్రంప్ సుంకాల నేపథ్యంలో బ్రిటన్‌లోని దిగుమతిదారులు ధరలు తగ్గించే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎగుమతుల్లో గుజరాత్ టాప్

- రూ.9.83 లక్షల కోట్లతో అగ్రస్థానం
- 6,7 స్థానాల్లో ఏపీ, తెలంగాణ

న్యూఢిల్లీ: దేశ ఎగుమతుల్లో గుజరాత్ హవా కొనసాగుతోంది. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.9.83 లక్షల కోట్ల ఎగుమతులతో గుజరాత్ దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం దేశం నుంచి జరిగిన మొత్తం ఎగుమతుల్లో 26.6 శాతం ఒక్క గుజరాత్ నుంచే ఎగుమతయ్యాయి. భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) మంగళవారం దీనికి సంబంధించిన వివరాలు విడుదల చేసింది. గుజరాత్ తర్వాత మహారాష్ట్ర రూ.5.57 లక్షల కోట్ల ఎగుమతులతో ద్వితీయ స్థానం సంపాదించింది. తమిళనాడు (రూ.4.53 లక్షల కోట్లు) కర్ణాటక (రూ.2.65 లక్షల కోట్లు), ఉత్తర ప్రదేశ్ (రూ.1.91 లక్షల కోట్లు) రాష్ట్రాలు మూడు, నాలుగు, ఐదో స్థానాలతో సరిపెట్టుకున్నాయి.

తెలుగు రాష్ట్రాల హవా

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ గత ఆర్థిక సంవత్సరం దేశ ఎగుమతుల్లో ఆరు, ఏడు స్థానాల్లో నిలిచాయి. ఏపీ నుంచి 2,078 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.80 లక్షల కోట్లు) విలువైన ఎగుమతులు నమోదయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 5.17 శాతం ఎక్కువ. ఇది గత ఆర్థిక సంవత్సరం దేశం నుంచి జరిగిన మొత్తం ఎగుమతుల్లో 4.75 శాతానికి సమానం. తెలంగాణ నుంచి గత ఆర్థిక సంవత్సరం 1,912 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.66 లక్షల కోట్లు) విలువైన ఎగుమతులు జరిగాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 36.33 శాతం ఎక్కువ. దేశ మొత్తం ఎగుమతుల్లో ఇది 4.37 శాతానికి సమానమని ఫియో తెలిపింది.

ఎయిర్‌టెల్ లాభంలో భారీ వృద్ధి

భారతి ఎయిర్‌టెల్ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.49,463 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.5,947.9 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 28.4%, లాభం 43% పెరిగాయి. ఒక్కో కస్టమర్‌పై సగటు ఆదాయం (ఆర్పు) గత ఏడాదితో పోల్చితే రూ.211 నుంచి రూ.250కి పెరిగింది. పోస్ట్ పెయిడ్ సబ్‌స్క్రైబర్లు పెరగడంతో నిర్వహణాపరమైన లాభం 54 శాతం పెరిగినట్టు తెలిపింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	84
కర్నూలు	90	నెల్లూరు	89
విశాఖపట్నం	94	అనంతపురం	89
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,260 ▲	93,700 ▲	1,25,000 ▲
విజయవాడ	1,03,500 ▼	97,500 ▲	1,11,625 ▼
విశాఖపట్నం	1,03,260 ▲	93,700 ▲	1,26,000 ▲
రాజమండ్రి	1,02,200 ▲	93,700 ▲	1,15,500 ▲
ప్రొద్దుటూరు	1,00,300 ▲	92,280 ▲	1,15,700 ▲
ముంబై	1,00,076 ▼	91,670 ▼	1,12,422 ▲


తగ్గిన ఎన్‌సీసీ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,207.93 కోట్ల టర్నోవర్‌పై రూ.192.14 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.5,558.33 కోట్లుగా ఉండగా లాభం రూ.209.92 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ కొత్తగా రూ.3,658 కోట్ల ఆర్డర్లను దక్కించుకుంది. దీంతో కంపెనీ ఆర్డర్ బుక్ రూ.70,087 కోట్లకు చేరుకుంది. కాగా జూన్ త్రైమాసికంలో కంపెనీ రూ.4,429.64 కోట్ల స్టాండ్‌ఎలోన్ ఆదాయంపై రూ.190.10 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

సీసీఎల్ ప్రొడక్ట్స్ లాభం రూ. 72 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : సీసీఎల్ ప్రొడక్ట్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,058.03 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.72.44 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.774.62 కోట్లుగా ఉండగా లాభం రూ.71.47 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం వ్యయాలు రూ.963.84 కోట్ల నుంచి రూ.687.44 కోట్లకు పెరిగాయి. కాగా స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.537.55 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.31.36 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	435	విజయవాడ	475
వరంగల్	437	గోదావరి	475
చిత్తూరు	513	విశాఖపట్నం	475
		దజను గుడ్లు రూ.	72

గ్లాండ్ ఫార్మా లాభంలో 50% వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో గ్లాండ్ ఫార్మా నికర లాభం 50 శాతం వృద్ధితో రూ.215 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.143 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా 7 శాతం వృద్ధి చెంది రూ.1,401 కోట్ల నుంచి రూ.1,505 కోట్లకు పెరిగింది

ఎంటార్ లాభం రూ.11 కోట్లు: జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో ఎంటార్ టెక్నాలజీస్ కన్సాలిడేటెడ్ నికర లాభం 144 శాతం వృద్ధి చెంది రూ.10.8 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.4.4 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.128.3 కోట్ల నుంచి రూ.156.6 కోట్లకు పెరిగింది.

స్పోర్ట్స్

ఫిట్‌నెస్ కింగ్



ఇక ఆ పదాన్ని మర్చిపోండి — గవాస్కర్

లండన్: భారత క్రికెట్‌లో ఈ మధ్య కాలంలో పని ఒత్తిడి అనే మాట ఎక్కువగా వినిపిస్తోంది. దీనిలో భాగంగానే స్టార్ పేసర్ బుమ్రా ఐదు టెస్టుల సిరీస్‌లో మూడింటికే పరిమితమయ్యాడు. అయితే ఇదంతా అపోహేనని సిరాజ్ నిరూపించాడని మాజీ కెప్టెన్ గవాస్కర్ అన్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో ఈ హైదరాబాదీ మొత్తం ఐదు మ్యాచ్‌లనూ ఆడిన సంగతి తెలిసిందే. 'వర్క్‌లోడ్‌ను దరి చేరనీయకుండా సిరాజ్ బౌలింగ్ వేసిన తీరు అద్భుతం. కెప్టెన్ ఎప్పుడు బంతి ఇచ్చినా సుదీర్ఘ స్పెల్‌లు వేశాడు. ఇక భారత జట్టు ఆ పదాన్ని తమ డిక్షనరీ నుంచి తొలగించాలి. ఎందుకంటే వర్క్‌లోడ్‌కు కట్టుబడితే అత్యుత్తమ ఆటగాళ్లను బరిలోకి దించలేం. మానసికంగా దృఢంగా ఉండడమే ముఖ్యం. అలాగే పంత్ గాయమైనా బ్యాటింగ్‌కు దిగాడు. సైనికులు తమకెదురయ్యే కఠిన పరిస్థితులపై ఫిర్యాదు చేస్తారా?' అని సన్నీ ప్రశ్నించాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఏ క్రికెటర్ నైపుణ్యమైనా సుదీర్ఘ ఫార్మాట్‌లోనే బయటపడుతుందని అంటుంటారు. ఐదు రోజులపాటు సాగే టెస్టు మ్యాచ్‌లో ఆడాలంటే ఫిట్‌నెస్ అత్యంత కీలకం. అందుకే ఈ విషయంలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని అందరూ ప్రామాణికంగా తీసుకుంటారు. కానీ అలుపెరుగని రీతిలో వరుసగా ఐదు టెస్టులు ఆడి ఏకధాటిగా బంతులు వేసే ఫాస్ట్ బౌలర్లను మాత్రం అరుదుగానే చూస్తుంటాం. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత పేసర్ మహ్మద్ సిరాజ్ విషయంలో జరిగిందదే. ఇరుజట్ల నుంచి గాయపడ్డ వోక్స్ మినహా అన్ని మ్యాచ్‌లను ఆడిన ఏకైక పేసర్ సిరాజే కావడం విశేషం. అంతేకాకుండా ఈ సిరీస్‌లో అందరికంటే ఎక్కువగా 185.3 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అంటే 1,113 బంతులు విసిరి పని ఒత్తిడి అని చెప్పే ఇతర ఆటగాళ్లకు సవాల్ విసిరినట్టయ్యింది. 9 ఓవర్ల స్పెల్‌ను ఎలాంటి అలసటా లేకుండా పలుమార్లు వేయగలగడం సిరాజ్‌కే చెల్లింది. అటు బుమ్రా మూడు మ్యాచ్‌లే ఆడగా.. ఆకాశ్, అర్ష్‌దీప్ ఓసారైనా గాయాలకు గురయ్యారు. కానీ సిరాజ్ మాత్రమే ఓ యోధుడిలా ప్రతీ టెస్టు బరిలోకి దిగి సుదీర్ఘ స్పెల్‌లతో ఆకట్టుకోగలిగాడు. అతడి ఫిట్‌నెస్ స్థాయి ఏమిటో దీన్ని బట్టి చెప్పవచ్చు అయితే ఇందుకు తను కఠినంగానే సన్నద్ధమయ్యాడట. ముఖ్యంగా తన డైట్ విషయంలో ఎలాంటి అలక్ష్యానికి తావీయడని సిరాజ్ సోదరుడు ఇస్మాయిల్ చెబుతున్నాడు. 'జంక్ ఫుడ్‌ను ఏమాత్రం దరిచేరనీయడు. డైట్‌ను క్రమం తప్పకుండా అనుసరిస్తాడు. బిర్యానీలు తినడం కూడా దాదాపుగా మానేశాడు. ఎప్పుడో ఓసారి.. అదీ ఇంట్లో చేసిందే తీసుకుంటాడు. పిజ్జాలాంటి వాటికి చాలా దూరం. ఉదయం, సాయంత్రం జిమ్‌కు వెళ్లడం తప్పనిసరి. చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక కాని సమయంలోనూ నిరుత్సాహ పడకుండా ఫిట్‌నెస్‌పై మరింత దృష్టి సారించాడు' అని వివరించాడు.

అమ్మా.. నా కోసం ప్రార్థించు

ఆటో డ్రైవర్‌గా పనిచేసిన సిరాజ్ తండ్రి మహ్మద్ గౌస్ నాలుగేళ్ల క్రితం మరణించాడు. దేశం తరఫున ఆడే సమయంలో ప్రతీ సిరీస్‌కు ముందు, ఆ తర్వాత తండ్రి సమాధిని దర్శించుకోవడం సిరాజ్‌కు అలవాటు. సిరాజ్ క్రికెటర్‌గా మారే క్రమంలో అతడి తండ్రి తోడ్పాటు ఎక్కువే. జూన్‌లో ఇంగ్లండ్ సిరీస్‌కు వెళ్లే ముందు సిరాజ్ తన తల్లితో.. 'అమ్మా నాకోసం ప్రార్థించు. సిరీస్‌లో బాగా రాణించి భారత జట్టును గెలిపించాలని కోరుకో' అని చెప్పాడట. అటు ఇంగ్లండ్ పర్యటనలో ఆడిన అన్ని మ్యాచ్‌లను కూడా క్రమం తప్పకుండా తల్లి షబానా టీవీలో తిలకించింది.

'మిస్టర్ యాంగ్రీ'

మైదానంలో దూకుడుగా కనిపించే పేసర్ సిరాజ్‌కు ఇంగ్లండ్ క్రికెటర్లు నిక్‌నేమ్ కూడా పెట్టినట్టు మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ తెలిపాడు. "ఐదో టెస్టు రెండో రోజున ఆటగాళ్ల ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు నేను పిచ్ దగ్గరే ఉన్నా. అక్కడే ఉన్న డకెట్ 'మార్నింగ్ మిస్టర్ యాంగ్రీ. ఏం చేస్తున్నావు' అని సిరాజ్‌ను అడిగాడు. దీన్ని తేలిగ్గా తీసుకున్న సిరాజ్ బిగ్గరగా నవ్వాడు. తను గ్రౌండ్‌లో ఓ యోధునిలా పోరాడతాడు కాబట్టే ఇంగ్లండ్ టీమ్ ఆ పేరు పెట్టింది" అని బ్రాడ్ తెలిపాడు.

ఇక ఆటగాళ్ల ఇష్టం కాదు

ఎన్ని మ్యాచ్‌లు ఆడాలనేది బోర్డు నిర్ణయమే!

న్యూఢిల్లీ: వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ పేరుతో ఆటగాళ్లు ఇష్టారీతిన మ్యాచ్‌లకు దూరం కావడంపై బీసీసీఐ దృష్టి సారించింది. మున్ముందు పేసర్లపై ఒత్తిడి పడకుండా చూసుకుంటామని, అయితే వారి ఇష్టమొచ్చినట్టు మ్యాచ్‌లకు దూరమవ్వడాన్ని బోర్డు ఉపేక్షించదని తేల్చి చెప్పింది. 'తమకిష్టమైనట్టుగా మ్యాచ్‌లను, సిరీస్‌లను ఎంపిక చేసుకుని ఆడడం ఇక కుదరదు. అన్ని ఫార్మాట్లలో ఆడే సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాళ్లకు త్వరలోనే ఈ నిర్ణయాన్ని తెలుపుతాం. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకుంటాం. కానీ ఆ పేరుతో ముఖ్యమైన మ్యాచ్‌లకు దూరం కావడాన్ని సమ్మతించం' అని బీసీసీఐ అధికారి చెప్పారు.

కోహ్లీ, రోహిత్ సైడవ్వాల్సిందేనా?



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో హోరాహోరీగా సాగిన ఐదు టెస్టుల సిరీస్ 2-2తో సమంగా ముగిసింది. అయితే, సుదీర్ఘంగా సాగిన సిరీస్‌లో భారత యువ ఆటగాళ్ల పోరాటం హైలైట్‌గా నిలిచింది. దీంతో భారత జట్టులో వీరి స్థానాలు ఇక పదిలమేనన్న టాక్ బలంగా వినిపిస్తోంది. యువ కెరటాలు అనూహ్యంగా దూసుకురావడంతో.. వన్డేలు మాత్రమే ఆడాలనుకొంటున్న సీనియర్లు రోహిత్ శర్మ, కోహ్లీలకు దారులు క్రమంగా మూసుకుపోతున్నట్టు కనిపిస్తోంది. రాబోయే వరల్డ్‌కప్‌నకు వీరిద్దరూ దాదాపుగా 40 ఏళ్లకు చేరువవుతుండడంతో.. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని యువకులతో కోర్ టీమ్ తయారుచేయాలన్న నిర్ణయానికి బీసీసీఐ వచ్చిందని సమాచారం. కోహ్లీ, రోహిత్ భవితవ్యంపై బోర్డు కొద్దిరోజుల్లోనే ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

కన్నీళ్లు.. గంతులు.. ఆలింగనాలు

కోచ్ గంభీర్ భావోద్వేగ సంబరాలు



లండన్: టీమిండియా చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఎప్పుడూ సీరియస్‌గా కనిపిస్తుంటాడు.. విజయాలు దక్కిన సందర్భాల్లోనూ అతను పెద్దగా సంబరాలు చేసుకోవడాన్ని కూడా అభిమానులు చూసి ఉండరు. కానీ, సోమవారం ఓవల్ టెస్టులో భారత జట్టు గెలిచిన క్షణాన మాత్రం గంభీర్ సెలబ్రేట్ చేసుకున్న తీరు ఎంతో ఉద్విగ్నభరితమని చెప్పొచ్చు. ఎప్పుడూ గంభీరంగా కనిపించే గౌతీ.. భావోద్వేగాన్ని ఆపుకోలేక ఏడ్చేశాడు. సంబరం పట్టలేక చిన్నపిల్లాడిలా ఎగిరి గంతులేశాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌ను హత్తుకొని ఆప్యాయంగా ముద్దాడాడు. తీవ్ర భావోద్వేగానికి గురైన గంభీర్.. గట్టిగా అరుస్తూ జట్టు విజయాన్ని తనివితీరా ఆస్వాదించాడు. డ్రెస్సింగ్‌రూమ్‌లో అత్యంత ఉద్వేగభరితంగా మారిన ఆ అపురూప క్షణాల వీడియోను బీసీసీఐ షేర్ చేసింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈ వీడియోను చూసిన క్రికెట్ అభిమానులు.. 'నిజంగా ఈ వీడియో గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. కోచ్‌కు, జట్టుకు అభినందనలు' అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

బలమైన సంస్కృతిని పెంపొందించాలి — గంభీర్

లండన్: నిరంతర కృషి, పురోగతితో బలమైన జట్టు సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందని గంభీర్ సూచించాడు. 'జట్టులోకి ఎంతోమంది వస్తుంటారు.. పోతుంటారు. డ్రెస్సింగ్ రూమ్ సంస్కృతే అందరినీ ఆకర్షిస్తుందని ఐదో టెస్ట్ ముగిసిన అనంతరం ఆటగాళ్లతో గౌతీ అన్నాడు. 2-2తో సిరీస్ సమం చేయడం అద్భుతమని కొనియాడాడు. మన నైపుణ్యాలను సానబెట్టుకొంటూ సాగితే.. సుదీర్ఘకాలం ఆధిపత్యం ప్రదర్శించవచ్చన్నాడు. ఈ సందర్భంగా 'ఇంపాక్ట్ ప్లేయర్' అవార్డును సుందర్‌కు జడేజా అందజేశాడు.

అదే టెస్టు ఔన్నత్యం



ఐదురోజుల మ్యాచ్‌లు బోర్. 15 సెషన్లపాటు ఎవరు చూస్తారు..? పరుగులు చేయకుండా ఓవర్లకు ఓవర్లు తినేసే బ్యాటర్లు.. పసలేని బౌలింగ్..ఇలా.. టెస్టు క్రికెట్ మనుగడపై ఎన్నో ప్రశ్నలు, మరెన్నో సందేహాలు! మరోవైపు టెస్టులను నాలుగు రోజులకు కుదించాలన్న ఐసీసీ ఆలోచనలు.. కానీ, వీటన్నింటినీ భారత-ఇంగ్లండ్ సిరీస్ పటాపంచలు చేసింది. ఈ సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లూ చివరి రోజు దాకా హోరాహోరీగా సాగాయి. ఈ ప్రదర్శనతో టెస్టులపై ఉన్న సందేహాలన్నింటికీ దీటుగా జవాబు ఇచ్చినట్టయింది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

అసలు సిసలు టెస్టు క్రికెట్ మజాను ఇంగ్లండ్-భారత్ సిరీస్ రుచి చూపించింది. ఐదు టెస్టుల్లో ఇరుజట్ల ఆటగాళ్లు పోరాడిన తీరు అద్భుతం. ఇంగ్లండ్‌లో టెస్టులు అంటే ప్రతి అభిమానికి గుర్తుకు వచ్చేది ఆస్ట్రేలియాతో జరిగే యాషెస్ సిరీస్. కానీ, భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్ అంతకుమించి అనే విధంగా ఫ్యాన్స్‌ను ఆకట్టుకొంది. నాటకీయ పరిణామాల మధ్య 25 రోజులపాటు సాగిన సిరీస్.. టెస్టుల స్థాయిని అమాతంగా పెంచేసింది. ఈ ఇండో-ఇంగ్లండ్ సిరీస్ సరికొత్త శత్రుత్వానికి బీజం వేసింది. ఈ ఆరోగ్యకరమైన పోరు భవిష్యత్‌లో యాషెస్‌ను మించి ఎదగవచ్చన్నది విశ్లేషకుల అంచనా. సుదీర్ఘమైన షెడ్యూల్‌లో ఇరుజట్లూ కొదమసింహాల్లా తలపడ్డాయి. ప్రతి టెస్టూ ఐదోరోజు వరకూ సాగడం ఈ మధ్యకాలంలో అద్భుతమనే చెప్పుకోవాలి. సంధి దశలో ఉన్న టీమిండియా.. యువ కెప్టెన్ గిల్ నాయకత్వంలో ఆతిథ్య ఇంగ్లండ్‌కు కనీసపోటీ ఇస్తే గొప్పే అని సిరీస్ ఆరంభానికి ముందు భావించారు. కానీ, యువ భారత్ పోరాటంతో ఇంగ్లండ్ బిత్తరపోయింది. బుమ్రా దూరమైన రెండు టెస్టుల్లోనూ గిల్‌సేన నెగ్గడం గమనార్హం. ముఖ్యంగా భారత్ సమష్టిగా ఆడడం ఈ సిరీస్ ప్రత్యేకతగా భావించాలి. ఆఖరి టెస్టు వేదిక ఓవల్‌లో మ్యాచ్ ముగింపు చిరకాలం గుర్తుండిపోతుంది. గెలుపు దోబూచులాడుతున్న తరుణంలో.. తీవ్ర ఒత్తిడి మధ్య భారత్ అపూర్వ విజయంతో అభిమానుల హృదయం పులకరించింది. సిరీస్ సాగిన తీరును యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనించింది. ఫ్రాంచైజీ లీగుల జోరులో వైభవం కోల్పోతున్న టెస్టు క్రికెట్‌కు ఈ సిరీస్ సరికొత్త ఊపిరిలాదింది. ఇండో-ఇంగ్లండ్ సిరీస్‌లో గెలుపెవరిదో తేలలేదు.. కానీ విజయం సాధించింది మాత్రం క్రికెట్ మాతృక టెస్టు ఫార్మాటే!

ఎప్పటికీ ఎవర్‌గ్రీన్

"ఇంగ్లండ్‌తో సిరీస్ డ్రాగా ముగిసినా.. ఇరు జట్లు చేసిన పోరాటం అసాధారణం. మా ఈ ప్రదర్శన భారత టెస్టు క్రికెట్‌లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. టెస్టు క్రికెట్ మజా ఏంటన్నది ఈ సిరీస్ రుచి చూపించింది. ఇకనుంచి ఎవరు కూడా టెస్టు మ్యాచ్‌లు బోర్ అని అనరన్న నమ్మకముంది. సంప్రదాయ ఫార్మాట్ ఎప్పటికీ ఎవర్‌గ్రీన్.
- కేఎల్ రాహుల్

ఇప్పుడు కూడా 4 రోజులంటారా..?

ఐసీసీ.. ఈ మ్యాచ్ జరిగిన విధానాన్ని చూసిన తర్వాత కూడా మీరు టెస్టులను నాలుగు రోజులకు కుదించాలనుకొంటున్నారా..? - హెర్షల్ గిబ్స్"

● మెరిసిన సుహాస్, నిత్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన సుహాస్ ప్రీతమ్, శ్రీనిత్య పతకాలు నెగ్గారు. అహ్మదాబాద్‌లో మంగళవారం జరిగిన 200మీ. బ్యాక్‌స్ట్రోక్‌లో సుహాస్‌కు రజతం, 400మీ. మెడ్లేలో నిత్యకు కాంస్యం దక్కాయి.

'చెన్నై గ్రాండ్ మాస్టర్స్'కు అర్జున్, హారిక

చెన్నై: గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసికి కఠిన పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. బుధవారం నుంచి రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో 9 రౌండ్లపాటు సాగే ఈ టోర్నీలో 19 మంది జీఎంలు పాల్గొననున్నారు. చాలెంజర్స్ విభాగంలో ద్రోణవల్లి హారిక, వైశాలి ఆడనున్నారు.

● బాక్సింగ్‌లో మరో ఏడు పతకాలు ఖాయం

బ్యాంకాక్: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మరో ఏడుగురు భారత మహిళా బాక్సర్లు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి పతకాలు ఖరారు చేసుకున్నారు. మంగళవారం జరిగిన అండర్-19 పోటీల్లో యషిక (51 కిలోలు), నిష (54 కి), ముస్కాన్ (57 కి), విని (60 కి), నిషిక (65 కి), ఆకాంక్ష (70 కి), ఆర్తి కుమారి (75 కి) సెమీస్‌కు చేరారు.

అబద్ధాన్ని నిజం చేసేందుకు హరీశ్ తాపత్రయం

» మామ కళ్లలో ఆనందం కోసం పాట్లు: మంత్రి పొంగులేటి



కూసుమంచి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై అబద్ధాలను నిజం చేయడానికి బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టీ హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు తానే కర్త, కర్మ, క్రియ అని మాజీ సీఎం కేసీఆర్ పేరు 33 సార్లు, మామ కళ్లలో ఆనందం చూసేందుకు తాపత్రయ పడ్డ హరీశ్‌రావు పేరు 20 సార్లు కమిషన్ నివేదికలో ప్రస్తావించారన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. కమిషన్ నివేదిక వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ నేతలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఎద్దేవా చేశారు. వారు అవాకులు, చవాకులు పేలుతున్నారని అన్నారు. రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం ఉందని, కేంద్రం నుంచి 11 అనుమతులున్నాయని చెబుతున్నవని అబద్ధాలేనన్న పొంగులేటి.. అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్ రూ.లక్షల కోట్లు దోచుకున్నారని, అధికారంలోకి వస్తే అవకతవకలపై విచారిస్తామని చెప్పామని గుర్తు చేశారు. జస్టిస్ ఘోష్ నివేదికపై సీనియర్ ఐఏఎస్‌ల కమిటీ ఇచ్చిన ముఖ్యాంశాలను అసెంబ్లీలో పెట్టి పూర్తిస్థాయిలో చర్చించడంతోపాటు రాష్ట్ర, దేశ ప్రజలకు తెలియజేస్తామని పొంగులేటి అన్నారు. అసెంబ్లీలో విపక్ష పార్టీల అభిప్రాయాలను తెలుసుకుని.. అనంతరం చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

బీసీ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వంతోనే: ఉద్యోగుల జేఏసీ

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం కోసం కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ఉద్యోగుల జేఏసీ మద్దతు తెలిపింది. బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వం చేస్తున్న కృషిలో తామూ భాగస్వాములం అవుతున్నామని ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో 56.33% ఉన్న బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడం సహజ న్యాయమని వారు అన్నారు. సామాజిక న్యాయం ద్వారా సమాజంలో శాంతి సామరస్యత ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘం నేతలు ఎ. సత్యనారాయణ, నర్సింహారెడ్డి, నజీర్, యాదగిరి, శ్రీకాంత్, రాజీవ్ రెడ్డి, ఎండీ ఖాజా తదితరులు కూడా బీసీ బిల్లుపై ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

11న ప్రభుత్వ పింఛన్‌దారుల చలో హైదరాబాద్

ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పింఛన్‌దారుల సంఘాల సమన్వయ కమిటీ ఆరోపించింది. కమిటీ పిలుపు మేరకు ఈ నెల 11న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా చేపడుతున్నామని కమిటీ అధ్యక్షుడు సీహెచ్ విద్యాసాగర్, కార్యదర్శి కె. నెహ్రూ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సమస్యల పరిష్కారించాలని వారు డిమాండ్ చేశారు.

ఝార్ఖండ్ సీఎంకు కేసీఆర్ ఫోన్లో పరామర్శ

» శిబూ సోరెన్ మృతి పట్ల సంతాపం

ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫోన్లో పరామర్శించారు. ఆయన తండ్రి, ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఈ సందర్భంగా హేమంత్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా 2001లో కరీంనగర్‌లో నిర్వహించిన మొదటి భారీ బహిరంగ సభకు శిబూ సోరెన్ హాజరయిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. కాగా, బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, కోవ లక్ష్మీ సహా పలువురు పార్టీ నేతలు ఝార్ఖండ్ వెళ్లి శిబూ సోరెన్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

మేడిగడ్డ ఎందుకు కూలిందో చెప్పలేదు

» మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆది శ్రీనివాస్ ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి అనేక వాదనలు వినిపిస్తున్న హరీశ్‌రావు.. మేడిగడ్డ బ్యారేజీ ఎందుకు కుంగిందన్న దానిపై సమాధానం ఎందుకు చెప్పట్లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్ గొంతు చించుకోవాల్సిన అవసరం లేదని, కేసీఆర్‌ను శాసనసభకు తీసుకువచ్చి ఆయనతోనే మాట్లాడించవచ్చని అన్నారు. మేడిగడ్డ ఎందుకు కుంగిందో ఆయనతోనే వివరణ ఇప్పించవచ్చని చెప్పారు. కాళేశ్వరం నివేదికతో కేసీఆర్, హరీశ్ పాపం.. ఈటల రాజేందర్ నిర్లక్ష్యం బయటపడ్డాయని అన్నారు.

బీఆర్ఎస్ గుర్తింపే ముందు ఈసీ రద్దు చేయాలి

» హామీలు అమలు చేయని పార్టీల్లో బీఆర్ఎస్ ఫస్ట్:మల్లు రవి

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు అమలు చేయని పార్టీల్లో దేశంలోనే బీఆర్ఎస్‌ది అగ్రస్థానం అని కాంగ్రెస్ ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్ మల్లు రవి ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని పార్టీల గుర్తింపును రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) కోరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ చర్యలు తీసుకుంటే ముందు బీఆర్ఎస్ పార్టీ గుర్తింపునే రద్దు చేయాలన్నారు. రైతు రుణమాఫీ, నీళ్లు, నిధులు, నియామకాలు, యువతకు ఉద్యోగాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కేజీ టు పీజీ విద్య, దళితులకు మూడెకరాల భూమి.. తదితర పలు హామీలను బీఆర్ఎస్ అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని హామీలు అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే 90 శాతం హామీలు అమలు చేశామన్న మల్లు రవి.. వచ్చే మూడేళ్లలో మిగిలిన హామీలతోపాటు మేనిఫెస్టోలో లేని అంశాలనూ చేసి చూపుతామన్నారు.

మామునూరు పనులను వేగవంతం చేయండి

కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు వరంగల్ ఎంపీ, ఎమ్మెల్యేల వినతి

న్యూఢిల్లీ, హనుమకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మామునూరు విమానాశ్రయ పనులను వేగవంతం చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి మామునూరు విమానాశ్రయానికి ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పనులు వేగవంతం చేయాలని, పెద్ద విమానాల రాకపోకలకు వీలుగా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఎంపీ, ఎమ్మెల్యేల విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు.. రోడ్డు కనెక్టివిటీ, మౌలిక వసతుల కల్పన, భూసేకరణ అనంతరం నిర్మాణం పూర్తవ్వగానే విమాన రాకపోకలు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు.

సంజీవనగర్ పాఠశాలలో బాత్రూం నిర్మాణానికి 7 లక్షలు మంజూరు

» ఒకట్రెండు రోజుల్లో పనులు ప్రారంభం

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని సంజీవనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాత్రూంల నిర్మాణానికి సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య రూ.7 లక్షలు మంజూరు చేశారు. విద్యార్థుల ఇబ్బందులపై '113 మంది విద్యార్థులకు ఒక్కటే బాత్రూం' అనే శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి డీఈవో ఎస్. వెంకటేశ్వర్లు, ఎంఈవో విద్యాసాగర్ పాఠశాలను పరిశీలించారు. తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) డీఈ రాజు, ఏఈ రాజమల్లయ్యతో కలిసి బాత్రూంల స్థలాన్ని పరిశీలించారు. రూ.3.5 లక్షల చొప్పున రెండు బాత్రూంలకు మొత్తం రూ.7 లక్షల నిధులు అవసరమవుతాయని ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. దీంతో ఆ మేరకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ఒకట్రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.



జూబ్లీహిల్స్‌లోని కదారీ ఆర్ట్ గ్యాలరీలో అనన్య నాదెళ్ల పెయింటింగ్‌లను పరిశీలిస్తున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ

అద్భుతం...అనన్య సామాన్యం!

» చిన్న వయసులోనే కాన్వాస్‌పై అద్భుత చిత్రాలను ఆవిష్కరించిన అనన్య నాదెళ్ల

» ప్రదర్శనను ప్రారంభించి, ఆశీర్వదించిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ

» వాస్తవికతను ప్రతిబింబించేలా చిత్రాలు: మురళీమోహన్

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చూసింది.. చూసినట్టుగా బొమ్మ గీయడం అతి తక్కువ మందికే సాధ్యం. అందులోనూ ఏడో తరగతి చదివే అమ్మాయి.. తాను చూసిన దానికి తనదైన సృజనను జోడించి కాన్వాస్‌పై చిత్రంగా మార్చడం అద్భుతమే. అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది అనన్య నాదెళ్ల. ధ్యాన ముద్రలో ఉన్న శివయ్య, శక్తిస్వరూపిణి (పార్వతీ మాత) ఆనంద తాండవాన్ని ముక్కంటి వీక్షించడం, రామకోటి రాసుకుంటున్న తాతమ్మ, భాగ్యనగర కీర్తి ప్రతీక చార్మినార్ వద్ద సందడి.. ఇలా ఆమె చేతి నుంచి జాలువారిన 24 చిత్తరువులు ఆహూతులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. జూబ్లీహిల్స్‌లోని కదరి ఆర్ట్ గ్యాలరీలో అనన్య పెయింటింగ్స్‌తో మంగళవారం ప్రదర్శన ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు సాగే ప్రదర్శన ప్రారంభోత్సవానికి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, సినీనటుడు మురళీమోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ప్రదర్శనలోని చిత్రాలను ఆసాంతం తిలకించిన వేమూరి రాధాకృష్ణ.. మరింత వృద్ధిలోకి రావాలని అనన్యను ఆశీర్వదించారు. "చిన్న అమ్మాయి పెయింటింగ్ ఎగ్జిబిషన్ అంటే.. ఏదో చిన్నగా ఉంటుందిలే అనుకున్నా. కానీ, ఇంత అద్భుతంగా ఉంటుందని కలలోనూ అనుకోలేదు. ప్రతి చిత్రమూ వాస్తవికతను ప్రతిబింబించే రీతిలో ఉంది" అని మురళీమోహన్ ప్రశంసించారు. ప్రముఖ చిత్రకారుడు, అనన్య గురువు ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ రెండేళ్లుగా అనన్య శిక్షణ పొందుతోందని తెలిపారు. ఎక్రిలిక్ శైలిలో తాను ఈ చిత్రాలను గీశానని, అబ్‌స్ట్రాక్ట్, చార్‌కోల్ మాధ్యమాలను వినియోగించానని అనన్య నాదెళ్ల తెలిపారు. తనకు స్వతహాగా దేవతల చిత్రాలను గీయడమంటే ఆసక్తి అని వెల్లడించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి పత్రిక వైస్ ప్రెసిడెంట్ శృతి కీర్తి, ఏబీఎన్ చానెల్ డైరెక్టర్ అనూష, పారిశ్రామిక వేత్తలు బొల్లినేని కృష్ణయ్య, చుక్కపల్లి సురేశ్, అనన్య తల్లిదండ్రులు సందీప్, కావ్య, తాతయ్య నాన్నమ్మలు నాదెళ్ల సుబ్బారావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం నివేదిక.. కాంగ్రెస్ సర్కారు కుట్ర!

రాజకీయ దురుద్దేశంతో ఏర్పాటు చేసిన కమిషన్ల నివేదికలు న్యాయస్థానాల్లో నిలబడవు

» కేసీఆర్‌ను హింసించాలన్నదే ఉద్దేశం

» కమిషన్ ఒకవైపే విచారించి నివేదిక ఇచ్చినట్టు ఉంది

» కాళేశ్వరానికి అనుమతుల్లేవంటే.. కేంద్రాన్ని తప్పుబట్టినట్టే: హరీశ్‌రావు


హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కార్ కుట్రలో భాగంగానే కాళేశ్వరం కమిషన్ నివేదికను ముందుకు తెచ్చిందని.. ఏదో ఒకరకంగా కేసీఆర్‌ను బద్నాం చేయడమే వారి లక్ష్యంగా కనబడుతోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రాజకీయ దురుద్దేశంతో ఏర్పాటు చేసిన కమిటీల నివేదికలేవీ న్యాయస్థానాల్లో నిలబడలేదన్నారు. గతంలో ఇందిరాగాంధీ, చంద్రబాబులపై ఇచ్చిన కమిషన్ నివేదికలు కూడా నిలబడలేదని గుర్తు చేశారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. కమిషన్ వక్రీకరణలు, వాస్తవాలు' అనే అంశంపై మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "కేసీఆర్‌ను హింసించాలన్నదే రేవంత్‌రెడ్డి ఉద్దేశం. అందుకే టీవీ సీరియళ్ల మాదిరిగా కాళేశ్వరం, విద్యుత్ అంటూ వరుస కమిషన్లను ముందుకుతెచ్చి ఏదోచేయాలని చూస్తున్నారు. కుట్రపూరితంగానే కమిషన్ విచారణ జరిగినట్టు కనబడుతోంది. 665 పేజీల నివేదికలో కొన్ని అంశాలంటూ బయటపెట్టారు. అవి నిజంగా ఆ నివేదికలో ఉన్నాయా, లేదా అన్న అనుమానం కలుగుతోంది. ఒకవేళ వారు చెప్పిందే నిజమైతే.. కమిషన్ కాంగ్రెస్ సర్కారుకు అనుకూలంగా ఒకవైపే చూసి, విని, వారివైపే నిలబడి నివేదిక ఇచ్చిందన్న అనుమానం కలుగుతోంది. స్థానిక ఎన్నికల నేపథ్యంలో తప్పుడు ప్రచారానికి తెరతీశారు. దురుద్దేశంతో కేవలం 60 పేజీలను బయటపెట్టారు. మొత్తం 665 పేజీల్లో అంశాలను అసెంబ్లీలో పెట్టాలి. గట్టిగా సమాధానం చెబుతాం" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

అనుమతుల్లేవంటే కేంద్రాన్ని తప్పుబట్టినట్లే..

కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు లేవనడం చూస్తే కేంద్ర ప్రభుత్వాన్నే తప్పుబట్టినట్లుగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రహస్యాలేమీ లేవని, అన్ని అంశాలు డీపీఆర్‌లో ఉన్నాయని చెప్పారు. పదకొండు కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు ప్రాజెక్టును ఆమోదించాయని.. కమిషన్ ఆ ఏజెన్సీలను తప్పుబడుతోందా, ఎవరిని తప్పుబడుతుందని ప్రశ్నించారు. "ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు హైడ్రాలజీ క్లియరెన్స్ ఉందంటూ నాటి కేంద్ర మంత్రి ఉమాభారతి తెలంగాణ ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొన్నారని కమిషన్ నివేదికలో ప్రస్తావించారు. కానీ అదే లేఖలోని మూడో పేజీలో 160 టీఎంసీల నీటి లభ్యత ఉండకపోవచ్చని కేంద్ర మంత్రి స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని కమిషన్ గుర్తించలేదా? ప్రభుత్వం కావాలనే దాచిపెట్టిందా?" అని హరీశ్‌రావు నిలదీశారు.

నీటి లభ్యత లేదనే.. మేడిగడ్డకు మార్పాం

తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని, 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ (గరిష్ఠ నీటి మట్టం)కన్నా తక్కువ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే నిరుపయోగం అవుతుందని సీడబ్ల్యూసీ పలు సందర్భాల్లో హెచ్చరించిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. "152 మీటర్ల ఎత్తుకు ఒప్పుకోబోమని, 148 మీటర్ల ఎత్తు అయితే అంగీకరిస్తామని అప్పట్లో మహారాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. దానికితోడు ప్రతిపాదిత ప్రాంతం అభయారణ్యంలో ఉండటంతో అనుమతులు క్లిష్టతరం. కాలయాపన తప్ప మరోటి లేదు. దీనికి అనుగుణంగానే సీడబ్ల్యూసీకి సమర్పించిన కాళేశ్వరం డీపీఆర్‌లో తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని స్పష్టంగా తెలిపాం. దానిని సీడబ్ల్యూసీ ఆమోదించింది. 160 టీఎంసీల నీటిలభ్యత లేదనే విషయం తప్పే అయితే ఆ డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ ఆమోదించి, అనుమతులు ఇవ్వదు కదా" అని ప్రశ్నించారు. కాళేశ్వరం డీపీఆర్ ఇప్పటికీ పబ్లిక్ డొమైన్‌లో ఉందని, పరిశీలించాలని సూచించారు.



తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న హరీశ్‌రావు

రిటైర్డ్ ఇంజనీర్లు వ్యతిరేకించలేదు

మేడిగడ్డను రిటైర్డ్ ఇంజనీర్లు వ్యతిరేకించారని చెప్పడం వాస్తవం కాదని, ఐదుగురు నిపుణులతో వేసిన కమిటీ మేడిగడ్డను సూచించిందని హరీశ్‌రావు చెప్పారు. "మేడిగడ్డ- మిడ్‌మానేరు మార్గాన్ని మార్చి.. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి బ్యారేజీకి గోదావరి మార్గంలో నీటిని తరలించాలని ఇంజనీర్లు సూచించారు. ఈ క్రమంలోనే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఏర్పాటుచేసి ఎల్లంపల్లికి అక్కడి నుంచి మిడ్‌మానేరుకు నీటిని తరలించాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుందని నిపుణుల కమిటీ కమిషన్‌కు కూడా చెప్పింది" అని వివరించారు.

కేసీఆర్ సొంత నిర్ణయమేమీ కాదు..

కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కేసీఆర్ ఒక్కరి నిర్ణయమనే ఆరోపణ సరికాదని, ఆ ప్రాజెక్టుకు క్యాబినెట్, శాసనసభ ఆమోదం ఉన్నాయని హరీశ్‌రావు చెప్పారు. 2016 మార్చి 10న గవర్నర్ ప్రసంగంలో, 2016 ఏప్రిల్ 16న నాటి ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ప్రాజెక్టుల రీఇంజనీరింగ్ గురించి స్పష్టంగా ఉందని.. వాటికి క్యాబినెట్, శాసనసభ ఆమోదం తెలిపాయని గుర్తుచేశారు. 2018 మే 27న, 2021 ఆగస్టు 1న మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణాన్ని కేబినెట్ ఆమోదించిందని.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకూ ఆమోదం ఉందని చెప్పారు. అప్పటి క్యాబినెట్‌లోని ఇద్దరు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నారని, వారిని అడిగి తెలుసుకోవాలని సూచించారు. అప్పటి క్యాబినెట్‌లో చర్చించిన అంశాలతో 30 పేజీల కాపీ ఉంటుందని, ఆ సమాచారం ఇవ్వాలని సీఎస్‌ను కోరినా స్పందన రాలేదని హరీశ్‌రావు చెప్పారు. 2016 మార్చి 31న నాటి సీఎం కేసీఆర్ శాసనసభలో రీఇంజనీరింగ్, కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల్లో కలిపి 225 పిల్లర్లు ఉన్నాయని, అందులో మేడిగడ్డలో కేవలం రెండు పిల్లర్లు కుంగితే కాళేశ్వరం ప్రాజెక్టే కుప్పకూలిందంటూ కాంగ్రెస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

కేసీఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోతారు

కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపుహౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1,531 కిలోమీటర్ల గ్రావిటీ కాలువలు, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల నిల్వ సామర్థ్యం, 530 మీటర్ల ఎత్తుకు నీటి ఎత్తిపోతలు, 240 టీఎంసీల నీటి వినియోగమన్న విషయాన్ని కాంగ్రెస్ నేతలు తెలుసుకోవాలన్నారు. వందేళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ కాళేశ్వరం నిర్మించారని, గోదావరి నదిపై బ్యారేజీ కట్టిన సర్ ఆర్థర్ కాటన్‌లా కేసీఆర్ ఇక్కడి ప్రజల గుండెల్లో దేవుడిలా నిలిచిపోతారని పేర్కొన్నారు.

కొడంగల్ ఎత్తిపోతలకు అనుమతి ఉందా?

సీఎం రేవంత్ నియోజకవర్గంలోని కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఏ అనుమతి ఉందని రేవంత్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టారో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టుకు ఒక్క అనుమతి అయినా ఉందా చూపించాలని మంత్రి ఉత్తమ్‌ను ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండానే పనులు ప్రారంభించారని, ఎలాంటి అనుమతులు లేకుండానే బిల్లులు కూడా చెల్లించిన రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌లపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు నేడు ఢిల్లీలో సమరం

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టనుంది. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రితోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్‌లు, బీసీ సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, వివిధ జిల్లాల కాంగ్రెస్ నాయకులు మంగళవారం సాయంత్రానికి ఢిల్లీ చేరుకున్నారు. ధర్నా ప్రాంతాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం రాత్రి పరిశీలించారు. ధర్నాకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతోపాటు ఇండియా కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, వామపక్షాలు, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీల నాయకులు హాజరై తమ సంఘీభావం తెలపనున్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుస్తామని కాంగ్రెస్ ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్ మల్లు రవి తెలిపారు. ఇందుకోసం రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరామన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రపతి వద్ద రెండు బిల్లులు, ఒక ఆర్డినెన్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఆమోదించాల్సిందిగా కోరామని చెప్పారు.

బీసీ రిజర్వేషన్లపై వాయిదా తీర్మానాల తిరస్కృతి..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న విషయంపై బుధవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాలను స్పీకర్ ఓం బిర్లా తిరస్కరించారు. దీంతో బుధ, గురువారాల్లో కూడా ఈ తీర్మానాలను ప్రవేశపెట్టి చర్చకు పట్టుబడతామని ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇక బుధవారం జంతర్‌మంతర్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు హాజరై మద్దతు తెలపాలని కోరుతూ ఇండియా కూటమికి చెందిన 200 మంది ఎంపీలకు కాంగ్రెస్ ఎంపీలు లేఖలు అందజేశారు. కాగా మంగళవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ధర్నా ఏర్పాట్లపై పార్టీ నేతలతో సమీక్షించారు. అనంతరం తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా వివాహ విందుకు హాజరయ్యారు.

మారూబేనీ పారిశ్రామికవాడకు వేయి ఎకరాలు!



పారిశ్రామికవాడ కోసం గుర్తించిన భూములివే

» మ్యాపులు సిద్ధం చేస్తున్న అధికారులు

» ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ఏరో స్పేస్‌లో జపాన్ కంపెనీ పెట్టుబడులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/యాచారం)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులకు సంబంధించి త్వరలోనే తొలి అడుగు పడనుంది. ఫ్యూచర్ సిటీలో తొలి పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ప్రభుత్వం చకచక సన్నాహాలు చేస్తోంది. జపాన్ వ్యాపార దిగ్గజం 'మారుబేనీ సంస్థ ఏర్పాటు చేసే అధునాతన పారిశ్రామిక వాడకు భూకేటాయింపు కోసం ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. భూ కేటాయింపుకు సంబంధించి ఇటీవల కంపెనీ ప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో భేటీ అయ్యారు. గత ఏప్రిల్‌లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం జపాన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. పర్యటన తొలి రోజే మారూబేని సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. భవిష్య నగరంలో రూ.1000 కోట్లతో పారిశ్రామికవాడ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. అయితే, ప్రస్తుతం మారుబేని సంస్థ ఫ్యూచర్ సిటీలో ఇంకా భారీ మొత్తాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతోంది. సంస్థ తొలుత 600 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తానంది. ఇప్పుడు మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా వెయ్యి ఎకరాలు కావాలంటోంది. దాంతో అధికారులు కసరత్తు మొదలెట్టారు. యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ధ గ్రామాల్లో ఇప్పటికే సేకరించిన 1100 ఎకరాల భూములను ఇటీవల పరిశీలించారు. ఇందులోని వేయి ఎకరాలను మారూబేనీకి కేటాయించాలని నిర్ణయించారు. గత నాలుగు రోజులుగా ఈ భూములను సర్వే చేసి మ్యాపులను సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే పారిశ్రామికవాడకు శంకుస్థాపన చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మారూబేనీ సంస్థ జపాన్‌లోని ఏడు అతిపెద్ద కంపెనీల్లో ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా 65 దేశాల్లో వివిధ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయోత్పత్తులు, లోహాలు, గనులు, రసాయనాలు, ఇంధన ఉత్పత్తులు, స్థిరాస్తి, మౌలిక సదుపాయాల కల్పన, విమానాలు, మొబిలిటీ రంగాల్లో అగ్రగామిగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ కంపెనీలో 50 వేల మందికి పైగా పని చేస్తున్నారు. ఫ్యూచర్ సిటీలోని పారిశ్రామిక వాడలో ఈ సంస్థ ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ఏరో స్పేస్, రక్షణ, ప్రెసిషన్ ఇంజనీరింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టనుంది. ఫ్యూచర్ సిటీలో మొట్టమొదటి అభివృద్ధి కార్యక్రమం మారూబేనీ పారిశ్రామిక వాడేనని గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ పారిశ్రామిక వాడ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 30 వేల మందికి ఉద్యోగవకాశాలు లభిస్తాయి. ఈ పారిశ్రామికవాడ నుంచి ఏటా రూ.5 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా.

ఢిల్లీలో రేవంత్ ధర్నా ఓ డ్రామా

» బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ముందుగా.. విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు కల్పించండి

» హామీలు నెరవేర్చకుంటే అనర్హత వేటేయాలి

» కాళేశ్వరం నివేదికను బయట పెట్టాలి: కేటీఆర్



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల పేరుతో చేసే ధర్నా ఓ డ్రామా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందు విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ రిజర్వేషన్లు కేంద్రం చేతిలో పనని చెబుతున్న రేవంత్.. ఆయన చేతిలోనే ఉన్న మిగిలిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా ఢిల్లీలో డ్రామాలు, ఓట్ల కోసం డైలాగులు ఆపి.. బీసీలకు ఇచ్చిన మిగిలిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రాన్ని సాకుగా చూపి కాలయాపన చేస్తామంటే, స్థానిక ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మంగళవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యాలయంలో ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలతో కేటీఆర్ భేటీ అయ్యారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, బాల్క సుమన్ ఉన్నారు. అనంతరం ఈసీఐ కార్యాలయం ఎదుట కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. దేశ ప్రజల్లో ఈవీఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయని, మళ్లీ బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతోనే బ్యాలెట్ విధానానికి శ్రీకారం చుట్టాలని కోరారు. బిహార్‌లో లోపాలను అరికట్టకపోతే, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ ఇదే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఆ అభ్యర్థి సభ్యత్వం రద్దు చేయాలని, వారు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్టు కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి గెలిచిన తర్వాత హామీలన్నీ గాలికి వదిలేసిందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక అంతా ట్రాష్, గ్యాస్ అని కేటీఆర్ కొట్టిపారేశారు. 665 పేజీల నివేదికను 60 పేజీలకు కుదించడంతోనే కాంగ్రెస్ డ్రామా ప్రజలకు అర్థమైపోయిందన్నారు. రేవంత్‌కు దమ్ముంటే.. వెంటనే పూర్తి నివేదికను బహిర్గతం చేయాలని, అసెంబ్లీలో చర్చకు పెట్టి మైక్ కట్ చేయకుండా తమ వాదన వినిపించే అవకాశం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ వాసులకు కేసీఆర్ అందించిన ఉచిత మంచినీటి పథకాన్ని ముట్టుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి మసేనని కేటీఆర్ ఎక్స్ వేదికగా కేటీఆర్ హెచ్చరించారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణులతో ఇంజనీరింగ్ అధికారులు

'మేడిగడ్డ'లో హైడ్రలాజికల్ పరీక్షలు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీలో హైడ్రలాజికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. బ్యారేజీ వద్ద ప్రస్తుత పరిస్థితులపై పుణెకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రిసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణుల బృందం పరిశీలించింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తుది నివేదికలో పలు రకాల పరీక్షలు నిర్వహించాలని సూచించగా ప్రభుత్వం ఆ బాధ్యతలను సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే హైడ్రలాజికల్ విభాగానికి చెందిన ప్రసాద్ కున్‌జీర్, హర్ష చౌదరి నేతృత్వంలో నిపుణులు మంగళవారం సందర్శించారు. బ్యారేజీ వద్ద వరద ఉధృతి, పరీక్షలకు ఏయే బ్లాకులు అనుకూలమో పరిశీలించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలనూ బుధవారం పరిశీలించనున్నారు.

ఆగస్టులో యూరియా వినియోగం ఎక్కువ

- పాత బకాయిలతోపాటు ఈనెల కోటానూ ఇవ్వాలి
- కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టు నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకొని తగినంత యూరియా సరఫరా చేయాలని కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలకు యూరియాను పైపాటుగా వాడుతారని, ఇలాంటి పరిస్థితుల్లో యూరియా సరఫరాలో ఎలాంటి ఆలస్యం తలెత్తినా పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాత బకాయిలతో పాటు ఈనెల కోటా యూరియాను కూడా సరఫరా చేయాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.

'ఆది కర్మయోగి అభియాన్'పై అధికారులకు రాష్ట్ర స్థాయి శిక్షణ

- హైదరాబాద్‌లో 4 రోజులపాటు నిర్వహణ

గిరిజన సంక్షేమాన్ని మరింత సమర్థంగా నిర్వహించేందుకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'ఆది కర్మయోగి అభియాన్' పథకం అమలుపై అధికారులకు రాష్ట్ర స్థాయిలో నాలుగు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించింది. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన 77 మంది అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు.

పోలీస్ కంప్లైంట్ అథారిటీ చైర్మన్‌తో డీజీపీ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన విశ్రాంత జస్టిస్ బి.శివశంకర్‌రావును హోంశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ డా.జితేందర్, అదనపు డీజీపీ మహేశ్ భగవత్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం వారి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో అథారిటీ చైర్మన్‌కు, సభ్యులకు పోలీస్ ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

నీటి పారుదలలో పదోన్నతులు

- 8 మంది ఎస్ఈలకు సీఈలుగా ప్రమోషన్

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదలశాఖలో 8 మంది ఇంజనీర్లకు పదోన్నతుల లభించాయి. ఆ శాఖలో 3 దశాబ్దాల్లో అధికారులకు పదోన్నతి లభించడం ఇదే ప్రథమం. ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో 8 మంది ఎస్ఈలకు చీఫ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించడంతోపాటు పోస్టింగ్‌నిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం జీవో జారీ చేశారు. మహబూబ్‌నగర్ చీఫ్ ఇంజనీర్(సీఈ)గా ఎ.సత్యనారాయణరెడ్డి.. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈగా ఎం.సత్యనారాయణరెడ్డి, ములుగు సీఈగా ఎస్.కుమారస్వామి, వనపర్తి సీఈగా పి.వి.నాగేందర్, గజ్వేల్ సీఈగా వి.శ్రీనివాస్, కొత్తగూడెం సీఈగా ఎ.శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల సీఈగా ఎ.సత్యరాజచంద్ర, వరంగల్ సీఈగా కె.వెంకటేశ్వర్లులను నియమించారు.

కేంద్ర సర్వీసులకు అలగు వర్షిణి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అలగు వర్షిణి కేంద్ర సర్వీసులకు వెళ్లనున్నారు. ఈ మేరకు ఆమెను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శిగా నియమిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ(డీవోపీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. సెంట్రల్ స్టాఫింగ్ స్కీమ్ కింద ఆమెను కేంద్ర సర్వీసుల్లోకి తీసుకుంటున్నామని, వెంటనే ఆమెను రిలీవ్ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని డీఓపీటీ మంగళవారం తన ఉత్తర్వుల్లో ఆదేశించింది. కేంద్ర సర్వీసుల్లో ఆమె నాలుగేళ్ల పాటు ఉంటారని తెలిపింది.

'అప్పు'డే సగం దాటింది!

- రాష్ట్ర బడ్జెట్‌లో రుణసేకరణ అంచనా రూ.54,009 కోట్లు
- నాలుగు నెలల్లో చేసిన అప్పు రూ.30,900 కోట్లు
- మంగళవారం ఒక్కరోజే రూ.5,000 కోట్లు సేకరణ
- అంచనా మేరకు అందని రాబడులు, పథకాలకు నిధులు సర్దాల్సి రావడమే కారణం!
- రుణాల్లో ప్రభుత్వం చేతికందినది రూ.20,266 కోట్లు
- మిగతా సొమ్ము పాత అప్పుల అసలు, వడ్డీల కింద సంబంధిత ఆర్థిక సంస్థలకు బదలాయింపు

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసుకున్న రుణాల సేకరణలో అప్పుడే సగం దాటిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.54,009 కోట్ల రుణాలు తీసుకోవాలని ప్రతిపాదించగా.. నాలుగు నెలల్లోనే రూ.30,900 కోట్ల మేర సేకరించింది. రాబడులు అంచనాల మేరకు లేకపోవడం, వివిధ పథకాలకు నిధులను సర్దాల్సి రావడం, పాత అప్పులకు అసలు, వడ్డీలు చెల్లించాల్సి ఉండటం నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో రుణ సేకరణ చేయాల్సి వస్తోందని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.64,539 కోట్ల మార్కెట్ రుణాలను తీసుకోవాలని యోచించింది. కానీ కేంద్ర ప్రభుత్వం రూ.54,009 కోట్ల రుణాలకు మాత్రమే అనుమతించింది. సాధారణంగా ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసుకున్న రుణాల్లో ప్రతినెలా కొంత చొప్పున సేకరిస్తూ ఉంటుంది. అవసరానికి తగినట్లుగా ఒక నెలలో ఎక్కువగా, మరో నెలలో తక్కువగా తీసుకుంటుంది. గరిష్టంగా ఒక నెలలో రూ.5,000 కోట్ల వరకు తీసుకునేది. అయితే ఈసారి ప్రతినెలా రుణ సేకరణ భారీగానే ఉంటోంది. ఏప్రిల్‌లో రూ.4,400 కోట్లు, మేలో రూ.4,500 కోట్లు, జూన్‌లో రూ.8,500 కోట్లు, జూలైలో రూ.8,500 కోట్ల చొప్పున రుణం తీసుకుంది. ఆగస్టులో మంగళవారం (5వ తేదీన) రూ.5000 కోట్ల అప్పు తీసుకుంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రూ.30,900 కోట్ల రుణాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నేరుగా జూన్ ఆఖరు నాటికి అందినది రూ.20,266 కోట్లే. మిగతా సొమ్మును పాత అప్పుల అసలు, వడ్డీల కింద ఆర్‌బీఐ మినహాయించి.. సంబంధిత ఆర్థిక సంస్థలకు బదలాయించింది.

మామ, అల్లుళ్లు మేడిగడ్డను కుంగబెట్టారు

- వారిది రూ.లక్ష కోట్ల దుర్మార్గం
- అలాంటి వారికి మాట్లాడే హక్కు లేదు
- తప్పులు ఒప్పుకొని ప్రజలకు క్షమాపణలు చెప్పండి: మంత్రి ఉత్తమ్




హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గం ఆమోదం లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి కేసీఆర్, హరీశ్‌లు తెలంగాణ ప్రజలను మోసం చేశారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మామ, అల్లుళ్ల సంతకాలు చేసి రూ.లక్ష కోట్ల దుర్మార్గానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. అలాంటి నాయకులకు మాట్లాడే హక్కు లేదన్నారు. వారు చేసిన పాపాలకు నాలుగు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పిదాలను సమర్థించుకుంటూ న్యాయ వ్యవస్థనే అవమానిస్తారా? అని నిలదీశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలంటే బీఆర్ఎస్‌కు చులకన భావమని.. చట్టసభలు, న్యాయస్థానాలంటే కూడా గౌరవం లేదని ఆరోపించారు. 'న్యాయ వ్యవస్థ మీద నమ్మకం లేదు. సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలో నియమించిన కమిషన్ అంటే కూడా లెక్కలేదు. ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఇప్పటికీ వాళ్లలో మార్పు రాలేదు. తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పుకోవాలనే సోయి కూడా లేకపోయింది' అని ఉత్తమ్ ఆక్షేపించారు. మేడిగడ్డను కుంగబెట్టిన దుర్మార్గులు ఇప్పుడు ఏకంగా జస్టిస్ పీసీ ఘోష్‌ను అవమానిస్తున్నారా? అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం ఎన్ని అవకతవకలకు పాల్పడిందో.. ఎన్ని అక్రమాలకు పాల్పడిందో జ్యుడీషియల్ కమిషన్ విచారణలో తేటతెల్లమైందని చెప్పారు. కేసీఆర్, హరీశ్‌రావుల బండారం బట్టబయలైందన్నారు. ఇప్పుడు పార్టీ ఆఫీసులో పెడబొబ్బలు పెడుతున్న హరీశ్‌రావు.. కమిషన్ ముందు ఎందుకు ఈ వివరాలు చెప్పుకోలేదని ప్రశ్నించారు. కమిషన్ నివేదికపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న భయం వాళ్లను వెంటాడుతోందన్నారు. నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని.. కాళేశ్వరంలో దోషులుగా తేలినవారు అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని ఆహ్వానించిందని చెప్పారు. ఫాంహౌస్‌లో మామ డైరెక్షన్, పార్టీ ఆఫీసులో అల్లుడి యాక్టింగ్ ఇకనైనా ఆపి.. అసెంబ్లీకి వచ్చి తప్పులు ఒప్పుకొని, ప్రజలకు క్షమాపణలు చెప్పాలని హితవు పలికారు. కాగా, ఉమ్మడి రాష్ట్రంలోనే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం జీవో ఇచ్చారని ఉత్తమ్ చెప్పారు. తమ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌కు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని.. ఏ ప్రాజెక్టుకైనా భూసేకరణ పూర్తి కాకుండా బిల్లులు చెల్లించవద్దని సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

పదేళ్లలో రూ.లక్ష కోట్లు కట్టాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

మరో రూ.41,638 కోట్లు.. వెరసి రూ.లక్ష కోట్లకుపైనే చెల్లించాల్సి ఉంది. ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక్క ఆర్ఈసీ నుంచే రూ.30,536 కోట్ల రుణం మంజూరవగా.. అందులో రూ.16 వేల కోట్లను ప్రస్తుతం కట్టాల్సి ఉంది. ఇటీవలే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈఆర్సీ సీఎండీని కలిసి రుణాలను రీ షెడ్యూలింగ్ చేయాలని విజ్ఞప్తి చేసినా ఫలితం దక్కలేదు. అయితే కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌ను నిరర్థక సంస్థ (ఎన్‌పీఏ)గా ప్రకటిస్తే.. రుణాలను రీ షెడ్యూల్ చేస్తామని ఆర్ఈసీ తెలిపింది. అదే జరిగితే తెలంగాణ ప్రభుత్వ రుణ పరపతిపైనా తీవ్రప్రభావం పడనుంది.



స్వల్పకాలం.. వడ్డీ భారం

ఆర్ఈసీ నుంచి 10.90 శాతం వడ్డీకి స్వల్పకాలిక రుణం తీసుకోవడంతో చెల్లింపులు పెనుభారంగా మారాయి. దీంతో స్వల్పకాలిక రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా మార్చుకుంటే చెల్లింపుల ఖర్చు తగ్గి.. బడ్జెట్‌లో కేటాయించిన ప్రాజెక్టుల నిర్మాణాలకు వెచ్చించవచ్చని కాంగ్రెస్ సర్కారు భావించింది. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలిశారు. కాగా, కాళేశ్వరం కార్పొరేషన్‌కు పీఎఫ్‌సీ నుంచి రూ.37,737 కోట్లు, ఆర్ఈసీ నుంచి రూ.30,536 కోట్లు మంజూరయ్యాయి. వీటిని దీర్ఘకాలిక రుణాలుగా మార్చి, రాయితీ లేదా వడ్డీని తగ్గించే అవకాశాలు ఉన్నాయా? అని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించగా.. అలాంటిదేం లేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి జవాబు ఇచ్చారు. అయితే రుణాలు రీస్ట్రక్చరింగ్ అయితే భారం తగ్గుతుందని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు చేసిన ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో అప్పులు కట్టడానికే నిధులన్నీ కరిగిపోనున్నాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రుణాలకు 2021-22లో వడ్డీ కింద రూ.143.74 కోట్లు.. అసలు రూ.69 కోట్లు కలిపి మొత్తం రూ.213.44 కోట్లు చెల్లించారు. 2022-23లో వడ్డీ ఏకంగా రూ.3375.83 కోట్లు కాగా.. అసలు రూ.1890.95 కోట్లు కలుపుకొని రూ.5266.78 కోట్లు కట్టాల్సి వచ్చింది. ఇక 2023-24లో రూ.10859.76 కోట్లు కిస్తీ కింది చెల్లించాల్సి ఉంది. 2024-25లో ఈ భారం రూ.13 వేల కోట్లకు చేరనుంది. ఇది 2033-34 సంవత్సరం దాకా ఉండనుంది. అంటే మరో పదేళ్లు ఇలా చెల్లింపులు చేస్తూ ఉంటేనే కాళేశ్వరం బాకీ తీరనుంది.

నిరుపయోగంగా ప్రాజెక్టు..

కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్-1 మూడేళ్లుగా నిరుపయోగంగానే ఉంది. ఏటా ఇందులో సమస్యలే. 2021 వరదలకు సిరిపురం(అన్నారం) పంప్‌హౌస్ నీట మునిగింది. 2022 వరదలకు కన్నెపల్లి(మేడిగడ్డ) పంప్‌హౌస్ పూర్తిగా దెబ్బతింది. పంప్‌హౌస్ రక్షణ గోడ మోటార్లపై పడడంతో మోటార్లు ధ్వంసమయ్యాయి. ఇక 2023 అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీలో 11 పిల్లర్లున్న ఏడో బ్లాకు కుంగింది. ఆ తర్వాత అన్నారం, సుందిళ్లలో సీపేజీలతో బుంగలు ఏర్పడ్డాయి. ఓ వైపు ప్రాజెక్టు రుణ భారం ప్రభుత్వానికి తలనొప్పిగా మారగా.. మరోవైపు ప్రాజెక్టులోని లింక్-1 నిరుపయోగంగా మారింది.

కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల వివరాలు

సంస్థలు	ఇచ్చిన రుణం (రూ.కోట్లలో)	వడ్డీ శాతం	రీపేమెంట్ ముగిసేది	చెల్లింపు	వాయిదాలు
యూబీఐ	7400	8.25	30-6-2022	31-3-2034	48 త్రైమాసికాలు
పీఎన్‌బీ	11400	8.25	30-6-2022	31-3-2034	48 త్రైమాసికాలు
బ్యాంక్ ఆఫ్ బరోడా	2150	8.25	30-06-2022	31-3-2034	48 త్రైమాసికాలు
పీఎఫ్‌సీ	25312	9.45,10.90	15-10-2022	15-7-2034, 15-09-2034	48-144 వాయిదాలు
నాబార్డ్ లోన్-1	1500	9.75	30-6-2021	31-3-2033	48 త్రైమాసికాలు
నాబార్డ్ లోన్-2	4674.83	7.80	31-12-2022	30-09-2034	48 త్రైమాసికాలు
నాబార్డ్ లోన్-3	2051.14	7.80	30-9-2023	30-6-2035	48 త్రైమాసికాలు
ఆర్ఈసీ లింక్-1	4657.95	10.90	30-9-2023	30-8-2035	144 నెలలు
ఆర్ఈసీ లింక్-2	11784.70	10.90	1-6-2023	1-5-2035	144 నెలలు
ఆర్ఈసీ లింక్-4	14093	10.90	30-9-2023	30-8-2035	144 నెలలు





రాష్ట్ర సాధనే శ్వాసగా పోరాడిన యోధుడు జయశంకర్

- పాటతోనే ప్రజలను చైతన్యపరిచిన వ్యక్తి గద్దర్
- నేడు జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా వారిని గుర్తుచేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాధన కోసం పోరాడిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్, ప్రజాయుద్ధ నౌక గద్దర్ సేవలను సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా వారిద్దరి కృషిని గుర్తుచేసుకున్నారు. జయశంకర్ తన జీవితాన్ని రాష్ట్ర సాధ న కోసం పూర్తిగా అంకితం చేశారన్నారు. ఆయన జీవితమంతా తెలంగాణ కోసం కలలు కంటూ, ఉద్యమానికి మార్గదర్శనం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను, స్ఫూర్తిని కొనసాగిస్తామని, అందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ సాధన ఉద్యమానికి గద్దర్ ఆయువుపట్టుగా నిలిచారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పాటనే తన ఆయుధంగా మలుచుకుని ప్రజలను చైతన్య పరిచారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమానికి ఊపిరి పోసిన వారిలో గద్దర్ అగ్రగణ్యుడని, ఆయన నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి వరకు పోరాడారని తెలిపారు. కాగా, రాష్ట్ర సాధన కోసం మలి దశ ఉద్యమ పోరాటంలో జయశంకర్ అందించిన స్ఫూర్తి మరువలేనిదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు.

నివేదిక అసెంబ్లీకి వచ్చాకే కాళేశ్వరంపై స్పందిస్తాం

- రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ కోరాలి
- రైతులను ముంచిన బీఆర్ఎస్, కాంగ్రెస్
- రాష్ట్రంలో యూరియా కొరత లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



పెద్దపల్లి/మంచిర్యాల/హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను అసెంబ్లీలో చర్చకు పెట్టకముందే కాంగ్రెస్ లీకులు ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో బహిర్గతం చేసిన తర్వాతనే తాము స్పందిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం పెద్దపల్లిలో జరిగిన బీజేపీ కార్యకర్తల జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో, మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో జరిగిన రైతు సమ్మేళనంలో రాంచందర్‌రావు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతలో డొల్లతనాన్ని గతంలోనే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు బయటపెట్టారని, దీనిపై సీబీఐ విచారణ కోరాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియాను బ్లాక్ చేస్తూ కొరత సృష్టిస్తోందని ఆరోపించారు. 9 లక్షల టన్నుల డిమాండ్‌కుగాను కేంద్రం తెలంగాణకు 12 లక్షల టన్నుల యూరియా సరఫరా చేసిందని తెలిపారు. రైతులకు మాయ మాటలు చెప్పి నట్టేట ముంచింది టీఆర్ఎస్ పార్టీనే అని అన్నారు. పదేళ్లలో రైతు బీమా, రుణ మాఫీ పేరుతో కాలం వెళ్లదీసిందని విమర్శించారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేక, రైతు భరోసా సరిగా ఇవ్వలేక సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు రైతులు బుద్ధి చెప్పాలని, రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న బీజేపీకి మద్దతు పలకాలని రాంచందర్‌రావు కోరారు.

8న సిట్ విచారణకు సంజయ్

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఈ నెల 8న సిట్ విచారణకు హాజరుకానున్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు సంజయ్ లేఖ రాశారు. సంజయ్‌తో పాటు ఆయన వ్యక్తిగత సిబ్బంది కూడా విచారణకు హాజరవుతారు. ఫోన్ ట్యాపింగ్‌పై సంజయ్‌కి కేంద్ర నిఘా వర్గాలు ఇప్పటికే కీలక సమాచారం, ఆధారాలను అందజేశాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

హోంమంత్రిగా అమిత్‌షా రికార్డు

కేంద్ర హోం మంత్రిగా సుదీర్ఘకాలం(ఇప్పటికి 2,258 రోజులు) పనిచేసిన నేతగా అమిత్‌షా చరిత్ర సృష్టించారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ సందర్భంగా అమిత్ షా పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారని ప్రశంసించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో, అమిత్‌షా మార్గదర్శకంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని సంజయ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

అవసరమైతే మళ్లీ రాజీనామా!

మునుగోడు ప్రజల కోసం ఏ త్యాగమైనా చేస్తా.. గతంలో రాజీనామా చేస్తే ప్రభుత్వమే దిగొచ్చింది

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు



సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి పదవికి సంబంధించి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే ఎమ్మెల్యే పదవికి మళ్లీ రాజీనామా చేసేందుకు సిద్ధమన్న సంకేతాలిచ్చారు. గతంలో రాజీనామా చేస్తే ప్రభుత్వమే మునుగోడు ప్రజల వద్దకు దిగివచ్చిందన్నారు. మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు తనకు హామీ ఇచ్చారని, ఇస్తారో లేదో ఇక వారి ఇష్టమేనని వ్యాఖ్యానించారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మగూడెం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "నాకు కావాల్సింది మునుగోడు నియోజకవర్గ ప్రజలు.. వారి బాగోగులే. నాకు మంచి జరిగితే వాళ్లకు మంచి జరుగుతుంది. వాళ్ల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంతదూరమైనా వెళతా.. ఏ త్యాగమైనా చేస్తా. పోయినసారి నేను రాజీనామా చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం, 100 మంది ఎమ్మెల్యేలు మునుగోడు ప్రజల కాళ్లవద్దకు రాలేదా? మళ్లీ అంతదూరమైనా వెళతా" అని అన్నారు. తాను ఏదైనా మాట్లాడితే మంత్రి పదవి రాలేదు కాబట్టి మాట్లాడుతున్నా అంటున్నారని తప్పుబట్టారు. మంత్రి పదవే కావాలనుకుంటే ఎల్బీనగర్‌లో పోటీచేస్తే వచ్చేదని, కానీ.. తనకు మునుగోడు ప్రజలు, ఈ ప్రాంత అభివృద్ధి ముఖ్యమని, అందుకే ఇక్కడే పోటీ చేశానని చెప్పారు. తనను ఎవరైనా 'మంత్రి పదవి కావాలా? మునుగోడు ప్రజలు కావాలా?' అని అడిగితే మునుగోడు ప్రజలు, వారి అభివృద్ధినే కోరుకుంటానని స్పష్టం చేశారు.

పెద్ద పదవి వస్తే ప్రజలకే ఉపయోగం..

తాను పదవుల కోసం పాకులాడే వాడిని కాదని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అదృష్టం ఉండి ఇంతకంటే పెద్ద పదవి వస్తే అది ప్రజలకే ఉపయోగపడుతుందన్నారు. అంతే తప్ప పెద్ద పెద్ద పదవులు అడ్డం పెట్టుకుని పైరవీలు చేసుకొని వేల కోట్లు దోచుకునే వాడిని కాదన్నారు. ప్రజల కోసమే పార్టీ మారి కాంగ్రెస్‌లోకి వచ్చానని తెలిపారు. మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, పదవి ఇస్తారో .. ఇవ్వరో వారి ఇష్టమన్నారు. తాను కూడా సీనియర్‌ను, తెలంగాణ ఉద్యమంలో ఉన్నవాడినని అన్నారు. తన కన్నా జూనియర్లకు, నిన్న మొన్న పార్టీ మారి వచ్చినవాళ్లకు పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీలోకి రమ్మంటే నమ్ముకుని వచ్చామని, ఎంపీని గెలిపించమంటే గెలిపించామని, తనకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. పదవులు, పైసలు ఆయనే (సీఎం రేవంత్‌రెడ్డి) తీసుకుపోతున్నారని, పదవులు లేకున్నా కనీసం పైసలన్నా మునుగోడు నియోజకవర్గానికి రావాలి కదా! అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్ నియోజకవర్గానికి రూ.5 వేల కోట్ల నిధులు తీసుకుపోయిన వ్యక్తి నుంచి తనకు నిద్రపట్టడం లేదన్నారు. మునుగోడు అభివృద్ధి రాజీ పడకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

హైదరాబాద్- అమరావతి రోడ్డును విస్తరించండి

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ రహదారిని మల్కాపూర్ నుంచి అమరావతి వరకు నాలుగు లేన్ల నుంచి ఆరు వరుసలకు విస్తరించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. సర్వీస్ రోడ్లు నిర్మించాలన్నారు. ఢిల్లీలో ఎంపీలు రఘురామిరెడ్డి, సురేష్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్, వంశీకృష్ణ, ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రికి కోమటిరెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎన్‌హెచ్-65ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంచనాలు పంపితే.. 15న ఆర్థిక సంఘం సమావేశంలో ఆమోదం తెలిపి, టెండర్లు ఆహ్వానిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. సంగారెడ్డి-చౌటుప్పల్ మధ్య రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనులతోపాటు దక్షిణ భాగం కూడా యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని కోరినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో చింతలకుంట చెక్ పోస్టు నుంచి హయత్‌నగర్ ఆలిండియా రేడియో స్టేషన్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని కోరామన్నారు.

జోడువాగు రోడ్డు సమస్యను పరిష్కరించాలి

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని జోడువాగు రోడ్లు, నేషనల్ హైవే 63 ఏళ్లుగా డీపీఆర్ దశలోనే ఆగిందని, సమస్యను పరిష్కరించాలని నితిన్ గడ్కరీని మంత్రి వివేక్ కోరారు. తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, ఐటీఐ హబ్‌లు ఏర్పాటు చేయాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరికి వివేక్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పనిదినాలు పెంచాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క కోరారు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్ కోసం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాలో 2.24 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, దీనిని వెంటనే సరఫరా చేయాలని కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను ఎంపీ చామల కిరణ్‌కుమార్ లేఖలో కోరారు.



గడ్కరీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

మా తమ్ముడికి మంత్రి పదవి హామీపై నాకు తెలియదు: మంత్రి కోమటిరెడ్డి

తన తమ్ముడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై కాంగ్రెస్ అధిష్ఠానం హామీకి సంబంధించి తనకు సమాచారం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సోదరుడికి మంత్రి పదవి ఇచ్చే స్థాయిలో తాను లేనని, అది తన చేతుల్లో పని కాదని అన్నారు. "మాది జాతీయ పార్టీ. అగ్రనాయకత్వం సీఎం అభిప్రాయాలు తీసుకుని.. ఆయన అనుమతితో మంత్రి పదవులపై నిర్ణయం తీసుకుంటుంది. అందులో ఎవరి ప్రమేయమూ ఉండదు. పార్టీలోకి తీసుకునే ముందు మాట ఇచ్చారనే విషయం నాకు తెలియదు. వారు ఇస్తే సంతోషమే. హై కమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా సమర్థిస్తా. నేను సీఎం రేసులో లేను.. మంత్రి రేసులోనూ లేను. మంత్రి పదవి ఇచ్చారు తీసుకున్నాను" అని మంత్రి వెంకటరెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడుతోందన్న ఆరోపణలపై స్పందిస్తూ కక్ష సాధించేందుకు రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉంటే కదా? అని ఎద్దేవా చేశారు. ఇక సినిమా టికెట్ ధరలు పెంచినట్లే సినీ కార్మికుల వేతనాలు కూడా పెంచాల్సిన అవసరం ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు.

బలవన్మరణాల రేటులో ఐదో స్థానం!

- 2018-22 మధ్య రాష్ట్రంలో 43,729 ఆత్మహత్యలు
- ప్రతి లక్ష జనాభాకు 26 బలవన్మరణాల నమోదు
- జాతీయ సగటుకు రెండితలపైనే.. టాప్‌లో సిక్కిం
- ఏపీ కాస్త మెరుగు.. అక్కడ ఆత్మహత్యల రేటు 16.8

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బలవన్మరణాలు పెరుగుతుండటం కలవరపాటుకు గురిచేస్తోంది. ఆత్మహత్యల్లో జాతీయ సగటుకు రెండింతలకు మించి తెలంగాణలో ఆత్మహత్యలు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా ప్రతి లక్ష మందిలో 12.4 మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. తెలంగాణలో ఈ రేటు 26.3గా ఉంది. ఈ మేరకు ఆత్మహత్యల రేటులో తెలంగాణ దేశంలో ఐదో స్థానంలో ఉంది. ఏపీలో ఆత్మహత్యల రేటు 16.8గా ఉంది. రాజ్యసభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు ఆత్మహత్యలపై 2018-22 మధ్యకాలానికి సంబంధించిన వివరాలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ సభ ముందు ఉంచింది. ఆ జాబితా ప్రకారం 2018 నుంచి 2022 వరకు ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 7,61,648 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. 2018లో 1,34,516 మంది ఆత్మహత్యకు పాల్పడితే.. 2022లో 1,70,924 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 2018లో ప్రతి లక్ష జనాభాకు సూసైడ్ రేటు 10.2గా ఉంటే.. 2022 నాటికి అది 12.4కు పెరగడం గమనార్హం. కేంద్రం ప్రకటించిన జాబితా ప్రకారం దేశవ్యాప్తంగా మొత్తం ఆత్మహత్యల్లో 5.8శాతం తెలంగాణలోనే నమోదవుతున్నాయి. ఆ ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 7,61,648 మంది ఆత్మహత్య చేసుకుంటే వీరిలో రాష్ట్రం నుంచి 43,729 మంది ఉన్నారు. మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్ల జరుగుతున్న ఆత్మహత్యల్లో తెలంగాణ ఎనిమిదో స్థానంలో ఉన్నట్లు ఆ జాబితా వెల్లడించింది. 2018-22 మధ్య మానసిక ఆరోగ్య సమస్యల కారణంగా 63,331 మంది ఆత్మహత్య చేసుకుంటే.. వీరిలో 2,590 మంది (4.08శాతం) తెలంగాణ నుంచి ఉన్నారు. ఆత్మహత్యల రేటులో సిక్కిం మొదటి స్థానంలో ఉంది. అక్కడ 2022లో ప్రతి లక్ష జనాభాకు సూసైడ్ రేటు 42.8గా ఉంది. అంటే.. జాతీయ సగటుకన్నా మూడు రెట్లు ఎక్కువ! సిక్కిం తర్వాత స్థానం అండమాన్ నికోబార్‌ది. అక్కడ రేటు 42.5గా ఉంది. చత్తీస్‌గఢ్‌లో (28.5), తమిళనాడు (25.9), కర్ణాటక (20.2), గోవాలో (19.2), మహారాష్ట్ర (18.1), మధ్యప్రదేశ్ (17.9), త్రిపుర (17.3), ఢిల్లీ (16.2)లో జాతీయ సగటుకు మించి ఆత్మహత్యలు నమోదయ్యాయి.

టెలికాల్స్‌లోనూ రాష్ట్రం రెండోస్థానం

మానసిక ఆరోగ్యానికి సంబంధించి 10 అక్టోబరు 2022న కేంద్రం 'నేషనల్ టెలి మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా క్వాలిటీ మెంటల్ హెల్త్ కౌన్సెలింగ్‌ను ఇస్తున్నారు. ఈ ఏడాది జూలై చివరి నాటికి దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాల్లో 53 టెలిమానస్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. మొత్తం 20 భాషల్లో రోగులకు సేవలందిస్తున్నారు. కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి జూలై 31 వరకు మొత్తం 24 లక్షల కాల్స్ వచ్చినట్లు కేంద్రం వెల్లడించింది. చైన్నెలోని 104 హెల్ప్‌లైన్‌కు అత్యధికంగా 2.48 లక్షల కాల్స్ రాగా, ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కేంద్రానికి 1,61,477 కాల్స్ వచ్చినట్లు కేంద్రం తెలిపింది. కేంద్రం టోల్‌ఫ్రీ హెల్ప్ లైన్ నంబరు 14416ను ఏర్పాటు చేసింది. కాల్ చేసే వారు తమకు నచ్చిన భాషను ఎంచుకొని వైద్యులతో మాట్లాడొచ్చు.

తాను నీళ్లలోకి దూకి.. ఇద్దరిని చావులోకి నెట్టింది

- భర్తతో గొడవ పడి బావిలో దూకిన భార్య.. సురక్షితంగా ఒడ్డుకు
- కాపాడేందుకు నీళ్లలో దూకిన భర్త, సోదరి మృతి

మోమిన్‌పేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకునేందుకు బావిలో దూకిన ఆమె ప్రాణాలతో బయటపడింది. ఆమెను రక్షించేందుకు నీళ్లలోకి దూకిన ఆమె భర్త, సోదరి మాత్రం ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన వికారాబాద్ జిల్లాలో జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన గగ్గుల మాసయ్య (60), అలివేలు భార్యాభర్తలు. ఈ దంపతులు, వారి కుటుంబ సభ్యులు మూడు నెలల క్రితం మోమిన్‌పేట్ మండలంలోని చీమలదరి గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు వెంచర్‌లో పని చేసేందుకు వచ్చారు. సోమవారం రాత్రి మాసయ్య, అలివేలు గొడవపడ్డారు. భర్త తీరుతో మనోవేదనకు గురైన అలివేలు ఆ వెంచర్‌కు ఆనుకొని ఉన్న బావిలోకి దూకింది. భార్యను కాపాడేందుకు మాసయ్య..ఆ వెంటనే అలివేలు చెల్లెల నాగమణి (50)బావిలోకి దూకారు. గమనించిన వెంచర్ కాంట్రాక్టర్ ప్రసాద్ బావి దగ్గరకు పరుగెత్తుకొచ్చి ముగ్గురినీ బయటకు తీసేందుకు నీళ్లలోకి దూకాడు. అతడు.. అలివేలును సురక్షితంగా ఒడ్డుకు చేర్చాడు. మాసయ్య, నాగమణి అప్పటికే నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. అలివేలును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తు కొనసాగుతోంది

- స్టేటస్ రిపోర్టు దాఖలుకు సమయం ఇవ్వండి
- సుప్రీంకోర్టును కోరిన తెలంగాణ ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. స్టేటస్ రిపోర్టు దాఖలు చేసేందుకు కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. బీఆర్ఎస్ హయాంలో ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించి అభియోగాలు ఎదుర్కొంటున్న ప్రభాకర్‌రావు బెయిల్ పిటిషన్ మంగళవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ విశ్వనాథన్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. దర్యాప్తు కొనసాగుతోందని, స్టేటస్ రిపోర్టు దాఖలుకు సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది కోరారు. ఆ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను 25కు వాయిదా వేసింది. అప్పటిదాకా ప్రభాకర్‌రావుకు మధ్యంతరరక్షణ కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది.

తొమ్మిదేళ్ల బాలికపై యువకుడి అత్యాచారయత్నం

- దామగుండం నేవీ రాడర్ కేంద్రంలో ఘటన

పూడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆడుకుంటున్న తొమ్మిదేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారయత్నం చేశాడు. ఈ ఘటన మంగళవారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం నేవీ రాడార్ కేంద్రంలో జరిగింది. ఓ మహిళ నాలుగు రోజుల కిందట తన తొమ్మిదేళ్ల కూతురు, తమ్ముడు, మామతో కలిసి నేవీ రాడార్ కేంద్ర నిర్మాణ కూలీ పనులకు వచ్చింది. మంగళవారం ఆమె పనికి వెళ్లగా ఆమె కూతురు వారు నివాసం ఉండే షెడ్డు బయట ఆడుకుంటోంది. అక్కడే నిర్మాణ కూలీగా పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన కృష్ణకుమార్ (24) అనే యువకుడు ఆ బాలికను షెడ్డులోకి తీసుకువెళ్లి ఆమెపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. భయపడిన బాలిక గట్టిగా కేకలు వేయడంతో ఆ పక్కన పనులు చేస్తున్న కూలీలు, స్థానికులు అక్కడికి వచ్చారు. నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారును వెనుక నుంచి ఢీకొన్న మరో కారు

- డివైడర్‌ను దాటి లారీ కిందకు దూసుకెళ్లడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

మొయినాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మృగవని జింకల పార్కు వద్ద వెనకాల నుంచి అతి వేగంగా వచ్చిన ఓ కారు ముందు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముందు వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను దాటి అటుగా వస్తున్న ఓ లారీ కిందకు దూసుకెళ్లడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. హైదరాబాద్ నార్సింగికి చెందిన సిద్దార్థ (27) ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం సిద్దార్థ నార్సింగి నుంచి మొయినాబాద్ వైపు తన కారులో వెళ్తుండగా, మృగవని జింకల పార్కు వద్ద వెనకాల నుంచి అతి వేగంగా వస్తున్న మరోకారు అతని కారును బలంగా ఢీకొట్టింది. దాంతో సిద్దార్థ కారు డివైడర్ పైనుంచి రోడ్డు అవతలివైపుకు దూసుకెళ్లి మొయినాబాద్ నుంచి హైదరాబాద్ వస్తున్న లారీ కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో సిద్దార్థ అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దార్థ కారును వెనకాల నుంచి ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్లిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగించి.. చెవుల్లో పురుగుల మందు పోయించి

భర్తను చంపించిన భార్య.. కరీంనగర్‌లో ఘటన.. భార్య, ఆమె ప్రియుడు, మరో వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తన భర్త కనబడటం లేదంటూ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఆపై.. ఆచూకీ కోసం వెతుకుతుండగా ఓ చోట అతడి మృతదేహం కనిపించిందంటూ పోలీసులకు చెప్పింది. సహజంగానే అనుమానించిన పోలీసులు గట్టిగా ప్రశ్నించడంతో తానే మరో ఇద్దరితో భర్తను చంపించినట్లు ఒప్పుకొంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈ ఘటన జరిగింది. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణం అని పోలీసుల విచారణలో తేలింది. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఐలవేని సంపత్ (45), రమాదేవి భార్యాభర్తలు. వీరికి ఇరవైఏళ్ల వయసు నిండిన కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంపత్ కరీంనగర్‌లోని గ్రంథాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. రమాదేవి సర్వపిండి విక్రయిస్తోంది. ఆమె వద్ద కరీంనగర్‌కే చెందిన కర్రె రాజయ్య (50) తరచూ సర్వపిండి కొనేవాడు. ఇద్దరి మధ్య ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. అప్పటికే భర్త మద్యానికి పూర్తిగా బానిసై తనను శారీరకంగా హింసిస్తుండటం, మరో వ్యక్తితో తనకు అనుబంధం ఏర్పడటంతో సంపత్‌ను అడ్డు తొలగించుకోవాలని రమాదేవి పథకం వేసింది. ప్రియుడు రాజయ్య, తన దూరపు బంధువు కీసరి శ్రీనివాస్ (35)తో కలిసి భర్త హత్యకు పథకం వేసింది. ఎవరి చెవుల్లోనైనా పురుగుల మందు పోస్తే ఆ వ్యక్తి చనిపోతాడనే విషయాన్ని గతంలో యూట్యూబ్ ద్వారా తెలుసుకున్న రమాదేవి అదే పద్ధతిలో భర్తను చంపాలని రాజయ్య, శ్రీనివాస్‌కు చెప్పింది. ఆ ఇద్దరు కలిసి పార్టీ చేసుకుందాం అంటూ జూలై 29న సంపత్‌కు ఆఫర్ చేశారు. అదేరోజు బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్దకు రావాలని వారు చెప్పడంతో సంపత్ అక్కడికి వెళ్లాడు. అక్కడ ముగ్గురు కలిసి మద్యం తాగారు. మత్తు ఎక్కువై సంపత్ తూలుతూ కింద పడిపోగానే.. రాజయ్య, శ్రీనివాస్ కలిసి అతడి చెవుల్లో అప్పటికే వెంటతెచ్చుకున్న గడ్డిమందును పోశారు. కొద్దిసేపటికి సంపత్ చనిపోయాడు. ఈ విషయాన్ని ఘటనాస్థలి నుంచే ఆ ఇద్దరు రమాదేవికి ఫోన్ చేసి చెప్పి ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. ఆ మర్నాడు.. భర్త కనిపించడం లేదంటూ రమాదేవి



ఐలవేని సంపత్(ఫైల్)

పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంపత్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లుగా రమాదేవి, రాజయ్య, శ్రీనివాస్ నటించారు. ఆగస్టు 1న మృతదేహాన్ని గుర్తించినట్లు వారే పోలీసులకు సమాచారమిచ్చారు. అయితే.. భర్త మృతికి కారణం ఏమిటి? అని తెలుసుకునేందుకు ప్రయత్నించాల్సింది పోయి మృతదేహానికి పోస్టుమార్టం చేయొద్దంటూ ఆమె ప్రాథేయపడటంతో పోలీసులు అనుమానించారు. రమాదేవి కాల్‌డేటా, ఫోన్ లొకేషన్, సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ జరిపి.. ఆమెను, రాజయ్య, శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో తామే హత్యచేసినట్లు అంగీకరించారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆగిన చోటు నుంచే ఆరంభం!?

'ఫాంహౌస్' కేసులోని కీలక వ్యక్తులతోనే బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్?

- మునుగోడు ఉపఎన్నిక వేళ నలుగురు ఎమ్మెల్యేలకు ఎర వేశారంటూ రగడ
- నాడు బీజేపీ నేత సంతోష్ పేరు కేసులోకి
- నేడు సంతోష్‌ని కలిసిన మాజీ ఎమ్మెల్యే!

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కిందట జరిగిన మునుగోడు ఉప ఎన్నిక ముందు.. తమ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలకు బీజేపీ ఎర వేసిందంటూ నాటి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాదు, ఆ నలుగురు ఎమ్మెల్యేలను(గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, రేగా కాంతారావు) తనతో పాటు ప్రచారానికి తీసుకువెళ్లి.. బీజేపీ రూ.వంద కోట్లు ఇచ్చేందుకు సిద్ధపడినా, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడారంటూ వారిని ఆకాశానికి ఎత్తేశారు. ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టారంటూ బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్ పేరును కేసులోకి తెచ్చారు. ఈ క్రమంలో మూడేళ్ల తర్వాత బీజేపీ తన ఆపరేషన్ ఆకర్ష్‌ను మళ్లీ ప్రారంభించిందా? ఏ ఫాంహౌస్ నుంచైతే తమను లక్ష్యంగా చేసుకొని బీఆర్ఎస్ రాజకీయ రచ్చ చేసిందో.. అదే ఫాంహౌస్ కేసులోని కీలక వ్యక్తులతోనే రివర్స్‌గేమ్‌ను మొదలుపెట్టిందా? అంటే తాజా పరిణామాలు అవుననే అంటున్నాయి. నాడు ఫాంహౌస్‌లో సమావేశమైన నలుగురు ఎమ్మెల్యేల్లో ఇద్దరు (ప్రస్తుతం మాజీ) ఇటీవల బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్‌ని కలుసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. తాను ఈ నెల 9న బీజేపీలో చేరుతున్నట్లు గువ్వల ప్రకటించగా, మరో మాజీ ఎమ్మెల్యే కూడా త్వరలోనే కాషాయ కండువా కప్పుకోనున్నట్లు తెలిసింది. ఆయనతో పాటు బీఆర్ఎస్ మరో మాజీ ఎమ్మెల్యే కూడా బీజేపీలో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మునుగోడు ఉప ఎన్నికలో తాము గెలిచి ఉంటే రాష్ట్ర రాజకీయ ముఖచిత్రమే మారిపోయేదని కమలనాథులు అభిప్రాయపడుతున్నారు. ఉప ఎన్నిక ముందు ఆ ఘటన జరిగి ఉండకపోతే తప్పకుండా తామే గెలిచేవాళ్లమని, అప్పుడు రాజకీయ చిత్రమే మారిపోయేదని పేర్కొంటున్నారు. అందుకే ఎక్కడైతే తమ ప్రణాళిక ఆగిపోయిందో అక్కడి నుంచే బీఆర్ఎస్ లక్ష్యంగా రివర్స్‌ప్లాన్ మొదలు పెట్టిందని అంటున్నారు. ఈ వ్యవహారమంతటికీ ఫోన్ ట్యాపింగే కారణమని పార్టీ నేతలు అంతర్గత సంభాషణల్లో చెప్పుకొంటున్నారు.

బీఆర్ఎస్ లక్ష్యంగా పావులు..

కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం, అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న బీఆర్ఎస్‌ను మరింత దెబ్బతీయడమే లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం పావులు కదుపుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయశక్తిగా ఎదిగే క్రమంలో బీఆర్ఎస్‌లో జరుగుతున్న పరిణామాలను తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో బీజేపీని లక్ష్యంగా చేసుకొని, పనిచేసిన బీఆర్ఎస్ నేతలనూ ఆకర్షించేందుకు పార్టీ అగ్రనాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందా? సొంత పార్టీలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కొందరు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు బీజేపీవైపు దృష్టి సారించారా? అంటే అవుననే అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గణనీయంగా సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ నాయకత్వం అందుకోసం సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఈ క్రమంలో బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేసేందుకే ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరతీసిందన్న ప్రచారం జరుగుతోంది.

బీఆర్ఎస్ విలీనమైనా కేటీఆర్‌తోనే ఉంటాం

- మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ స్పష్టీకరణ

నాగర్‌కర్నూల్/కందనూలు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌ను తాము ఎట్టిపరిస్థితుల్లోనూ వీడబోమని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ మరోసారి స్పష్టం చేశారు. తమ పార్టీ మరో పార్టీలో విలీనమైనా తాము మాత్రం కేటీఆర్‌తోనే ఉంటామని, కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తామని కుండబద్దలు కొట్టారు. మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నాగర్‌కర్నూలులోని బీఆర్ఎస్ భవన్‌లో ఆ పార్టీ కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి మర్రి జనార్దన్‌రెడ్డి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను పార్టీ వీడనున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేశారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలపడంలో తాము పూర్తిగా విఫలమయ్యామని చెప్పారు. కాగా, చావైనా రేవైనా తాము బీఆర్ఎస్‌తోనే ఉంటామని బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ అన్నారు. గువ్వల బాలరాజు బీఆర్ఎస్‌ను వీడటం బాధాకరమన్నారు.

ప్రముఖ కథా రచయిత కోడూరి శ్రీరామమూర్తి కన్నుమూత



కోడూరి శ్రీరామమూర్తి (ఫైల్)

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథా రచయిత, సాహిత్య విమర్శకుడు కోడూరి శ్రీరామమూర్తి మంగళవారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. శ్రీరామమూర్తి లిటరరీ కాలమిస్టుగా, సమకాలీన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను విశ్లేషిస్తూ దినపత్రికల్లో వ్యాసాలు రాసే ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, సాహితీ విమర్శకుడిగా పలువురి మన్ననలను పొందారు. తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ పుస్తకం 1978లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నుంచి ఉత్తమ సాహిత్య విమర్శ గ్రంథంగా పురస్కారం పొందింది. తెలుగు కథ... నాడు-నేడు పుస్తకం 2007లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ సాహిత్య విమర్శనా గ్రంథంగా పురస్కారం పొందింది.

విమాన ఇంధనం దొంగిలించిన ముఠా అరెస్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విమాన ఇంధనాన్ని (ఏటీఎఫ్) దొంగిలించి, బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న ముఠాను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠా రోజుకు 5వేల లీటర్ల మేర ఏటీఎఫ్‌ను దొంగిలించి, నెలవారీగా రూ.1.62 కోట్ల నష్టం కలిగించినట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి ఢిల్లీ పోలీసులు (క్రైమ్ బ్రాంచ్) 10 మందిని అరెస్టు చేసి, గత జూన్ 26న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై మరింత దర్యాప్తు జరుగుతోంది. ఈ విషయాలను పార్లమెంటులో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా హోం శాఖ వెల్లడించింది.

నాగారం భూములపై జోక్యం చేసుకోవద్దు

- పిటిషనర్‌కు ఫోన్ చేసిన కానిస్టేబుల్‌ను హెచ్చరించిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వేనంబర్లు 181, 182, 194, 195లలోని వివాదాస్పద భూముల వ్యవహారంలో జోక్యం చేసుకుంటే సస్పెన్షన్‌కు గురవుతారని పోలీసులను హైకోర్టు హెచ్చరించింది. పిటిషనర్‌ను బెదిరించడం, కేసును ఉపసంహరించుకోవాలంటూ ఒత్తిడి తేవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. నాగారం భూములపై విచారణ కమిషన్ వేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని పేర్కొంటూ పడమటితండాకు చెందిన వడిత్య రాములు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. సర్వే నంబర్ 194లో తన 10 ఎకరాల భూమిని అక్రమంగా బదలాయించుకున్నారని రాములు ఆరోపించారు. మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ వెంకటేశ్ తనకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని.. ఆధార్ కార్డు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు రావాలని.. లేదా అరెస్ట్ చేస్తామంటున్నారని పేర్కొంటూ హైకోర్టులో మరో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. బెదిరించిన కానిస్టేబుల్ వెంకటేశ్‌ను మంగళవారం ధర్మాసనం ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. దీంతో మంగళవారం కానిస్టేబుల్ వెంకటేశ్ హైకోర్టు ఎదుట హాజరయ్యారు. "రాములుకు ఫోన్ చేశారా? ఎవరు చేయమంటే చేశారు? పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని బెదిరించారా?" అని కానిస్టేబుల్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. విలేజ్ హిస్టరీ రికార్డు నమోదులో భాగంగా, స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో) ఆదేశాల మేరకు ఫోన్ చేశానని, విచారణ కమిషన్ వేయాలన్న పిటిషన్ గురించి ఏమీ మాట్లాడలేదని కానిస్టేబుల్ బదులిచ్చారు. మరోసారి బెదిరించినట్లు తెలిస్తే సస్పెన్షన్‌కు ఆదేశిస్తామని ధర్మాసనం హెచ్చరించింది. ఇది దాదాపు 25 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు సంబంధించిన అంశమని, దేశవ్యాప్తంగా చర్చ సాగుతోందని.. ఇందులో పోలీసులు తలదూరిస్తే కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పింది. మరోసారి పోలీసులు జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది విజయలక్ష్మి కోరగా.. అవసరం లేదని పేర్కొన్న ధర్మాసనం.. విచారణను ముగించింది.

యాంత్రికంగా రిమాండ్ విధించొద్దు

- మేజిస్ట్రేట్ కోర్టులకు హైకోర్టు సూచన

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): క్రిమినల్ కేసుల్లో నిందితులకు యాంత్రికంగా జ్యుడీషియల్ రిమాండ్ విధించరాదని హైకోర్టు... మేజిస్ట్రేట్ కోర్టులకు సూచించింది. అరెస్ట్ చేసి.. 24 గంటల సమయం దాటిన తర్వాత కోర్టులో ప్రవేశపెట్టడంతో పాటు, ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో పోలీసులు అరెస్టు చేయడాన్ని తప్పుబట్టింది. మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో తనను మేజిస్ట్రేటు కోర్టు రిమాండ్ విధించడాన్ని సవాల్ చేస్తూ నిందితుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అరెస్టు చేసి 24 గంటల సమయం ముగిసిన తర్వాత కూడా గంటన్నర ఆలస్యంగా కోర్టులో ప్రవేశపెట్టడంతోపాటు ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులో నోటీసు ఇవ్వకుండా అరెస్టు చేయడాన్ని పశ్నించారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం కింది కోర్టు ఆదేశాలను తప్పుపట్టింది. పూచీకత్తులు తీసుకుని నిందితుడిని వదిలేయాలని సూచించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.